అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 29-01-2019 సమగ్ర తెలుగు దినపత్రిక


సంపుటి : 5 సంచిక : 31 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

ఉపాధి గోస..

పస్తుల్లో యువభారత్

- మహిళల్లో నిరుద్యోగులు 16.3 శాతం
- గ్రాడ్యుయేట్ మహిళల్లో 30.6 శాతం, పురుషుల్లో 9.9 శాతం
- అగ్ర కులాలతో పోలిస్తే ఎస్సీ,ఎస్టీ,బీసీల్లో అత్యధికం
- ప్రభుత్వరంగాన్ని నీరు గార్చడమే కారణమా..?





న్యూఢిల్లీ: దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయికి చేరుకున్నట్టు పలు సర్వేల్లో వెల్లడైన సంగతి తెలిసిందే. నిరుద్యోగుల్లోనూ మహిళల సంఖ్య అత్యధికంగా ఉన్నట్టు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ విస్తృతస్థాయిలో నిర్వహించిన సర్వే నివేదిక(స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా-2018) వెల్లడించింది. 15-25 ఏండ్ల వయసువారిలో నిరుద్యోగ మహిళలు 16.3 శాతం ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది. పురుషులతో పోలిస్తే ఇది అత్యధికమన్నది గమనార్హం. విద్యావంతుల్లోనూ ఈ వ్యత్యాసం కనిపిస్తుంది. గ్రాడ్యుయేట్ మహిళల్లో నిరుద్యోగులు 30.6 శాతం కాగా, పురుషుల్లో 9.9 శాతం. పీజీ పూర్తి చేసిన వారిలో నిరుద్యోగ మహిళలు 23.8 శాతం కాగా, పురుషులు 8.4 శాతం.


సామాజికవర్గాల్లో చూస్తే విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్య ఎస్సీ,ఎస్టీ,ఓబీసీల్లోనే అధికంగా ఉండటం గమనార్హం. ఈ వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించినా నిరుద్యోగుల్లో వీరే అధికంగా ఉండటానికి కారణం ప్రయివేట్ రంగంలోనే అధిక ఉద్యోగాలుండటమని అర్థమవుతోంది. నూతన ఆర్థిక విధానాలలో భాగంగా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ రంగాన్ని నీరుగార్చి ప్రయివేట్ రంగాన్ని ప్రోత్సహించాయి. తత్ఫలితంగా అణచివేతకు గురైన కులాల్లో నిరుద్యోగుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

గ్రాడ్యుయేట్లలో చూస్తే అగ్రకులాలవారిలో నిరుద్యోగుల సంఖ్య 10.5 శాతం కాగా, ఎస్సీలలో 18.7 శాతం, ఎస్టీల్లో 14.7 శాతం, ఓబీసీల్లో 15.7 శాతంగా నమోదైంది. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్లు అమలవుతున్నా ఎస్సీ,ఎస్టీ,ఓబీసీల్లో నిరుద్యోగులు అధికంగా ఉన్నారంటే వారిపై సామాజిక, సాంస్కృతిక వివక్ష కనిపించని కుట్రగా ...9లో

లింగ నిష్పత్తిలో అంతరాలు

కేరళ మినహా.. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రమాదకర స్థాయిలో బాలికలసంఖ్య

ఆంధ్రప్రదేశ్, కర్నాటకలో భారీగా పతనం



రాష్ట్రం	2007	2016	తేడా
ఆంధ్రప్రదేశ్	974	806	-168
కర్నాటక	1004	896	-108
తమిళనాడు	935	840	-95
ఒడిశా	919	858	-61
ఉత్తరాఖండ్	869	825	-44



చెన్నై: దక్షిణాది రాష్ట్రాలలో నవజాత శిశువుల లింగ నిష్పత్తిలో బాలికల నిష్పత్తి రోజురోజుకు దారుణంగా పడిపోతోంది. సాధారణంగా ఈ సమస్య అధికంగా ఉండే పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలలో నవజాత శిశువుల లింగ నిష్పత్తి (సెక్స్ రేషియో బర్త్) క్రమంగా తగ్గుతోందని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) వెలువరించిన సమాచారం ద్వారా వెల్లడైంది. 2007 నుంచి 2016 వరకు ఆయా రాష్ట్రాలలో ఎస్ఆర్‌బీలను విశ్లేషణ చేసి ఈ ఫలితాలను వెల్లడించారు. దీని ప్రకారం.. దక్షిణాది రాష్ట్రాలలో బాలికల ఎస్ఆర్‌బీ ప్రమాదంలో ఉన్నది. 2016లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రతీ వేయి మంది బాలురకు 806 మంది మాత్రమే బాలికలు ఉన్నారు. తమిళనాడులో ఈ సంఖ్య 2007లో 935గా ఉంటే 2016లో 840 మందికి పడిపోయింది. దేశ సగటు (877 మంది)తో పోల్చుకుంటే ఈ రెండు రాష్ట్రాల సంఖ్య ప్రమాదకర స్థాయిలో ...9లో

ఎంబీబీఎస్ పరీక్ష మరోసారి

ఫిబ్రవరి 12న తిరిగి ఫార్మాకాలజీ పేపర్-1

- కాళోజీ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం
- రెండు సెంటర్లకు వేర్వేరు సెట్ల జారీ
- వైద్య విద్యార్థులు, తల్లిదండ్రుల ఆగ్రహం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారుతున్నది. కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం నిర్వహించిన ఎంబీబీఎస్ పరీక్షల నిర్వహణలో గందరగోళం నెలకొనడమే ఇందుకు నిదర్శనం. ప్రశ్నపత్రంలో వర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు అయోమయ పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఒక్కో కేంద్రానికి వేర్వేరు సెట్లను పంపడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. దీంతో పరీక్ష ముగిసిన తరువాత ఫార్మాకాలజీ పేపర్-1ను రద్దు చేస్తున్నట్టు వర్సిటీ ప్రకటించింది. ఈ పరీక్షను ఫిబ్రవరి 12న నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. టెక్నికల్ కారణాల వల్ల పరీక్ష రద్దు చేశామని, మిగతా పరీక్షలు మాత్రం షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని వర్సిటీ అధికారులు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరంలో ఫార్మకాలజీ, ...9లో



కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

అనువాదంలో దక్కిన అవార్డు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

సీనియర్ జర్నలిస్టు, రచయిత ఎ.కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. ప్రముఖ డోగ్రీ కవయిత్రి పద్మా సచ్ దేవ్ రాసిన "ఎ హ్యాండ్‌ఫుల్ ఆఫ్ సన్ అండ్ అథర్ పోయిమ్స్"ని తెలుగులో ...9లో

వేములఘాట్ విజయం

ఎకరానికి రూ.11లక్షలు చెల్లించేందుకు ఒప్పుకున్న ప్రభుత్వం



(ఫైల్) వివరాలు 12లో

ఎస్టై పోస్టులకు తొలగిన అడ్డంకి

సింగిల్ జడ్జి ఆదేశాలపై డివిజన్ బెంచ్ స్టే వివరాలు 12లో

బీసీ గురుకులాలకు 3,689 పోస్టుల మంజూరు

ఆర్థిక శాఖ ఉత్తర్వులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ప్రారంభం కానున్న 119 బీసీ గురుకులాలకు పోస్టులు మంజూరయ్యాయి. మొత్తం 3,689 ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ ఆమోదం తెలుపుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 119 ప్రిన్సిపల్ పోస్టులు 1071 టీజీటీ, 833 జేఎల్, 833 పీజీటీ, పోస్టులు ఉన్నాయి. 119 చొప్పున ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీ, లైబ్రేరియన్, క్రాఫ్ట్, స్టాఫ్ నర్స్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ పోస్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీటితో పాటు ఔట్ సోర్సింగ్ విధానంలో మరో 595 పోస్టులు మంజూరయ్యాయి. 2019- 2020 విద్యా సంవత్సరం నుంచి నాలుగేండ్లలో పోస్టుల భర్తీకి అనుమతి లభించింది.

తెలంగాణ ఇన్‌చార్జిగా ప్రియాంక?

వచ్చే నెలలో రాష్ట్ర నాయకులతో రాహుల్ భేటీ

- పార్లమెంటు ఎన్నికలపై చర్చ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇటీవల క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్న ప్రియాంకగాంధీ...తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా రాబోతున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ముందస్తు ఎన్నికల్లో ఓడిపోయిన నైరాశ్యంలో ఉన్న కాంగ్రెస్‌కు భరోసా ఇచ్చేందుకు ప్రియాంక గాంధీకి బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతున్నది. పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ...ఇప్పటికే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా, పీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధిష్టానానికి లేఖలు రాశారు. కుంతియా మార్పుపై అధిష్టానం తొందరగానే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో కొత్త ఇన్‌చార్జిగా ప్రియాంక పేరు తెరపైకి వచ్చింది. పార్టీలో కీలకమైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర తూర్పు భాగానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు రెండుసార్లు ఓడించడంతో ఆ పార్టీ నేతల్లో నైరాశ్యం నెలకొంది. అధిష్టానం దూతగా ఉన్న ...9లో

మూడో విడతకు సర్వం సిద్ధం

ముగిసిన ప్రచారం

- రేపు పోలింగ్
- 4116 పంచాయతీలు
- 573 ఏకగ్రీవాలు
- 3,529 పంచాయతీల్లో పోలింగ్
- 11667 మంది అభ్యర్థులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూడో విడత పంచాయతీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ జరగనున్నది. సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. అభ్యర్థులు ఇక పోలింగ్ ...9లో

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే.సిక్రీ

- అసమానతలు తగ్గించేందుకు కృషిచేయాలి : జస్టిస్ డివై చంద్రచూడ్

అహ్మదాబాద్ : దేశంలో న్యాయ వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందనీ, ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో పడ్డాయనీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే.సిక్రీ ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ 9వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఆయన పై వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఏమన్నారంటే..."నేడు మనమంతా అనేకవిధాలుగా మార్పులకు లోనవుతున్నాం. 2500 సంవత్సరాల క్రితం గ్రీకులు ఇచ్చిన ప్రజాస్వామ్య భావనలు కూడా క్రమేణా మార్పు చెందుతూ ...9లో

హెచ్‌ఎండీఏ కమిషనర్ బదిలీ

'కోకాపేట్' కారణమా !

- రాజకీయ ఒత్తిళ్లకు లొంగనందుకే ఈ నజరానా?
- విదేశాల్లో ఉండగానే ఉత్తర్వులు..
- పెండింగ్‌లో పోస్టింగ్
- బదిలీ విషయంపై అధికార వర్గాల చర్చ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జనార్దన్‌రెడ్డికి పురపాలక శాఖలో సుదీర్ఘ అనుభవం.. సర్కార్‌కు సౌమ్యుడిగా పేరు.. జీహెచ్ఎంసీలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల నేపథ్యంలో (ఆగస్టు మాసం) జీహెచ్ఎంసీ నుంచి హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఆరునెలలు తిరగకుండానే ఆ సీనియర్ ఆఫీసర్‌పై సోమవారం బదిలీ వేటు పడింది. ఆయన విదేశాల్లో ఉండగానే బదిలీ చేయడంతో పాటు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలనశాఖలో రిపోర్ట్ చేయాలని సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ...9లో

పాతబస్తీలో మిత్తి దందా

అప్పలిచ్చేది ఛోటామోటా మజ్లిస్ లీడర్లే..!





హైదరాబాద్‌లోని పాతబస్తీ వేరుగా ఉంటుంది. అక్కడ జరిగే అరాచకాలు, అఘాయిత్యాలెన్నో. అయితే బయటకు వచ్చేవి కొన్నే. అక్కడ ఉండే కుటుంబాలు పెద్దవిగా ఉండటం.. ఆర్థికపరిస్థితీ అంతంత మాత్రంగానే ఉంటుంది. ఇలాంటి బల హీన బతుకులు మిత్తి దందాలో సాలెపురుగులా చిక్కుకుంటు న్నాయి. అవసరానికి అప్పు ఇచ్చిన చిరువ్యాపారులను కొందరు మజ్లిస్ లీడర్లు వడ్డీ, చక్రవడ్డీ పేరుతో భారీగా దండుకుంటు న్నారు. అనుకున్న సమయానికి ఇవ్వకపోతే వేధిస్తున్నారు. దాడులూ చేస్తున్నారు. చివరకు ఆస్తులనూ రాయించుకుంటు న్నారు. మిత్తి దందా బెదిరింపులకు భయపడి పోలీసు స్టేషన్లకెక్కని కేసులు కొన్నైతే..ఆత్మహత్యలకు పాల్పడిన వారూ లేకపోలేదు.

- వడ్డీ, చక్రవడ్డీల పేరుతో బలవంతపు వసూళ్లు
- చెల్లించకుంటే ఆస్తుల జప్తు
- బెదిరింపులతో బాధితుల ఫిర్యాదులు వెనక్కి.. వివరాలు 9లో

రైతాంగాన్ని ఆదుకోవాలి

వర్షాలతో నష్టపోయిన వారికి ఎకరాకు రు.20 వేలు చెల్లించాలి

- మద్దతు ధరకు తడిసిన ధాన్యాన్ని కొనాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తెలిపింది. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కల్లాల్లో ఉన్న పంట తడిసి పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే ఈ రైతులను గుర్తించి ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని కోరింది. తడిసిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు సిద్దిపేట, భూపాలపల్లి, జనగామ, మెదక్, ...9లో

మహిళపట్ల సిద్ద రామయ్య అనుచిత ప్రవర్తన

• ఫిర్యాదు చేస్తుండగా మైక్ లాక్కుని బెదిరించిన మాజీ సీఎం



బెంగళూరు : కర్నాటకలో జరిగిన సమావేశంలో ఒక మహిళ పట్ల కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ సీఎం సిద్ద రామయ్య అసభ్యంగా ప్రవర్తించారు. ఆమె కాంగ్రెస్‌పై ప్రతికూల వ్యాఖ్యలు చేస్తుండగా ఆగ్రహించిన సిద్ద రామయ్య ఆమె నుంచి మైక్ లాక్కుని కూర్చోవాల్సిందిగా అరిచారు. మైక్ లాక్కునే క్రమంలోనే ఆమె దుపట్టా కింద పడింది. ఈ ఘటన కర్నాటకలో మైసూరులోని గార్గేశ్వరి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం హల్‌చల్ చేస్తోంది. వరుణ తాలూకాలోని గార్గేశ్వరి గ్రామంలో జరిగిన కర్నాటక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ కార్యక్రమానికి సిద్ద రామయ్య హాజరయ్యారు. ఆ గ్రామానికి చెందిన మహిళ.. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చోటుచేసుకుంటున్నదని ఫిర్యాదు చేస్తుండగా సిద్ద రామయ్య అసహనానికి గురయ్యారు. ఆమెను అడ్డుకుని మైక్ లాక్కుని కూర్చోవాల్సిందిగా ఆదేశించారు. వరుణ అసెంబ్లీ నియోజకవర్గానికి సిద్ద రామయ్య కుమారుడు యతీంద్ర ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. సిద్ద రామయ్య ఆధునిక దుశ్శాసనుడని బీజేపీ విమర్శించింది.

ఏఎంయూ వీసీకి బెదిరింపులు

• ఏబీవీపీ నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినందుకు..

అలీగఢ్: ఏబీవీపీ నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారనే కారణంతో అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) వైస్ ఛాన్సలర్‌కు ఉత్తరప్రదేశ్ మంత్రి రఘురాజ్ సింగ్ నుంచి బెదిరింపులు ఎదురయ్యాయి. వివరాల్లోకెళ్తే.. మూడు రోజుల క్రితం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురు ఏబీవీపీ నాయకులు ఏఎంయూలో 'తిరంగ ర్యాలీ' పేరిట బైక్ ర్యాలీ తీశారు. ఏబీవీపీ నాయకుడు అజయ్ సింగ్ నేతృత్వంలో ఈ ర్యాలీ జరిగింది. అయితే ఎలాంటి అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు గానూ వర్సిటీ క్రమశిక్షణాధికారి మొహిసిన్ ఖాన్ వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంఘ వ్యతిరేక శక్తులు ర్యాలీలో పాల్గొన్నాయని, వర్సిటీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకే తాము ఈ నోటీసులు జారీ చేశామని ఆయన తెలిపారు. దీంతో, రంగంలోకి దిగిన మంత్రి రఘురాజ్.. వర్సిటీ వీసీని బెదిరించారు. విద్యార్థి నాయకులపై చర్యలు తీసుకుంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ముజఫర్‌నగర్ అల్లర్లకేసులు

ఉపసంహరణకు యూపీ సర్కారు ఆదేశాలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌పూర్‌లో గతంలో చోటుచేసుకున్న మత ఘర్షణలకు సంబంధించి పలువురు రాజకీయ నాయకులపై నమోదైన 18 కేసులను ఉపసంహరించుకోవాలని జిల్లా అధికారులకు యూపీ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. 2013లో జరిగిన ఈ ఘర్షణలలో దాదాపు 60 మంది పౌరులు చనిపోగా, ఘటనకు సంబంధమున్నదన్న ఆరోపణలతో 89 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా, రెండు వర్గాల మధ్య చిచ్చు పెట్టి ఘర్షణలకు కారణమైన వారిని రక్షించడానికి యూపీ సర్కారు ప్రయత్నిస్తున్నది. ఈ కేసులో 18 మందిపై నమోదైన కేసులను ఉపసంహరించాలని బీజేపీ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ముజఫర్‌పూర్ జిల్లా మెజిస్ట్రేట్ రాజీవ్ శర్మ మాట్లాడుతూ.. కేసుల ఉపసంహరణకు సంబంధించి మూడు రోజుల క్రితం తనకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ కేసులో నిందితులుగా రాజకీయ నాయకులెవ్వరూ లేరని తెలిపారు. కానీ, బీజేపీ ఎంపీ (ముజఫర్‌పూర్) సంజీవ్ బల్యాన్, శాసనసభ్యుడు సంగీత్ సోమ్‌లకు ఈ కేసుతో సంబంధమున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ఆ దేశ అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యం తగదు : ఏఐఏడబ్ల్యూయూ

న్యూఢిల్లీ : వెనిజులా అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని ఆల్ ఇండియా అగ్రికల్చరల్ వర్కర్స్ యూనియన్ (ఏఐఏడబ్ల్యూయూ) తీవ్రంగా ఖండించింది. వెనిజులా అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యం ప్రమాదకరమైనదే కాక అప్రజాస్వామికమైనదని పేర్కొంది. వెనిజులా ప్రతిపక్ష నేత జువాన్ గైడోకు చట్ట విరుద్ధమైన గుర్తింపునివ్వడం ద్వారా ఆ దేశ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకుంటోందని ఆరోపించింది. ఎటువంటి చట్టబద్ధమైన అనుమతి లేకుండానే ఒక బహిరంగ ర్యాలీలలో జువాన్ గైడో తనకు తానే స్వయంగా దేశాధ్యక్షుడిగా ప్రకటించుకోవడాన్ని తప్పు పట్టింది. నికోలస్ మదురో 2018 మే 20న చట్టబద్ధంగా దేశాధ్యక్షుడిగా ఎన్నికైన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసింది. అమెరికా కుట్రను మరొక అణచివేత చర్యగా పేర్కొంది.

భారత్ 'ఓడోమాస్'తో బాధపడుతోంది

• అమిత్ షాపై ఒమర్ అబ్దుల్లా విమర్శలు

శ్రీనగర్ : కేవలం మోడీ.. కేవలం అమిత్ షా అనే ఓవర్‌డోస్(ఓడోమాస్)తో భారత్ బాధపడుతోందని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాపై నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా విమర్శలు గుప్పించారు. ఓవర్‌డోస్ ఆఫ్ ఓన్లీ మోడీ ఓన్లీ షా(ఓడీఓఎంఓఎస్-ఓడోమాస్)తో ఇండియా బాధపడుతోందని ఆయన సోమవారం ట్వీట్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ.. వన్ ర్యాంక్ వన్ పెన్షన్(ఓఆర్‌ఓపీ)కి కట్టుబడగా.. కాంగ్రెస్ పార్టీ ఓన్లీ రాహుల్ ఓన్లీ ప్రియాంక(ఓఆర్‌ఓపీ)నిచ్చిందని అమిత్ షా హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ ర్యాలీలో కాంగ్రెస్‌పై విమర్శలు సంధించారు. ఈ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ఒమర్ పై విధంగా ట్వీట్ చేశారు.

పరిహారం పెంపుపై విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం

ఏప్రిల్‌లో భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసు విచారణ

న్యూఢిల్లీ : 1984 నాటి భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసులో బాధితులకు యూనియన్ కార్బైడ్, దాని అనుబంధ సంస్థలు రూ. 7,844 కోట్లను అదనపు నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరుతూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. వచ్చే ఏప్రిల్‌లో దీనిపై విచారణ చేపట్టనున్నట్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం తెలిపింది. 1984, డిసెంబర్ 2, 3 తేదీల్లో యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) సంస్థలో మిథేల్ ఇసోసైనేట్(ఎంఐసీ) లీక్ కావడంతో సుమారు మూడు వేల మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

ఇంగ్లీషు బదులు ఉర్దూలో ప్రశ్నాపత్రం

• ఆందోళనలో విద్యార్థులు

రాయ్‌పూర్: చత్తీస్‌ఘడ్‌లో అటల్ బీహారీ వాజ్‌పాయ్ వర్సిటీలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ప్రశ్నాపత్రాన్ని చూసి షాక్‌కు గురయ్యారు. సోషల్ వర్క్స్ ప్రశ్నాపత్రం ఆంగ్లానికి బదులుగా ఉర్దూలో ఉండటంతో ఖంగుతినడం విద్యార్థుల వంతైంది. వర్సిటీ నిబంధనల ప్రకారం పీజీలో పేపర్‌ను ఇంగ్లీషు, హిందీ భాషల్లో ముద్రించాలి కానీ దానికి భిన్నంగా ఉర్దూలో ముద్రించారు. ఈ పరిణామంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై విద్యార్థులు మాట్లాడుతూ...ఇచ్చిన పేపర్లోని భాష అర్థం కాకపోవడంతో చాలా ప్రశ్నలకు సమాధానం రాయలేక పోయామని విద్యార్థులు వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ సమస్య తలెత్తిందన్నారు. అనంతరం ఈ విషయాన్ని వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

మోడీని విమర్శిస్తే.. హోదా గల్లంతు?

బీజేపీ వ్యతిరేక వైఖరి సభ్యులున్న వర్సిటీలకు ఎమినెన్స్ ట్యాగ్‌పై జాప్యం!

• ఆ విశ్వవిద్యాలయాల సమాచారాన్ని కేంద్రానికి అందజేసిన ఐబీ



న్యూఢిల్లీ : మోడీ, బీజేపీ ప్రభుత్వంపట్ల విమర్శనాత్మక వైఖరిగల వ్యక్తులు వీసీలుగా, బోర్డు సభ్యులుగా ఉన్న యూనివర్సిటీలకు ఎమినెన్స్ ట్యాగ్(ఎమినెన్స్ హోదా) ఇవ్వడంపై కేంద్రం పునరాలోచిస్తున్నదా? ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నదా? అనే చర్చ నడుస్తోంది. ప్రధాని మోడీ, బీజేపీ సర్కారుపై విమర్శనాత్మక వైఖరిగల టాప్ ప్రయివేటు యూనివర్సిటీలకు సంబంధించిన సమాచారాన్ని కేంద్రానికి ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) సమాచారాన్ని అందించిందని ఓ పత్రిక పేర్కొనడంతో ఈ సందేహాలకు తెరలేచింది. ఈ అనుమాలను బలపరిచేలా.. ఐబీ అందించిన సమాచారంతోనే ఆ వర్సిటీలకు ఎమినెన్స్ హోదా ఇవ్వడంపై కేంద్రం తాత్సారం వహిస్తోందని కొన్ని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

అశోకా యూనివర్సిటీ, కెఆర్ఈఏ, అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం, ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ సహా తొమ్మిది ప్రయివేటు విశ్వవిద్యాలయాల వీసీలు లేదా బోర్డు సభ్యులు.. మోడీ, ఆయన ప్రభుత్వంపై విమర్శనాత్మక వైఖరి కలిగి ఉన్నారని ఐబీ పేర్కొన్నట్టు సమాచారం. ఈ మేరకు సమాచారాన్ని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు ఐబీ గతనెల పంపినట్టు తెలిసింది. ఈ నోట్‌ను పరిశీలించిన ఓ జాతీయ మీడియా పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి..

అశోకా వర్సిటీ వీసీ ప్రతాప్ భాను మెహతా.. సర్కారును పలుసార్లు విమర్శించారు. వర్సిటీ చైర్మెన్, బోర్డు ట్రస్టీ, సంస్థాపకుడు అశిశ్ ధావన్.. 'ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ప్రచురిస్తున్న 'వైర్.ఇన్'(ది వైర్-వెబ్‌సైట్ న్యూస్)కు నిధులు సమకూర్చార'ని నోట్‌లో పేర్కొన్నట్టు తెలుస్తున్నది. కేఆర్ఈఏ వర్సిటీ బోర్డులో సర్కారును విమర్శించిన ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ సభ్యులుగా ఉన్నారని వివరించింది. వర్సిటీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు అను అగా.. 'గుజరాత్ అల్లర్లను ఆపేందుకు మోడీ స్వల్ప చర్యలు మాత్రమే తీసుకున్నార'ని ఓ ప్రసంగంలో చెప్పినట్టు నోట్ పేర్కొంది. అజీం ప్రేమ్‌జీ ఫిలాంత్రోపిక్ ఇనిషియేటివ్స్ లిమిటెడ్, విప్రో ఫిలాంత్రోపిక్ విభాగం 'ది వైర్'కు నిధులు సమకూరుస్తున్నాయని, ఈ వర్సిటీ.. ఉపాధి హామీ చట్టంలో నిధుల కొరత పెరుగుతోందని నొక్కిచెప్పినట్టు ఐబీ నోట్ ప్రస్తావించిందని ఆ పత్రిక పేర్కొంది.

ఈ తొమ్మిది వర్సిటీలు ఎమినెన్స్ హోదా(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ ట్యాగ్)కోసం ఎంపికైన 12 ప్రయివేటు, ఏడు ప్రభుత్వ విద్యాసంస్థల జాబితాలో ఉన్నవి. ఈ జాబితాను ఎంపవర్డ్ ఎక్స్‌పర్ట్ కమిటీ(ఈఈసీ) సిఫారసుల మేరకు గతనెలలో తయారు చేశారు. హెచ్ఆర్డీ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు హాజరైన సమావేశంలో ఈ సిఫారసులను యూజీసీ ఆమోదించాల్సి ఉంది. కాగా, మొదటి జాబితాలోని విద్యా సంస్థలకు గత జూలైలో ఈ హోదా ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఐబీ నోట్‌పై ప్రభుత్వ పెద్దల మధ్య చర్చ నడుస్తోందని కొన్ని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ నోట్ వల్లే పైన పేర్కొన్న విద్యాసంస్థలకు ఎమినెన్స్ హోదానివ్వడంపై జాప్యం జరుగుతోందని వివరించాయి.

కాగా, ఈ వ్యవహారంపై హెచ్ఆర్డీకి చెందిన ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సుబ్రమణ్యంను సంప్రదించగా హోదాపై స్పందిస్తూ.. నేడు(జనవరి 29న) జరగనున్న యూజీసీ సమావేశంలో ఈఈసీ రిపోర్టును పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అయితే ఆయన ఐబీ నోట్‌పై వ్యాఖ్యానించలేదు. కానీ, తర్వాత ఐబీ నోట్‌కు సంబంధించిన వార్తలను ఖండించారు. కాగా, దీనిపై యూజీసీ ఇంకా స్పందించలేదు.

గీత దాటుతున్నారు

• కాంగ్రెస్ నేతలపై కర్నాటక సీఎం ఆగ్రహం
• రాజీనామాకు సిద్ధమైన కుమారస్వామి



న్యూఢిల్లీ : కర్ణాటక సంకీర్ణ ప్రభుత్వం మరోసారి సంక్షోభంలో పడింది. కాంగ్రెస్ నేతల వైఖరి పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన జేడీఎస్ నేత, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కుమారస్వామి రాజీనామాకు సిద్ధమేనని ప్రకటించారు. కాంగ్రెస్ నేతలు గీత దాటుతున్నారని వ్యాఖ్యానించారు. పరోక్షంగా తనపై పెత్తనం చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు అసంతృప్తితో ఉన్నట్టు వార్తలు వెలువడుతుండటంపై సోమవారం మీడియా ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ తమ సభ్యులను కట్టడి చేయాల్సిన బాధ్యత ఆ పార్టీదేనని వ్యాఖ్యానించారు. సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిని చేయాలంటూ అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు డిమాండ్ చేసిన నేపథ్యంలో కుమారస్వామి ఆగ్రహంతో స్పందించారు. జరుగుతున్న పరిణామాలను కాంగ్రెస్ నేతలు గమనిస్తూనే ఉన్నారనీ, ఆ పరిణామాలతో తనకు ఎటువంటి సంబంధం లేదనీ అన్నారు. వారి వైఖరి అలాగే కొనసాగితే నేను రాజీనామా చేయడానికి సిద్ధమన్నారు.

రాజ్యాంగ ధర్మాసనానికి 'కేవీ'ల్లో ప్రార్థనలపై పిటిషన్

న్యూఢిల్లీ : కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో ఉదయం సమయంలో విద్యార్థులతో హిందీ, సంస్కృతం భాషల్లో ప్రార్థనలు చేయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం రాజ్యాంగ ధర్మాసనం పరిశీలనకు పంపింది. ఈ పిటిషన్‌ను తగిన ధర్మాసనానికి సూచించేందుకు గాను ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్‌కు పంపాలని ఆదేశించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన న్యాయవాది వీనయజ్ షా ఈ పిటిషన్ దాఖలు చేశారు. కేంద్రీయ విద్యాలయాల్లో ఉదయం సమయాలలో హిందూ మత ప్రాతిపదికన ప్రార్థనలు జరగుతున్నాయని ఆయన పిటిషన్‌లో ఆరోపించారు. విద్యార్థుల విశ్వాసానికి, నమ్మకానికి అతీతంగా హిందూమత భావాలు వారిపై రుద్దబడుతున్నాయని తెలిపారు. 2013లో రివైజ్ చేయబడిన కేంద్రీయ విద్యాలయాల విద్యా నిబంధనావళి ప్రకారం ఉదయం సమయాల్లో జరిగే అసెంబ్లీకి విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలి. కాగా అంతకుముందు ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయమూర్తుల రోహిన్టన్ ఫలి నారిమన్, నవీన్ సిన్హాలు స్పందిస్తూ దీనిపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాలను కోరింది.

ఈపీఎఫ్‌లో ఖాతా తెరిస్తే.. కొత్త ఉద్యోగులా..!

15 నెలల్లో 73 లక్షల కొలువులంటూ మోడీ సర్కార్ ప్రచారం

న్యూఢిల్లీ: 15 నెలల్లో 73 లక్షలమందికి ఉద్యోగాలు కల్పించామంటూ ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన లెక్క ఎంత అబద్ధమో వాస్తవాలు పరిశీలిస్తే అర్థమవుతోంది. ఉద్యోగుల భవిష్యనిధి(ఈపీఎఫ్‌వో)లో వేతన జీవులను నమోదు చేయడంలో భాగంగా జరిగిన విధాన ప్రక్రియను మోడీ ప్రభుత్వం తెలివిగా తమకు అనుకూలంగా మలచుకున్నతీరు చూస్తే అంతా ఆశ్చర్యపోవాల్సిందే. 2017 సెప్టెంబర్ నుంచి 2018 నవంబర్ వరకు ఈపీఎఫ్‌వో ఖాతాలు తెరిచిన ఉద్యోగుల సంఖ్యను కొత్తగా ఉద్యోగాలు పొందినవారిగా బీజేపీ నేతలు ప్రచారం చేసుకున్నారు.

అసలు జరిగిందేమంటే.. లెక్క వాస్తవమే. కానీ, వారంతా కొత్తగా ఉద్యోగాలు పొందినవారు కాదు. ఆ 15 నెలల్లో ఈపీఎఫ్‌వోలో నమోదైన ఉద్యోగుల సంఖ్య 73 లక్షల 50 వేలు. అయితే, వారిలో కొందరు గతంలో ఆయా సంస్థల్లో ఒప్పంద కార్మికులుగా పని చేస్తూ ఆ 15 నెలల కాలంలో వేతన ఉద్యోగులుగా నమోదైనవారు. మరో అంశం కూడా ఇక్కడ గమనార్హం.

అదేమంటే ఏదైన సంస్థ ఈపీఎఫ్‌వోలో రిజిస్టర్ కావాలంటటే కనీసం 20మంది ఉద్యోగులను కలిగి ఉండాలి. అంటే.. అంతకుముందు ఆయా సంస్థలు 19మంది ఉద్యోగులనే కలిగి ఉన్నాయనుకుంటే అవి ఈపీఎఫ్‌వోలో నమోదు కావడానికి మరో ఉద్యోగిని చేర్చుకోవాలి. ఆ లెక్కన అంతకుముందు నుంచి పని చేస్తున్నవారు కూడా నూతనంగా ఉద్యోగంలో చేరిన ఓ ఉద్యోగితోపాటు ఒకేసారి ఈపీఎఫ్‌వోలో నమోదవుతారు. అంతేగాక మరో అంశం కూడా ఉన్నది. చాలామంది రెండు, మూడు ఈపీఎఫ్‌వో ఖాతాలు కూడా కలిగి ఉండటం. అదెలా జరుగుతుందంటే.. గతంలో ఓ సంస్థలో పని చేసి ఆ తర్వాత మరో సంస్థలోకి మారినపుడు కొత్తగా మరో ఈపీఎఫ్‌వో ఖాతాను తెరవడం ద్వారా అనేది గమనార్హం.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే..

• పేదలకు కనీస ఆదాయం : రాహుల్ గాంధీ హామీ



రాయ్‌పూర్: దేశంలో లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సంచలన ప్రకటన చేశారు. 2019 ఎన్నికల్లో గెలిచి కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడితే దేశంలోని ప్రతిపేదవారికి కనీస ఆదాయం అందేలా చూస్తామని ఆయన ప్రకటించారు. ఇది తమ విజన్, వాగ్దానమని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ప్రజలతో, ప్రత్యేకించి రైతులతో ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సమావేశం 'కిసాన్ అభార్ సమ్మేళన్'లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్టు తెలిపారు. దీనితో పేదలు కనీస ఆదాయాన్ని నేరుగా తమ బ్యాంకు ఖాతాల ద్వారా పొందుతారన్నారు. ఇలాంటి పథకం ఇప్పటి వరకు ఎక్కడా అమలు చేయలేదని ప్రపంచంలోనే తొలిసారి అని తెలిపారు. దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదని, పేదవారిగా ఉండకూడదన్నారు. దేశంలో పేదరికంతో బాధపడుతున్నవారు లక్షల సంఖ్యలో ఉన్నారని ఇలాంటి తరుణంలో నవభారతాన్ని నిర్మించలేమని ప్రధాని మోడీకి చురకలంటించారు. ఆకలి, పేదరికం లేని నవ భారతాన్ని నిర్మించడమే తమ ముందున్న లక్ష్యమని, ఈ పథకం అందుకు దోహదం చేస్తుందని రాహుల్ ఆశాభావం వ్యక్తం చేశారు. పేదలకు కనీస ఆదాయాన్ని అందేలా చూసే ఈ చారిత్రక నిర్ణయాన్ని అమలు చేయడానికి తమకు ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు. ఈ విషయంపై తర్వాత ట్విట్టర్‌లో సైతం రాహుల్ పునరుద్ఘాటించారు.

ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం దేశంలోని రైతులకు రుణ మాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. రుణమాఫీని ప్రకటించాలంటే నిధుల కొరతను బీజేపీ ప్రభుత్వం సాకుగా చూపిస్తుందని, అదే 15 మంది బడా పారిశ్రామిక వేత్తలకు రుణాలను మాఫీ చేయడంలో కానీ, అనిల్ అంబానీ కంపెనీకి 30వేల కోట్ల రూపాయల ప్రయోజనాన్ని చేకూర్చే విషయంలో మాత్రం కేంద్రం వద్ద కావల్సినంత నిధులు ఉంటాయని రాహుల్ వ్యంగ్యంగా అన్నారు.

ఎన్నికలంటే అందాల పోటీలు కావు..!

• ప్రియాంక గాంధీ రాజకీయారంగేట్రంపై బీహార్ డిప్యూటీ సీఎం



కోల్‌కత : సార్వత్రిక ఎన్నికల ముందు ప్రత్యక్ష రాజకీయాలలో ప్రవేశిస్తున్న కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి ప్రియాంక గాంధీపై బీజేపీ నాయకుల విమర్శల పరంపర కొనసాగుతోంది. తాజాగా బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీ.. ఎన్నికలంటే అందాల పోటీలు కావని ప్రియాంకను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని హౌరాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మోడీ మాట్లాడుతూ... 'ఎన్నికలంటే కుస్తీ పోటీలు, అందాల పోటీలు కాదు. రాజకీయాలలో వ్యక్తుల గత ప్రదర్శన ఆధారంగా ప్రజలు వారికి ఓట్లేస్తార'ని అన్నారు. కాగా, ఆయన వ్యాఖ్యలపై రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రదీప్ భట్టాచార్య స్పందిస్తూ.. గాంధీ కుటుంబాన్ని చూసి బీజేపీ భయపడుతోందని చెప్పారు. అందుకే ప్రియాంక, రాహుల్‌లపై పదే పదే విమర్శలు చేస్తున్నారని అన్నారు.

రైతులకు కనీస మద్దతు ధర!

• స్వామినాథన్ కమిషన్ నివేదిక ఆధారంగా నిర్ణయం : ఢిల్లీ ప్రభుత్వం
• వ్యవసాయరంగ నిపుణులతో నేడు సమావేశం

న్యూఢిల్లీ : ఢిల్లీ స్వామినాథన్ కమిషన్ నివేదిక ఆధారంగా రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను నిర్ణయించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అంశంపై చర్చించేందుకు వ్యవసాయరంగ నిపుణులతో మంగళవారం సమావేశం కానున్నట్టు చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో దాదాపు 20 వేల మంది రైతులున్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వంకానీ, ఢిల్లీలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు కానీ స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలుచేయలేదని రాయ్ అన్నారు. 'స్వామినాథన్ కమిషన్ నివేదిక ఆధారంగా ఢిల్లీ రైతులకు కనీప మద్దతు ధర అమలుచేయాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. నివేదికను అధ్యయనం చేసేందుకు గత డిసెంబరులో ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటుచేశాం. ఎంఎస్‌పీకి సంబంధించి ఆ కమిటీ నివేదికను సమర్పించింది. ఈ అంశంపై మంగళవారం సమావేశం నిర్వహిస్తాం. ముగ్గురు సభ్యుల కమిటీ అందించిన నివేదికను సలహాల కోసం నిపుణుల ముందుంచుతాం' అని గోపాల్ రాయ్ చెప్పారు. ఎంఎస్‌పీ ఖరారైన తర్వాత రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు వారితో సమావేశాలు నిర్వహిస్తామనీ, అనంతరం క్యాబినెట్ ఆమోదం కోసం పంపుతామని అన్నారు.

ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం లాభం చేకూర్చే విధంగా ఎంఎస్‌పీని నిర్ణయించాలని స్వామినాథన్ కమిషన్ స్పష్టం చేసింది. దీనికి ప్రాతిపదికగా తాజా గణాంకాలే తీసుకోవాలి. దీనివల్ల వాస్తవిక వ్యయాల ఆధారంగా మద్దతు ధర నిర్ణయించడానికి ఆస్కారం ఉంటుందని స్వామినాథన్ సిఫారసుచేశారు.

జీఎస్ఎల్వీ ఎంకే-3 నవీకరణపై ఇస్రో దృష్టి



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న చంద్రయాన్-2, గగన్‌యాన్ వంటి ఉపగ్రహాలను అంతరిక్షంలోకి మోసుకెళ్లగలిగే భారీ వాహకనౌక జీఎస్ఎల్వీని ఎంకే-3ను అప్‌గ్రేడ్ చేయడంపై ఆ సంస్థ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా జీఎస్ఎల్‌వీ ఎంకే-3 వాహకనౌక మోసుకెళ్ల గలిగే సామర్థ్యాన్ని 4 టన్నుల నుంచి ఆరు టన్నులకు పెంచడానికి రాకెట్ దశలలో కొన్ని మార్పులకు ప్రయత్నిస్తున్నామని కె.శివన్ తెలిపారు. క్రయోజనిక్ స్టేజ్ ఇంధన సామర్థ్యాన్ని 25 టన్నుల నుంచి 30 టన్నులకు మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే రెండోది, కోర్ స్టేజ్ ఎల్110ను సెమీ క్రయోజనిక్ ఇంజన్‌తో భర్తీ చేయనున్నారు. ఇది ద్రవరూప హైడ్రోజన్‌కు బదులుగా 'కెర్లాక్స్'గా పిలవబడే ద్రవరూప ఆక్సిజన్, అత్యంత శుద్ధిగావించిన కిరోసిన్‌ను తీసుకెళ్తుంది.

ఇన్‌శాట్-4సీఆర్ స్థానంలో జీశాట్-31: శివన్

త్వరలో కాల వ్యవధి ముగిసిపోయే ఇన్‌శాట్-4సీఆర్‌ను జీశాట్-31తో భర్తీ చేయనున్నట్టు శివన్ తెలిపారు. ఈ ప్రయోగాన్ని ఫిబ్రవరి 6న ఫ్రెంచ్ గయానా నుంచి చేపట్టనున్నట్టు వెల్లడించారు. జీశాట్-31 భారీ ఉపగ్రహం కాదని ఆయన చెప్పారు. జీఎస్ఎల్‌వీ ఎంకే-3 వాహకనౌక ద్వారా దీనిని ప్రయోగించనున్నట్టు తెలిపారు.

మా సమస్యలు పరిష్కరించకపోతే..

• ఎన్నికలు బహిష్కరిస్తాం : గ్రామ సభ తీర్మానం

యాత్మల్ (మహారాష్ట్ర) : మా సమస్యలు పరిష్కరించకపోతే.. రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామంటూ ఆ గ్రామ సభ తీర్మానం చేసింది. బీజేపీ పాలిత మహారాష్ట్రలోని యవాత్మల్ జిల్లాలో గణతంత్ర దినోత్సవం రోజున చేసిన ఈ తీర్మాన కాపీని ప్రధాని మోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు గ్రామస్తులు పోస్టుచేశారు. రైతులకు నష్టపరిహారంతోపాటు, గ్రామంలోని ఇతర అన్ని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మహాగాన్ తాలూకా వాగ్దా ఇజారా గ్రామం డిమాండ్ చేసింది. తీవ్ర వ్యవసాయ సంక్షోభాన్ని మహారాష్ట్ర ఎదుర్కొంటుండగా.. యవాత్మల్ జిల్లాలో ఇటీవల వరుస రైతు ఆత్మహత్యల ఘటనలు వెలుగులోకి వచ్చాయి. పంట బీమా పథకం కింద రైతులకు రావాల్సిన మొత్తాన్ని రైతుల బ్యాంకు ఎకౌంట్లకు జమచేయాలని, తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యలో పశుగ్రాసం స్టోర్ రూమ్‌లు ఏర్పాటుచేయాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని రైతు నేత మనిశ్ జాదవ్ తెలిపారు.

'ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదుకావడంతో సోయాబీన్, పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట బీమా పథకం కింద రైతులకు ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం చెల్లించాలి' అని జాదవ్ డిమాండ్ చేశారు. 'ప్రతీ ఏడాది తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాం. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత నీటి సరఫరా స్కీమ్స్ ద్వారా మా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మేం కోరుతున్నాం' అని గ్రామ సర్పంచ్ చాయా కండారే చెప్పారు. రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలనీ, కొత్తగా రుణాలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ గ్రామం ఉమర్‌ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనిదికాగా, ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

అలాగే హింగోలీ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్ ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తూర్పు మహారాష్ట్ర రీజియన్‌లోని పలు జిల్లాలతో ప్రత్యేక విదర్భ రాష్ట్రం ఏర్పాటుచేయాలని కూడా వారు డిమాండ్ చేశారు.

సిటిజన్ షిప్ బిల్లుకు వ్యతిరేకంగా

నేడు ఎన్డీయే మిత్ర పక్షాల సమావేశం

గువహతి: ఈశాన్య రాష్ట్రాలలోకి అక్రమంగా వలస వచ్చిన వారిని దేశం నుంచి వెళ్లగొట్టేందుకని బీజేపీ సర్కారు తీసుకొచ్చిన పౌరసత్వ (సవరణ) బిల్లును వ్యతిరేకిస్తూ ఎన్డీయే ఈశాన్య రాష్ట్ర మిత్రపక్షాలు నేడు గువహతిలో సమావేశం కానున్నాయి. ఈ సమావేశానికి బీహార్‌లో బీజేపీ మద్దతుదారు జేడీ(యూ)తో పాటు అసోం గణ పరిషత్ (ఏజీపీ), నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ), మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), ఇండిజెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ), ఆలిండియా అసోం స్టూడెంట్స్ అసోసియేషన్ (ఆసూ), సిక్కిం, నాగాలాండ్‌ల నుంచి మరికొన్ని ప్రాంతీయ పార్టీలు హాజరుకానున్నాయి. బీజేపీ తీసుకొచ్చిన పౌరసత్వ బిల్లును ఈశాన్య రాష్ట్రాలు మొదటినుంచి వ్యతిరేకిస్తున్నాయని ఎన్‌పీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. ఖర్లుకీ తెలిపారు. ఈ సమావేశంలో దీనిపై చర్చించి, భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని అన్నారు. మేఘాలయ ముఖ్యమంత్రి కె.కె.సంగ్మా నేతృత్వంలోని ఎన్‌పీపీ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. జేడీ(యూ) నుంచి కె.సి. త్యాగి హాజరవుతుండగా, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ కూడా సమావేశానికి వస్తారని భావిస్తున్నారు.

కల్లాల్లో కన్నీరు..

అకాల వర్షంతో తడిసి ముద్దయిన పంటలు

- పంట నష్టంపై అధికారుల సర్వే

నవతెలంగాణ- ఖమ్మం ప్రతినిధి

మూడురోజులు కురిసిన అకాల వర్షం రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు కోలుకోలేని దెబ్బతీసింది. మార్కెట్టు యార్డులు, కల్లాల్లో ఆరబెట్టిన పంటలు తడిసిముద్దయ్యాయి. కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నెల రోజులుగా మార్కెట్లోనే రాసులు పోసుకున్న ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసింది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో కల్లాల్లో ఆరబోసుకున్న పంటంతా వరద నీటిపాలైంది. సోమవారం మధ్యాహ్నాం వరకు వర్షం కురిసింది. ఖమ్మం జిల్లాలో 719 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇరవై రోజుల కిందట అతలాకుతలం చేసిన 'పెథాయ్' తుపాన్ మిగిల్చిన భారీ నష్టాల నుంచి తేరుకోకముందే ఈ అకాల వర్షంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల రైతులు ఉన్న కొద్దిపాటి పంటలనూ కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుతం వరి, మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగర్ ఆయకట్టుతో పాటు పలు కీలక మేజర్, మైనర్, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల కింద దాదాపు ఖమ్మం జిల్లాలో 1.80లక్షల ఎకరాల్లో, భద్రాద్రి జిల్లాల్లో 1.10లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇదంతా ప్రస్తుతం కోత దశలో ఉంది. కొన్ని మండలాల్లో కల్లాల్లోనే ధాన్యం రాశులు పోసి ఉంచారు. అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు, మధిర, సత్తుపల్లి, వైరా, ఖమ్మం, పాలేరు వ్యవసాయ డివిజన్లలో సుమారు 50వేల ఎకరాల్లో పంటలు తడిసిపోయాయి.


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

పంటల పరిశీలన..

తడిసిన పంటలను సోమవారం జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి అనసూయతో పాటు పలువురు సిబ్బంది పరిశీలించారు. ముఖ్యంగా భారీ వర్షపాతం నమోదైన మండలాల్లో పర్యటించారు. సోమవారం కూడా వాన కురవడంతో పరిశీలన పూర్తికాలేదు. 23,140 హెక్టార్లలో మిర్చి పంట సాగులో ఉందనీ, తడిసిన పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందనీ ఉద్యానవన శాఖాధికారి జి. అనసూయ వెల్లడించారు. గాలికి వాలిపోయిన మిర్చి మొక్కలను కర్రలతో నిలబెట్టాలని రైతులకు సూచించారు. నేలవాలిన మొక్కలపై కాపర్ ఆక్సీకోర్లైడ్‌ను 3గ్రాముల పొడిమందును నీటిలో కలిపి మొదళ్లలో, మొక్క తడిసేలా పిచికారీ చేయాలని అన్నారు.



హెలిప్యాడ్ భూసేకరణపై స్పందించిన హైకోర్టు

- కరీంనగర్ కలెక్టరుకు నోటీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హెలికాప్టర్ పర్యటనల నిమిత్తం కరీంనగర్ జిల్లా తీగలగుట్ట గ్రామంలో హెలిప్యాడ్ నిర్మాణం కోసం భూసేకరణ చేయడాన్ని సవాల్ చేసిన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. సిరిసిల్ల ప్రాంతానికి చెందిన పి.ప్రతిమ సహా అయిగురు దాఖలు చేసి వ్యాజ్యాన్ని సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం విచారించారు. ప్రతివాదులైన రెవిన్యూ, రోడ్లు, భవనాల శాఖల ముఖ్య కార్యదర్శులు, కరీంనగర్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవోలకు నోటీసులు జారీ అయ్యాయి. భూ సేకరణ చట్టం 2013ను అమలు చేయకుండా భూమి తీసుకోవడం చెల్లదని, తీగలగుట్ట గ్రామం సర్వే నెంబర్ 232లోని తమ భూమికి మూడు వైపులా సీఎం కేసీఆర్, ఆయన బంధువర్గానికి చెందిన భూములే ఉన్నాయని, వాటి జోలికి వెళ్లకుండా తమ భూములే సేకరించాలని నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమని పిటిషనర్ లాయర్ అన్నారు. హెలిప్యాడ్ కేవలం సీఎం కోసమేనని, ఇందులో ప్రజా ప్రయోజనం ఏమీ లేదని వాదించారు. రెండు హెలిప్యాడ్‌లు ఉన్నా మరోకటి కోసం భూసేకరణ చేయడం చట్ట వ్యతిరేకంగా ప్రకటించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆయన బంధువుల భూములు తీసుకోకుండా తమ భూములనే ఎంచుకోవడం చెల్లదన్నారు. పైగా, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చిన హైకర్టు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

నిత్యావసరాల చట్టాన్ని రద్దు చేయాలి

ఎన్నికలను రైతులు వేదికగా వాడుకోవాలి

- యూరియా సబ్సిడీ ఎత్తివేసి నగదు రూపంలో ఇవ్వాలి: ప్రణాళికా సంఘం మాజీ చైర్మెన్ అహ్లువాలియా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిత్యావసరల చట్టాన్ని రద్దు చేయాలని ప్రణాళికా సంఘం మాజీ చైర్మెన్ డాక్టర్. మాంటెక్ సింగ్ అహ్లు వాలియా అన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేస్తే చిన్నసన్నకారు రైతులకు కొంతైనా మేలు జరిగే అవకాశముందని చెప్పారు. రైతుల చేతికందిన ధాన్యం అమ్ముకోలేక, పండించిన కూరగాయలు నిల్వ చేసుకోలేక సతమతమై, చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిల భారత రైతు సంఘాల సవ రాఖ్య, రైతు సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో 'జాతీయ రైతుల అభివృద్ధికి



పదేండ్ల ప్రణాళిక' అనే అంశంపై సోమవారం గోల్కొండ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అహ్లు వాలియా మాట్లాడుతూ వరుసగా వస్తున్న ఎన్నికలను రైతు సమస్యల పరిష్కారానికి వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి అవకాశాలు మెండుగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నేతలను సంప్రదించాలని, ఆయా పార్టీల ఎన్నికల మేనిఫెస్టోల్లో పొందుపర్చే విధంగా ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. యూరియా అధికంగా ఉపయోగించడం వల్ల భూసారం దెబ్బతిన్నదని, రసాయనిక ఎరువుల వినియోగం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొనుగోలుకు ఇస్తున్న సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసి, నగదు రూపంలో రైతులకు నేరుగా అందజేయాలన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలతోనే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రైతుల కోసం దీర్ఘకాలిక ప్రణాళికలు పక్కకు పెట్టాలని, తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలపై ప్రభుత్వాల మీద ఒత్తిడి పెంచాలని చెప్పారు. బిజినెస్ లైన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ చంద్రశేఖర్ అయ్యర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర రావడం లేదన్నారు. రైతులు ఆశించిన మేరకు పంట దిగుబడి రావడం లేదని చెప్పారు. భూగర్భజలాలు అడుగంటిపోయాయని పేర్కొన్నారు. రైతులు పండించిన పంట నిల్వ చేసుకునే విధంగా గోదాముల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. గోపాల్‌రెడ్డి, కన్సార్టియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోయేషన్ (సీఐఎఫ్ఏ) చీఫ్ అడ్వైజర్ పి. చెంగల్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఆర్‌వి గిరి, సెక్రెటరీ జనరల్ బొజ్జ దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమనుషులను గౌరవించాలి

వృద్ధుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ చట్టం అమలుకు కృషి చేస్తా
- టస్కా డైరీ ఆవిష్కరణలో హోంమంత్రి మహమూద్ అలీ

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

సమాజంలో తల్లిదండ్రులు, పెద్దమనుషుల పట్ల నేటి పిల్లలకు చులకన భావం ఉండటం బాధాకరమని, తెలంగాణ సంస్కృతిలో భాగంగా ప్రతి ఒక్కరూ పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ పిలుపునిచ్చారు. వృద్ధుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్(టస్కా) డైరీని, క్యాలెండర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో డీజీపీ మహేందర్‌రెడ్డితో భేటీ అయ్యి తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ చట్టం-2007లోని సెక్షన్-21 అమలును అన్ని పీఎస్‌లలో పకడ్బందీగా అమలయ్యేలా చూస్తానని భరోసానిచ్చారు. సీనియర్ సిటిజన్స్‌ను ఆస్పత్రుల్లో తక్కువ వ్యయంతో మెరుగైన వైద్యం అందేలా చూస్తామని, వృద్ధులకు అవేర్‌నెస్ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ..సీనియర్ సిటిజన్స్ అంతా ఐక్యమవ్వాలని, అప్పుడే తమ హక్కుల అమలు కోసం అధికారులతోగానీ, ప్రభుత్వంతోగానీ పోరాడే అవకాశం ఉంటుందని అన్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ..పిల్లలు తల్లిదండ్రులను బాగా చూసుకోవాలనే చట్టం రావడం, మళ్లీ ఆ చట్టం అమలు కోసం పోరాటం చేయాల్సి రావడమంటే మన సమాజం ఏ దుస్థితిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు. తమ బాగుకోసం, ఉన్నతి కోసం రేయింబవళ్లు కష్టపడే తల్లిదండ్రులను వృద్ధాప్యంలో బిడ్డలు సరిగా చూసుకోకపోవడం సరిగాదన్నారు. వృద్ధాప్యంలో బాధలను గుర్తుకు చేసుకుంటూ ఉండే కంటే మ్యూజిక్ నేర్చుకోవడం, దూరవిద్య ద్వారా ఏవైనా కోర్సులు చేయడం లాంటివి చేయాలని సూచించారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వృద్ధులకు టూరిజం శాఖ నుంచి 25 శాతం రాయితీ ఇస్తామని హామీనిచ్చారు. మహిళాశిశు, వికలాంగ మరియు సీనియర్ సిటిజన్స్ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం. జగదీశ్వర్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్‌స్టేషన్‌లోనూ ముగ్గురు సీనియర్ సిటిజన్స్‌తో కమిటీ ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ నెలకోసారో, రెండు నెలలకోసారో సమావేశమై వృద్ధుల సమస్యలపై చర్చించాలని అన్నారు. అలా చేస్తే పిల్లల నుంచి ఇబ్బందులు ఎదుర్కొనే తల్లిదండ్రుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. టస్కా అధ్యక్షులు పి.నర్సింహారావు మాట్లాడుతూ...వృద్ధుల సమస్యలను హోంమంత్రి, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, టస్కా ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి ప్రకాశ్‌రావు, కోశాధికారి డి.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.


డైరీ ఆవిష్కరిస్తున్న హోంమంత్రి

'ఉపా' చట్టాల రద్దు కోసం పోరాటాలు

ప్రొఫెసర్ హరగోపాల్

- ఫాసిస్ట్ నిర్బంధాన్ని నిరసిస్తూ టీడీఎఫ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా

నవతెలంగాణ-ముషీరాబాద్

చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) రద్దు కోసం రాజీ లేని పోరాటాలు చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్ట్ నిర్బంధాన్ని నిరసిస్తూ తెలంగాణ ప్రజాస్వామిక వేదిక(టీడీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే కాదనీ, ప్రజా సమస్యలను చర్చించడమూ అందులో భాగమేనని అన్నారు. దేశంలో నిర్బంధ వ్యవస్థ, పోలీసుల పాలన సాగుతోందని ఆరోపించారు. పాలకుల లోపాలను ప్రశ్నించిన వారిని జైలుకు పంపుతున్నారనీ, నడవలేని స్థితిలో ఉన్న ప్రొఫెసర్ సాయిబాబాను విడుదల చేయకపోవడం అన్యాయమనీ అన్నారు. చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు తెచ్చిన ఉపా చట్టం ప్రమాదకరమైందనీ, దీని ద్వారా ఎలాంటి విచారణ లేకుండా ఆరునెలల పాటు జైలుకు పంపే అధికారం ఉంటుందనీ గుర్తుచేశారు. మోడీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ఎక్కడా సభలు, సమావేశాలు జరగకుండా అడ్డుకుంటారనీ తెలిపారు. సీపీఐ(ఎం) నాయకులు రాములు మాట్లాడుతూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర కోసం ఉద్యమించిన కవులు, కళాకారులను అరెస్ట్ చేయటం దారుణమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కన్వీనర్ విమలక్క అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరయ్య, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు గోవర్ధన్, అచ్యుత రామారావు, ఝాన్సీ, సాంబశివరావు, ప్రొఫెసర్ లక్ష్మణ్, పీడీఎస్‌యూ అధ్యక్షులు పరశురాం, ప్రజానాట్య మండలి నాయకులు కోటి, జాన్, విప్లవ రచయితల సంఘం నాయకులు జగన్ పాల్గొన్నారు.

రీపోలింగ్ డిమాండ్లు

పంచాయతీ ఎన్నికల్లో అవకతవకలపై నిరసనలు

గ్రామ పంచాయతీ ఎన్నికలు- కౌటింగ్‌లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ఆందోళనలు కొనసాగాయి. రీపోలింగ్ నిర్వహించాలని సోమవారం కూడా పలు చోట్ల ధర్నాలు చేశారు.

- ముస్తాబాద్‌లో రెండో రోజూ నిరాహార దీక్ష
- నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-ముస్తాబాద్/నల్లగొండ క్లాక్‌టవర్/ ఆదిలాబాద్‌టౌన్/ఆమనగల్/ జగిత్యాల

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ గ్రామపంచాయతీ ఎన్నికల కౌంటింగ్‌లో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారనీ, రీ పోలింగ్ నిర్వహించాలనీ డిమాండ్ చేస్తూ ఆదివారం సర్పంచ్ అభ్యర్థి రాధకు మద్దతుగా చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం కూడా కొనసాగింది. చేరుకున్నాయి. రోడ్డుపై వంటావార్పు నిర్వహించారు. అలాగే, ముస్తాబాద్ బంద్‌లో భాగంగా విద్యాసంస్థలనూ మూసేశారు. ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయనీ, రీపోలింగ్ నిర్వహించాలనీ డిమాండ్ చేశారు.

ఎన్నికల కమిషన్ సెక్రటరీకి ఫిర్యాదు..

ముస్తాబాద్ సర్పంచ్ ఎన్నికలో అవకతవకలపై హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్ సెక్రెటరీ అశోక్‌కు ముదిరాజ్ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఫిర్యాదు చేశారు.

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పొట్టెవానితండా గ్రామపంచాయతీ పరిధిలోని రామన్నగూడెం తండా, ఏనమిదితండా వాసులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ నెల 25న జరిగిన పొట్టెవానితండా ఎన్నికల్లో టీఆర్ఎస్ రెబెల్ అభ్యర్థి గెలుపొందారు. అయితే ఓటహక్కు లేని వాళ్లు, మైనర్లతో కూడా ఓట్లు వేయించడంతోనే టీఆర్ఎస్ బలపర్చిన వ్యక్తి ఓడిపోయాడనీ, విచారణ జరిపి రీపోలింగ్ నిర్వహించాలనీ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌కు వినతి పత్రం అందజేశారు.


రెండవ రోజుకు చేరిన నిరాహార దీక్ష

ఆదిలాబాద్‌లో..

ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో తలమడుగు మండలం దేవాపూర్‌లో అవకతవకలు జరిగాయనీ, వెంటనే విచారణ జరిపించాలనీ సర్పంచ్ అభ్యర్థులు స్వప్న, రమా, అనిత, రాణి, ఫాతిమా బేగం అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 25న దేవాపూర్ గ్రామపంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో నోటాకు, చెల్లని ఓట్లు ఎన్ని వచ్చాయో కూడా ఏజెంట్లకు చూపించకుండానే సర్పంచ్ అభ్యర్థిని ప్రకటించారని విమర్శించారు. కొందరు ఓటర్లకు ఓటు వేసిన తర్వాత వేలిపై సిరా గుర్తు పెట్టలేదనీ, దీనిపై అనుమానాలు కలుగుతున్నాయనీ అన్నారు. అవకతవకలపై రిటర్నింగ్ అధికారులను సంప్రదించినా పట్టించుకోలేదన్నారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి రీకౌంటింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రంగారెడ్డిలో..

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని పడ్కల్ పంచాయతీ ఎన్నికల కౌంటింగ్‌లో 3వ వార్డు అభ్యర్థి జె.శ్రీశైలంకు అన్యాయం జరిగిందని గ్రామస్తులు పలువురు మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ముందు 4ఓట్లతో శ్రీశైలం గెలిచినట్టు ప్రకటించిన అధికారులు తిరిగి రీకౌంటింగ్ నిర్వహించి అతని ప్రత్యర్థి జె.చెన్నయ్యను విజేతగా ప్రకటించారని తెలిపారు. అందువల్ల 3వ వార్డులో పోలైన ఓట్లను మరోసారి లెక్కించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆత్మకూర్ గ్రామస్తుల నిరసన

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ సర్పంచ్ ఎన్నిక వివాదాస్పదమవుతోంది. సర్పంచ్ అభ్యర్థి భర్తను పోలింగ్ బూత్‌లోకి అనుమతించారనీ, 10వ వార్డు బ్యాలెట్ బాక్సును ప్రత్యేకంగా ఉంచారనీ ఆరోపిస్తూ గ్రామస్తులు నిరసన తెలిపారు. ఎన్నిక పట్ల అనుమానాలున్నాయని ఫలితం రోజే ప్రత్యర్థులు ఆందోళన చేశారు. మెట్‌పల్లి డీఎస్పీ మల్లారెడ్డి, స్థానిక అధికారులు న్యాయం చేస్తామంటూ వివాదాన్ని పక్కనపెట్టారు. ఇప్పటి వరకూ అధికారులు స్పందించకపోవడంతో సోమవారం గ్రామస్తులు కలెక్టరేట్‌కు తరలొచ్చారు. కలెక్టర్ శరత్, జాయింట్ కలెక్టర్ రాజేశం సమావేశాల్లో ఉండటంతో, దాదాపు 2 గంటల పాటు కలెక్టరేట్ ఆవరణలో నిరీక్షించి గ్రామస్తులు ఇన్‌ఛార్జి డీపీఓ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై కోర్టుకు వెళతామని చెప్పారు.

సంపాదకీయం

ఉద్యోగాలు ఉత్తమాటేనా..

ఎక్కడికెళ్లినా ఎదురుపడే నో వెకెన్సీ బోర్డులు... కాళ్లరిగేలా తిరిగినా కాల్ లెటర్‌కు నోచని అనుభవాలు.. ఎన్ని కంపెనీలు తిరిగినా, ఎన్ని ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం ఒక్కటే. ఎక్కే గడప దిగే గడప ఒకటా రెండా.. ఏండ్లు గడిచినా ఒంట్లో ఓపిక నశించడం, వయస్సు దాటిపోవడం మినహా ఉద్యోగం మాత్రం రావడం లేదు. ఇదీ 130 కోట్ల భారతావనిలో సగటు నిరుద్యోగి వేదన!

నిరుద్యోగం ఉన్నంత కాలం ఆ దేశ ఆర్థిక వ్యవస్థలోనే కాదు, సాంఘిక-రాజకీయ వ్యవస్థల్లో కూడా అనేక సమస్యలు తలెత్తుతూనే ఉంటాయి. అందుకే ప్రజా శ్రేయస్సుకోరే ఏ రాజ్యంలోనైనా నిరుద్యోగ నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా, తక్షణ కర్తవ్యంగా ఉంటుంది. మరి మోడీ ప్రాధాన్యతల్లో ఇది లేదంటే ఈ ప్రభుత్వం ఎవరి శ్రేయస్సు కోరుతున్నట్టు?

సరిగ్గా ఐదేండ్ల క్రితం 2014 ఎన్నికలకు ముందు "మేం అధికారంలోకొస్తే ఏటా రెండు కోట్ల ఉపాధి అవకాశాలు సృష్టిస్తాం" అని మోడీ ప్రకటించినప్పుడు... ఈ దేశంలోని అసంఖ్యాకులైన నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఎన్నికల్లో గెలిచి, మోడీ అధికారంలోకొచ్చి ఐదేండ్లు గడిచిపోతున్నాయి. కానీ ఆయన చెప్పిన కొత్త ఉద్యోగాల మాట అటుంచితే భర్తీకాని ఖాళీల సంఖ్యే కనీవినీ ఎరుగని రీతిలో పేరుకుపోవడం కనిపిస్తున్న విషాదం! దేశంలో సుమారు 60లక్షలకు పైగా సర్కారీ కొలువులు ఖాళీగా ఉన్నప్పటికీ మోడీ ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. ఇది ప్రతిపక్షాల ఆరోపణో, ప్రభుత్వ వ్యతిరేకుల ఆక్షేపణో అయితే ఇప్పుడీ చర్చ అవసరమయ్యేది కాదు. ఇది ప్రభుత్వమే పార్లమెంటుకిచ్చిన సమాచారం! వివిధ సందర్భాలలో పార్లమెంటు ఉభయసభల్లో సభ్యుల ప్రశ్నలకిచ్చిన సమాధానం! మన ప్రభుత్వ నిర్లక్ష్యమూ, నిధుల్లో కోత మూలంగా సంభవించిన పరిణామం! విద్యా, వైద్య, న్యాయ, పోలీసుశాఖల్లోనే 60లక్షల ఉద్యోగాల భర్తీ నిలిచిపోయిందన్నది ఈ సమాచారం రుజువు చేస్తున్న నిజం! ఇది ప్రజల ఉద్యోగ ఉపాధి అవకాశాలకు గండికొట్టడమే కాదు, ఆయా రంగాల్లో.. ముఖ్యంగా విద్యా, వైద్య రంగాల్లో ప్రమాణాలను కూడా దెబ్బతీస్తుండటం గమనార్హం!




రూపాయి పతనం, అమిత వ్యయం, అంచనాలకందని వృద్ధిరేటు, గాడితప్పిన ఆర్థిక వ్యవస్థ... మోడీ పాలనలో ఈ దేశం గురించి చెప్పమంటే ఈ నాలుగు ముక్కలు చాలు. ఇది మిగిలిన వ్యవస్థలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్నది పక్కనబెడితే ఉద్యోగాల కల్పనపై మాత్రం పెను ప్రభావం చూపిస్తోంది. కొత్త ఉద్యోగాల కల్పన ఉత్త మాటగానే మిగిలిపోగా, ఉన్న ఉద్యోగాలకూ భద్రత కరువైందని ఈ ఐదేండ్ల అనుభవం చెబుతున్న పాఠం. డిగ్రీలు, పీజీలు పూర్తిచేసి ఉద్యోగావకాశాలకు నోచని కోట్లాదిమంది యువత నేడు నిరాశా నిస్పృహల్లో కొట్టు మిట్టాడుతున్నది. నగరాలు, పట్టణాల్లోనే కాదు, దేశ ప్రగతికి పట్టుగొమ్మలని చెప్పే గ్రామాల్లోని యువత పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చదువులకు తగిన ఉపాధి దొరకకపోయినా జీవించేందుకు అవసరమైన కనీస ఉపాధి దొరకక ఆందోళన చెందుతోంది ఈ దేశ యువతరం.

ఆధునిక మానవుడు అపూర్వ మేధోసంపత్తిని సంతరించుకుని విశ్వాంతరాలను జయిస్తున్న కాలంలో కూడా ఉపాధి కోసం యువత పడిగాపులు పడటం ఎంతటి విషాదం..! నవభారత నిర్మాణంలో భాగస్వాములై ఈ దేశ కీర్తి ప్రతిష్టలూ అభివృద్ధీ ఇనుమడింపచేయాల్సిన యువతను ఆ కర్తవ్యానికి దూరంగా, అచేతనులుగా మిగల్చడమేనా ఈ సర్కారు సాధించే ప్రగతి? సమాజాన్ని ముందుకు నడిపే కొత్త మార్పులకు, జాతి వికాసానికీ దోహదపడాల్సిన యువత జీవితకాలం ఉద్యోగం కోసమో, ఉపాధికోసమో ఎదురు చూస్తూనే గడిపేయడం ఎంతటి దౌర్భాగ్యం?

ఒక దేశ ప్రగతికి అవరోధంగా నిలిచే ప్రధాన సమస్యలో నిరుద్యోగం ఒకటి. ఈ సమస్యను ప్రపంచంలోకెల్లా తీవ్రంగా ఎదుర్కొంటున్నది భారతదేశం. దీనిని అధిగమించకుండా ఈ దేశం అభివృద్ధి చెందుతుందని ఎవరు చెప్పినా అది అబద్ధమే అవుతుంది. దేశ వర్తమాన, భవిష్యత్తు జీవనాల్ని ప్రభావితం చేసే సమస్యల్లో అత్యంత ప్రధానమైనది నిరుద్యోగం. ఇది తీవ్రరూపం దాలిస్తే ఈ ఒక్క సమస్యే అనేక సమస్యలకు దారితీస్తుంది. అందుకే "నిరుద్యోగం అనేది సమస్యల సమస్య" అంటారు సామాజిక నిపుణులు. ఏ ఆర్థిక వ్యవస్థయినా బాగా అభివృద్ధి చెందాలంటే అందుబాటులో ఉన్న అన్ని వనరులను సక్రమంగా వినియోగించుకోవాలి. వనరులన్నింటిలోకి మానవ వనరులు అత్యంత కీలకమైనవి. కీలకమైన ఈ వనరును నిరుద్యోగులుగా మిగిల్చి, నిర్వీర్యం చేసి సాధించేదేమిటి?

సగానికి పైగా యువజనమే... మన దేశం నిండా యువతరమే. భారతదేశం ప్రపంచంలో మరేదేశానికీ లేనంత యువసంపత్తి కలిగిన దేశం. ఇది అత్యంత ఆనందం కలిగించే అంశం కాగా.. ఏటేటా ప్రపంచంలో ఎక్కడా లేనంత నిరుద్యోగిత నమోదవుతున్న దేశం కూడా ఇదే కావడం ఆందోళన కలిగించే అంశం! ఈ వైరుధ్యాన్ని పరిష్కరించకుండా ఈ దేశ అభివృద్ధి సాధ్యమా? నిత్యం దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని ప్రగల్భాలు పలికే ప్రభుత్వాధీశులు దీనికేం సమాధానం చెబుతారు? ఈ దేశానికి అపార మానవ వనరు ఈ యువ సంపత్తిని భాగ్యస్వాముల్ని చేయకుండా సాధించేది ఏ అభివృద్ధీ, ఎవరి అభివృద్ధీ? "ప్రపంచీకరణ అనే వ్యవస్థలో ప్రభావితమవుతున్న ఏ దేశానికైనా ఉపాధి రహిత అభివృద్ధి అనేది ఆనందరహిత అభివృద్ధే" అంటారు ఎం.ఎస్.స్వామినాథన్. నేడు జరుగుతుందదే! ఉత్పత్తికి కీలకమైన మానవవనరుల్ని ఉపయోగించుకోలేకపోయినంత కాలం.. అంటే నిరుద్యోగం ఉన్నంత కాలం ఆ దేశ ఆర్థిక వ్యవస్థలోనే కాదు, సాంఘిక-రాజకీయ వ్యవస్థల్లో కూడా అనేక సమస్యలు తలెత్తుతూనే ఉంటాయి. అందుకే ప్రజా శ్రేయస్సుకోరే ఏ రాజ్యంలోనైనా నిరుద్యోగ నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా, తక్షణ కర్తవ్యంగా ఉంటుంది. మరి మోడీ ప్రాధాన్యతల్లో ఇది లేదంటే ఈ ప్రభుత్వం ఎవరి శ్రేయస్సు కోరుతున్నట్టు?

వృద్ధి మర్మం గుట్టు విప్పిచూడగా...!



ప్రభాత్ పట్నాయక్

చూడగానే అది ఒక మార్మిక విషయంగా కనపడుతుంది. అధికారిక గణాంకాల ప్రకారం స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు అత్యధికంగా నమోదయ్యే ప్రపంచ దేశాలలో భారతదేశం ఒకటి. అలాంటి భారతదేశ విజయగాథ వివరించటానికి ఆవిర్భవిస్తున్న ఆర్థిక అగ్రరాజ్యం, ప్రపంచ వృద్ధి పవర్‌హౌస్ వంటి గొప్పలను అలవోకగా వాడుతున్నారు. వృద్ధి రేటులో చైనాను కూడా అధిగమించేలా భారతదేశం పురోగమించటాన్ని బూర్జువా వ్యాఖ్యాతలు గర్వంగా భావిస్తున్నారు. స్థూల జాతీయోత్పత్తి వృద్ధిలో భారతదేశం 2019లో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంటుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎమ్ఎఫ్) చెబుతోంది. నికర గణాంకాల గురించి సందేహాలెన్నివున్నా సంప్రదాయ స్థూల జాతీయోత్పత్తికి సంబంధించి నయా ఉదారవిధానం అవలంబించక ముందుకంటే అవలంబించిన తరువాత వృద్ధి రేటు ఎక్కువగా ఉందనే విషయాన్ని ఒప్పుకోకతప్పదు.

అయినప్పటికీ ఏ కాలంలోనైతే భారతదేశ స్థూల జాతీయోత్పత్తి పెరిగిందో సరిగ్గా అదేకాలంలో ఆకలి, ఆకలి ప్రాతిపదికన నిర్వచించబడిన నిరపేక్ష పేదరికం పెరిగాయి. ఆర్థిక ఉదారీకరణకు ముందుకాలం కంటే నేటి భారతదేశంలో

రైతాంగ వ్యవసాయాన్ని, చిన్న ఉత్పత్తి రంగాన్ని(సహకార, సమిష్టి ఆస్తి రూపాల పరివర్తనలతో) పునరుద్ధరించటం ద్వారా మాత్రమే పేదరికం తగ్గుతుందితప్ప నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ పాలనలో జరిగే వృద్ధితో పేదరికం తగ్గదు. స్థూల జాతీయోత్పత్తి జరిగే సామాజిక సంబంధాన్ని చర్చించకుండా జీడీపీ వృద్ధిని పేదరికాన్ని రూపుమాపే సర్వరోగ నివారిణిగా భావించటమంటే అది చింతనలో పేదరికమే అవుతుంది.

ఆహారధాన్యాల వినియోగం తగ్గింది. అనాదిగా పౌష్టికాహార లోపం గల ప్రాంతంగా పేరుపడిన ఆఫ్రికా సగటుకంటే, అత్యంత వెనుకబడిన దేశాలుగా ఐక్యరాజ్య సమితిచే నిర్వచించబడిన దేశాల సగటుకంటే కూడా ఇది తక్కువ.

పట్టణ భారత దేశంలో 2100 క్యాలరీల, గ్రామీణ భారత దేశంలో 2200 క్యాలరీల ఆహారం కూడా అందుబాటు లేకపోవటమే దారిద్ర్యం అని అధికారికంగా నిర్వచించబడింది. ఇలా నిర్వచించబడిన పేదరికం పెరగటంలో ఆశ్చర్యం ఏమీలేదు. 1993-94లో గ్రామీణ భారతదేశంలో 2200 క్యాలరీల స్థాయిలో కూడా ఆహారం అందుబాటులోలేని జనాభా 58శాతం ఉండగా 2011-12లో ఈ జనాభా 68శాతానికి పెరిగింది(ఇవి నేషనల్ శాంపిల్ సర్వే(ఎన్ఎస్ఎస్) లార్జ్ శాంపిల్ సర్వే జరిగిన సంవత్సరాలు). ఈ కాలంలో 2100క్యాలరీల ఆహారం కూడా అందుబాటులోలేని పట్టణ భారతదేశ జనాభా 57శాతం నుంచి 65శాతానికి పెరిగింది. అంటే స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు పెరగటంతోపాటుగా పేదరికం కూడా పెరిగిందనేది సుస్పష్టం. ఇలా స్పష్టంగా కనపడుతున్న మార్మికతను ఎలా వివరిస్తారు? అనే ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది.

ముందుగా మనం తేలికపాటి వివరణలను తేల్చేద్దాం. ప్రజల ఆదాయం పెరిగితే వారు వినియోగించే ఆహారధాన్యాల పరిమాణం తగ్గి ఇతర వినియోగాలు పెరుగుతాయని, తత్ఫలితంగా ఆహారధాన్యాల తలసరి వినియోగం తగ్గుతుందని ఒక వివరణ అంటుంది. అలా ఆహారధాన్యాల తలసరి వినియోగం తగ్గటం వారి దిగజారిన ఆర్థిక పరిస్థితిని కాకుండా మెరుగుపడిన వారి జీవన ప్రమాణాలను తెలియజేస్తుందనేది ఈ వివరణ సారాంశం. ఈ వాదన తప్పు. ఎందుకంటే ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడినప్పుడు వారి ఆహారధాన్యాల ప్రత్యక్ష వినియోగం తగ్గుతుందనేది నిజమైనప్పటికీ వారు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వినియోగించే ఆహారధాన్యాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు వారి వినియోగం పెరుగుతుంది. ఎందుకంటే వారు తీసుకునే మాంసాహారం, ఇతర ఆహార ఉత్పత్తులలో వినియోగించే ఆహారధాన్యాలు ప్రజల పరోక్ష వినిమయంలో భాగమౌతాయి. ఆవిధంగా ఆహారధాన్యాల తలసరి మొత్తం(ఇది ప్రత్యక్ష, పరోక్ష వినిమయాలను కలపగా వచ్చేది) వినియోగంలోని మార్మికతను ఇంత సరళంగా వివరించటం కుదరదు.

విద్య, ఆరోగ్యం, ఇతర సేవలపై ఖర్చు చేయటం కుటుంబాలకు అలవాటు కావటంవల్ల ఆహారధాన్యాలపై చేసే వ్యయం తగ్గుతుందని రెండవ తేలికపాటి వివరణ తెలియజేస్తుంది. మనం చర్చిస్తున్న కాలంలో అవసర సేవల ప్రయివేటీకరణ జరగక పోయినట్టయితే ఈ వివరణకు కొంత విలువుండేది. అయితే ప్రయివేటీకరణతో ఈ సేవల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ కాలంలో కూడా ప్రభుత్వ సేవలు అందరికీ అందుతున్నాయనే ఊహన కారణంగా ఈ పెరుగుదల వినిమయ ధరల పెరుగుదల సూచీలలో కనపడదు. గతంలో పొందిన స్థాయిలో సేవలను వినియోగించుకోవాలంటే నేడు ప్రజలు తమ ఆహారధాన్యాల వినియోగాన్ని తగ్గించుకుని సదరు సేవలకు మరింత పైకాన్ని చెల్లించవలసి ఉంటుంది.

తమ కుటుంబ సభ్యుల వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలులేక ప్రయివేటు ఆస్పత్రుల సేవలను వినియోగించుకోవలసి వస్తుంది. అలా వినియోగించుకున్న సేవలకు చెల్లించవలసిన బిల్లుల కోసం రైతు కుటుంబాలు తమ భూమిని అమ్మిన లేక అప్పుల పాలయిన సంఘటనలు మనకు నిత్యం కనపడతాయి. అటువంటి పరిస్థితులలో వారు తమ ఆహారధాన్యాల వినిమయాన్ని తగ్గించుకుంటారు. కాబట్టి ఒక స్థాయి ధరలవద్ద విద్య, ఆరోగ్య సంరక్షణలపై కుటుంబాలు చేసే వ్యయంలో మార్పు వచ్చిందని చెప్పకుండా చేసే విశ్లేషణ వేరే దృశ్యాన్ని ఆవిష్కరింపజేస్తుంది. అలా ఒక స్థాయి ధరలవద్ద అటువంటి మార్పు వచ్చిందన్నప్పుడు ప్రజల ఆర్థిక స్థితి క్షీణించలేదని భావించవచ్చు. అలాకాకుండా పెరిగిన అవసర సేవల ధరలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు వాటి వత్తిడితో పెరిగిన ఆకలి, పేదరికం దృశ్యం మనకు కనపడుతుంది. దీనితో కూడా మరలా ఒక ప్రశ్న ఉదయిస్తుంది. స్థూల జాతీయత్పత్తిలో వేగవంతమైన వృద్ధితోపాటుగా ఆకలి, పేదరికం కూడా ఎందుకు పెరుగుతున్నాయి? అనేదే ఆ ప్రశ్న.

అయితే వాస్తవంలో దీనిలో అంత మార్మికత ఏమీలేదు. అధికవృద్ధి రేటు ఉంటేనే పేదరికం తగ్గుతుందని అంటే దానిలో మార్మికత ఏర్పడుతుంది. అయితే అలా జరగాలనే ఆలోచన లోపభూయిష్టమైనది. పేదరికాన్ని క్యాలరీల వినియోగం లేక ఆహారధాన్యాల వినియోగం ప్రాతిపదికన కొలిచినప్పటికీ అది ఒక సామాజిక సంబంధం పర్యవసానం. పేదరికంపై స్థూల జాతీయోత్పత్తి వృద్ధి ప్రభావం అది జరిగే సామాజిక సంబంధంపై ఆధారపడివుంటుంది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలోని సామాజిక సంబంధంలో స్థూల జాతీయోత్పత్తి వృద్ధి వేగవంతంగా జరుగుతున్నప్పటికీ ఆకలి, పేదరికం పెరుగుతాయి.

కాబట్టి ఈ వాస్తవంలో రవ్వంతైనా ఆశ్చర్యం లేదు. వేరే మాటల్లో చెప్పాలంటే వేగవంతంగా జరుగుతున్న స్థూల జాతీయోత్పత్తి వృద్ధితో పాటుగా పేదరికం పెరుగుతుందన్న వాస్తవం అటువంటి వృద్ధి జరుగుతున్న నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలోని సామాజిక సంబంధం స్వభావాన్ని తెలియజేస్తుంది. జీడీపీ వృద్ధి ఎక్కువగావుంటే పేదరికం తగ్గుతుందని చెప్పటమంటే సామాజిక సంబంధం అనే కేంద్రకం నుంచి దృష్టిని మరల్చి విషయాన్ని గందరగోళపరచటమే. జీడీపీ వృద్ధిపైనే ప్రజల దృష్టి కేంద్రీకృతమవ్వటమనే వాస్తవం దేశంలో నయా ఉదారవాద ప్రవచనం ఆధిపత్యాన్ని తెలియజేస్తున్నది. దీని లక్ష్యం విషయాలను గందరగోళపరచటం.

నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన సామాజిక సంబంధంలోపల జరుగుతున్న వృద్ధిలో వేగం ఉన్నప్పటికీ ఆకలి, పేదరికం ఎందుకు పెరుగుతాయి? అనే



ప్రశ్నకు సమాధానం నయా ఉదారవాద పాలనలో చిన్న ఉత్పత్తి దాడికి గురవుతుందనే వాస్తవంలో ఉంది. ఇది యాదృచ్ఛికంగా జరిగేది కాదు. నయా ఉదారవాద పాలనకున్న విశిష్ట లక్షణం ఇది. ఈ పాలన ప్రపంచీకరింపబడిన ద్రవ్య పెట్టుబడితో సంబంధంలో ఉంది. దీనర్థం ఏమంటే జాతి రాజ్యాలుగల ప్రపంచంలో ప్రభుత్వ విధానం ప్రపంచీకరింపబడిన ద్రవ్యపెట్టుబడి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఉండితీరాలి. దీనితో బడా పెట్టుబడి దురాక్రమణ నుంచి రైతాంగ వ్యవసాయంతోసహా చిన్న ఉత్పత్తిని కాపాడటం, మద్దతునివ్వటం, మన్నికశక్యం చేయటంవంటి పాత్ర నుంచి ప్రభుత్వం ఉపసంహరించుకోవటం అనివార్యం అవుతుంది.

ఇలా రైతాంగ వ్యవసాయానికి అందజేస్తున్న సబ్సిడీలను ప్రభుత్వం ఉపసంహరించుకోవటంవల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఆహారధాన్యాలకు కాకపోయినా వాణిజ్య పంటలకు కూడా మద్దతు ధరలను ఉపసంహరించటం, ప్రపంచ మార్కెట్‌లో ధరల ఒడిదుడుకులకు గురయ్యేలా చేయటంవంటి చర్యలు ఈ రంగం మన్నిక శక్యతను దెబ్బతీస్తున్నాయి. 1991, 2011 సంవత్సరాలలో జరిగిన జనాభా లెక్కల మధ్య కాలంలో రైతుల సంఖ్య 1.5కోట్లు తగ్గిందనే(గత 25ఏండ్లలో మూడు లక్షల రైతులు ఆత్మహత్య చేసుకున్నారు) వాస్తవం ఈ రంగం దుస్థితికి అద్దంపడుతోంది. అలా గణాంకాలలో కనపడకుండాపోయిన రైతులలో అనేకమంది వ్యవసాయ కూలీలుగా మారివుంటారు. ఇతరులు విస్తృతమవ్వని ఉద్యోగాల వేటలో నగరాల బాటపట్టివుంటారు. దానితో నిరుద్యోగ సైన్యం పరిమాణం పెరిగి పట్టణ కార్మికుల(కార్మిక సంఘాలలోని కొద్దిమంది కార్మికులతోసహా) వాస్తవ తలసరి సంపాదన కుదింపుకు గురవుతుంది.

ఆవిధంగా చిన్న ఉత్పత్తిపై ఏర్పడిన వత్తిడివల్ల అమ్ముడుపోని ఆహారధాన్యాలు పోగుపడటం(ఆ తరువాత అవి ఎగుమతి చేయబడతాయి), ఆకలి పెరగటంవల్ల గ్రామీణ, పట్టణ కార్మికులందరి వాస్తవ తలసరి ఆదాయం క్షీణించింది. అంటే చిన్న ఉత్పత్తిపై ఈ వత్తిడి లేక పెట్టుబడియొక్క మూలధన సంచయంతోపాటుగా జీడీపీ వృద్ధి వేగవంతం కావటమనే వాస్తవం ఆకలి, పేదరికాలను ప్రభావితం చేయజాలవు.

ఉద్యోగితను పెంచి ఉన్నదానికంటే మరింత ఎక్కువగా జీడీపీ వృద్ధిని సాధించటంతో నిరుద్యోగ సైన్య పరిమాణాన్ని తగ్గించవచ్చనీ, తద్వారా పేదరికాన్ని తగ్గించవచ్చనీ అనుకోవచ్చు. అయితే నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇలా జరగటం సాధ్యపడదు. రైతాంగ వ్యవసాయంపై పడుతున్న వత్తిడివల్ల ఆహారధాన్యాల సరఫరా, డిమాండ్లు ప్రభావితమై నయా ఉదారవాద శకంలో తలసరి ఆహారధాన్య ఉత్పత్తి పెరగనప్పటికీ అమ్ముడుపోని ధాన్యం రాశులుగా పోగుపడుతుంది.

ఇప్పుడు నయా ఉదారవాద పాలనలో జీడీపీ వృద్ధి మరింతగా పెరగటంతో ఉద్యోగిత పెరిగింది అనుకుందాం. అలా పెరిగిన ఉద్యోగిత కారణంగా ఆహారం డిమాండ్ పెరిగి అమ్ముడుపోని ఆహారధాన్యాల స్టాక్ వినియోగించబడుతుంది. ఆ తరువాత ఉద్యోగిత మరింతగా పెరిగితే ఆహారం ధరలలో ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. దాన్ని నివారించటానికి ప్రభుత్వం ఉద్యోగితతోసహా కార్మికుల ఆదాయాన్ని కుదించే చర్యలను చేపడుతుంది. అటువంటి స్థితిలో ఆధార సంవత్సరంతో పోల్చినప్పుడు తలసరి ఆహారధాన్య ఉత్పత్తి పెరగటం సాధ్యపడనందున జీడీపీ వృద్ధి వేగవంతం అయినప్పటికీ ఆకలి, దారిద్ర్యాలు ఏమాత్రం తగ్గవు.

కాబట్టి దీనితో మనకు అర్థమౌతున్నదేమంటే కార్మికుల జీవన ప్రమాణాలు పెరగటానికి అంటే ఆకలి, పేదరికం తగ్గటానికి తలసరి ఆహారధాన్య ఉత్పత్తి పెరగటం అవసరం. అందుకోసం రైతాంగ వ్యవసాయం పునరుత్తేజింపబడాలి. ఇలా జరగటం నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభానికి విరుద్ధం గనుక నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో జీడీపీ వృద్ధిరేటు ఏమైనప్పటికీ పేదరికం తగ్గటం దుస్సాధ్యం. అలా పేదరికం తగ్గకపోగా వర్తమానంలో జరుగుతున్నట్టుగా పేదరికం పెరిగే అవకాశం ఉంది.

ఈ విషయాన్ని వేరేవిధంగా చెప్పాలంటే రైతాంగ వ్యవసాయాన్ని, చిన్న ఉత్పత్తి రంగాన్ని(సహకార, సమిష్టి ఆస్తి రూపాల పరివర్తనలతో) పునరుద్ధరించటం ద్వారా మాత్రమే పేదరికం తగ్గుతుందితప్ప నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ పాలనలో జరిగే వృద్ధితో పేదరికం తగ్గదు. స్థూల జాతీయోత్పత్తి జరిగే సామాజిక సంబంధాన్ని చర్చించకుండా జీడీపీ వృద్ధిని పేదరికాన్ని రూపుమాపే సర్వరోగ నివారిణిగా భావించటమంటే అది చింతనలో పేదరికమే అవుతుంది.

అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్: 8886396999

మెయిల్ @ నవతెలంగాణ




కె. సతీష్‌రెడ్డి

సమాజానికి దిక్సూచి పత్రికలే...

భారతదేశంలో 29.1.1780న మొట్టమొదటి వార్తాపత్రిక హికీస్ బెంగాల్ గెజిట్ లేక ఒరిజినల్ కలకత్తా జనరల్ అడ్వైజర్ ప్రచురింపబడింది. ఈ పత్రికను ఇంగ్లీషులో జేమ్ ఆగస్టిన్ హిక్ ప్రచురించారు. భారతదేశంలో వ్యాపార ప్రకటనలు మొదటిసారిగా ఇదే రోజున ఈ పత్రికలో ప్రచురింపబడినాయి. దేశంలో మొదటి వార్తాపత్రిక ప్రచురింపబడిన రోజు కనుక ప్రతి సంవత్సరం జనవరి 29న వార్తాపత్రికా దినోత్సవం జరుపుకుంటారు. సమాజానికి వెలుగు దివ్వెలు వార్తాపత్రికలు. నేడు దేశంలో అన్ని రాష్ట్రాలలో అన్ని భాషలలో వార్తా పత్రికలు వెలువడుతున్నాయి. వార్తా పత్రికలు ప్రజలకు, పాఠకులకు అవసరమయ్యే సమాచారాన్ని అందిస్తున్నాయి. ఎన్నో వ్యయ ప్రయాసాలను ఎదుర్కొని వార్తాపత్రిక యాజమాన్యాలు వార్తా పత్రికలను ప్రచురిస్తున్నాయి. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థానిక వార్తలు పత్రికలలో పొందుపరుస్తున్నారు. వార్తా పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులు వార్తలను సేకరించి పాఠకులకు అందిస్తున్నారు. ప్రజా సమస్యలను, అవినీతి, అక్రమాలను, అన్ని రకాల అంశాలను వెలుగులోకి తెస్తూ, అందిస్తున్నారు. అనేక మంది పాఠకులకు ఉదయం నిద్రలేవగానే వార్తాపత్రిక (ఏదైన ఒక దినపత్రిక) చదవనిదే ఆ రోజు గడవదు. వారి దినచర్య పత్రికల పఠనంతోనే మొదలవుతుంది. నేడు అన్ని న్యూస్ చానళ్లలో ఉదయం న్యూస్ పాయింట్ పేరు మీద వివిధ మేధావులు, సీనియర్ జర్నలిస్టులతో వివిధ పత్రికలలో వచ్చిన ప్రధాన వార్తలను చదివి విశ్లేషణలు చేస్తున్నారు. పోటీ పరీక్షలకు సంసిద్ధులవుతున్న విద్యార్థులు పత్రికలలోని ప్రధానాంశాలను ఒక పుస్తకం, నోట్ బుక్‌లో రాసుకుని ఎడిటోరియల్ పేజీ బాగా చదువుతున్నారు. అన్ని దినపత్రికలు విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, రైతులు, ఆధ్యాత్మికం, సినీ పేజీలతో వార్తలను అందిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాషలో ప్రచురింపబడుతున్న పత్రికలు అనేకంగా ఉన్నాయి. ప్రతీ పత్రికను పాఠకులు ఆదరిస్తున్నారు. సమాజానికి దిక్సూచి పత్రికలే. పత్రికలను పాఠకులందరూ గౌరవించాలి. నేడు అనేక మంది పాఠకులు తమ ఆండ్రాయిడ్ ఫోన్లలోనే పత్రికలను చదువుతున్నారు. ఏదేమైనా పత్రికలను చేతిలో పట్టుకుని చదివితే ఆ తృప్తి వేరుగా ఉంటుంది. ముఖ్యంగా యువత పత్రికలను చదవటం లేదు. పత్రికా పఠనం మేధోసంపత్తిని పెంచుతుంది. చక్కగా మాట్లాడే నైపుణ్యాన్ని పెంచుతుంది. పత్రికలను చదువుదాం.. విజ్ఞానాన్ని పెంచుకుందాం.. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుందాం.

సెల్: 9848445134

దేశభక్తా... దేహభక్తా?




సాగర్ వనపర్తి

ఏండ్లుగా నలుగుతున్న అవినీతికి చరమగీతం పాడాలన్న నినాదాల కారణంగా 2014లో భారత ప్రధాని పీఠం మోడీ సొంతమైంది. ఒక సాధారణ వ్యక్తి దేశపు అత్యున్నత స్థానాన్ని అధిష్టించడంతో పేద, దిగువ మధ్య తరగతి యువత, విద్యార్థి లోకం బతుకులకు భరోసా దొరుకుతుందన్న ఆశకు ఆయువు వచ్చినట్టయింది. అయితే, అవేవీ జరగకపోగా ఉన్న సమస్యలకు మరిన్ని తోడైన పరిస్థితి ప్రస్తుతం దేశంలో నెలకొంది. మోడీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచీ ఇప్పటివరకూ 92 విదేశీ పర్యటనలు చేపట్టారు. అందుకు భారత ప్రభుత్వం వెచ్చించినది అక్షరాలా రూ.2,021 కోట్లు. మోడీకి ముందు మన్మోహన్‌సింగ్ తన పది సంవత్సరాల కాలంలో మొత్తంగా 93 విదేశీ పర్యటనలు చేపట్టగా అందుకు కేవలం రూ.1,250 కోట్లు ఖర్చు అయినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే నాలుగేండ్లలోనే మోడీ జరిపిన 92 దేశాల పర్యటనలో ఇంత స్థాయిలో ప్రజాధనం ఖర్చుకు గల ప్రధాన కారణం, ప్రధాని ఇష్టారీతిన పర్యటనలు చేపట్టడం ఒకటయితే, టూర్ సమయంలో ఆయనిచ్చిన ప్రకటనలు, విదేశాల్లో భారతీయులతో ఏర్పాటు చేసిన సభలు, సమావేశాలే కారణమని పీఎంఓ అధికారులు చెబుతున్నారు. మన్మోహన్‌సింగ్ పర్యటనలన్నీ ఇతర దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ప్రభుత్వాధిపతిగా కనీసంగా పాల్గొనవలసిన కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు జరిపినవి. అయితే, మోడీ మాత్రం భారత్ తరపున ఇతర దేశాలతో వాణిజ్య, ద్వైపాక్షిక, రక్షణ సంబంధిత ఒప్పందాల కంటే తన వ్యక్తిగత ఇమేజ్ పెంపొందించుకునేందుకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విదేశీ గడ్డపై తన వ్యక్తిగత స్టేచర్‌ని అధికం చేసుకునేందుకు ఈ అవకాశాన్ని ఆయన వినియోగించుకుంటున్నట్టు మేధావిలోకం వ్యాఖ్యానిస్తున్నది. మోడీ దగ్గర ఉండే ప్రజా సంబంధాల బాధ్యులు(పీఆర్‌ఓలు) కూడా ప్రధాని విదేశీ టూర్‌లో ఒక ఈవెంట్ తర్వాత మరో ఈవెంట్ ఏర్పాటు చేస్తూ ఈ పర్సనల్ ఎలివేషన్‌లో మరింత భాగస్వామ్యులవుతున్నారని స్పష్టంగా చెప్పవచ్చు. ఇక బీజేపీ పరివారం మోడీ విదేశీ పర్యటనలపై కల్పించే ప్రచారం అంతా ఇంతా కాదు. ఆయన విదేశాల్లో తుమ్మినా... దగ్గినా సామాజిక మాధ్యమాల్లో పరాయి గడ్డపై మోడీ భారత ఖ్యాతిని పెంచుతున్నారని విపరీతమైన పోస్టులు, లైకులతో మోత మోగిస్తున్నారు. వాస్తవానికి దేశ ప్రధానిగా పర్యటన చేసినప్పుడు భారత ప్రభుత్వానికి ఉపయోగపడే ఒప్పందాలపై ప్రధానిగా ఆయన తన సమయాన్ని అధిక మొత్తం దృష్టి సారించాల్సి ఉంటుంది. వాస్తవంలో మాత్రం, అవి ఆయన టూర్‌లో ప్రధాన ఏజెండా ఉండటం లేదు. ఇక్కడ ఇంకో విషయం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధాని ఆ మధ్య చేపట్టిన అమెరికా పర్యటనలో భాగంగా ఫేస్‌బుక్ సీఈఓ జుకర్‌బర్గ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ళ, సెర్చ్ ఇంజిన్ సీఈఓ సుందర్ పిచయ్ తదితర ఐటీ దిగ్గజాలతో ప్రత్యేక భేటీలు నిర్వహించారు. వారితో గంటల కొద్ది మంతనాలు జరిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో తలపండిన వారితో చర్చలు జరిపిన మోడీ మన దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగంలో మరింత అభివృద్ధి చేస్తారని అంతా భావించారు. వారంతా ఆయనను గాడ్జెట్ లవర్ (సాంకేతిక ప్రేమికుడు) అని అభివర్ణించారు కూడా. అయితే, అటు తర్వాత జరిగిన భారత సైన్స్ కాంగ్రెస్‌లో మోడీ తన విజ్ఞానరాహిత్యంతో దేశ ప్రజానీకాన్ని ఆందోళనకు గురి చేశారు. వినాయకుడి తల అంటించడం ప్లాస్టిక్ సర్జరీ అని... రామాయణ కాలంలోనే పుష్పక విమానాలున్నాయనీ చెప్పడంతో భారత సైన్స్ లోకం నివ్వెరపోయింది. ఇతిహాసాల్లో రాసుకున్న అంశాలను నిజం చేయాలను కోవడం అంటే మూఢ విశ్వాసాన్ని, సైన్స్‌గా నమ్మబలికించడమేనని నోబెల్ అవార్డు గ్రహీత వెంకీ రామకృష్ణన్ చేసిన విమర్శ మోడీకి సూటిగా తగిలింది. దాంతోపాటు 2014 ఎన్నికల సమయంలో మేక్ ఫర్ ఇండియా, మేకిన్ ఇండియా వంటి నినాదాలు ఆయన ఫారెన్ టూర్లతో కొంతమేర అయినా ఆచరణ రూపం దాల్చుతాయని ఆశించినవారికి ఆశాభంగమే అయింది. మోడీ విదేశీ పర్యటనలు చేసి ఎంతమేర ఈ దేశానికి పెట్టుబడులు తీసుకువచ్చారు? అని అడిగితే అధికార పార్టీ నేతల దగ్గర సరైన సమాధానమే దొరకదు. ఇక పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక పర్యటన చేసి అందరినీ అబ్బురపరిచారు. అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ మనవరాలు పెండ్లి వేడుకలో ఆహ్వానం లేకపోయినా పాల్గొన్నారు. అనంతరం ఫలితం ఏమయిందో దేశమంతా గమనించింది. పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై

❛ దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొత్త పుంతలు తొక్కించాలి. అవేవీ చేయకుండా నెహ్రూ స్థాయితో పోల్చుకొని మోడీ విదేశీ టూర్ చేయడం అక్కడ అద్భుత ప్రసంగాలు చేయడం వల్ల పెద్ద ఉపయోగం ఏమీ ఉండదు. ఖద్దరు సూటు, ఖరీదైన బూటు వేసుకొని విదేశీ గడ్డపై అంతర్జాతీయ ఛానళ్ళకు ఇంటర్వ్యూలు ఇవ్వడం ద్వారా దేహ ప్రచారం వస్తుందేమో కానీ దేశభక్తి అగుపించదన్న విషయం ప్రధాని మోడీ గుర్తించాలి. ❜

పాకిస్థాన్ నుంచి చొరబడిన ముష్కరులు దాడి చేశారు. ఇక పాక్‌తో ఎటువంటి సంబంధాలు లేనే లేవు. డొక్లాం విషయంలో సైతం మోడీ ప్రభుత్వం సమస్యను వివాదాస్పదం చేయడానికి యత్నించిన



తీరు ఆందోళనకరం. భూటాన్, చైనాల మధ్య గల వివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి యుద్ధ వాతావరణాన్ని తలపించి ఒనగూడబెట్టిన లాభమేమీ లేదనిపించుకుంది. బీజేపీ దాని సైద్ధాంతిక గురువు ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ నెహ్రూ స్థాయిని తగ్గించేందుకు యత్నిస్తూ వస్తున్నాయి. అందుకోసం ఆర్ఎస్ఎస్ కీలకంగా ఒక నాయకుడిని వెతుక్కున్నది. అటల్ బిహారీ వాజ్‌పేయ్‌పై కొంతదూరం వరకు ఆశలు పెట్టుకున్నది. అయితే నెహ్రూ ప్రతిష్టకు సరితూగ గల చర్యలు అటల్‌జీ చేపట్టలేకపోవడంతో ఆయన శక్తి సామర్థ్యాలు పూర్తిగా సరిపోలేదన్న విషయం విదితమే. అటుతర్వాత లాల్‌కృష్ణ అద్వానీని ఆ విధంగా చూపించాలని ప్రయత్నించినా ఆయన కూడా అంతగా జనాకర్షణ పొందలేకపోయారు. దాదాపు పదేండ్లపాటు సాగిన యూపీఏ పాలనలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాల నేపథ్యంలో మోడీ నాయకత్వంలో భారీ మెజారిటీతో గెలుపొందారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత తన ప్రమాణస్వీకారానికి సౌత్ ఏసియా దేశాధినేతలను పిలుచుకొని తానొక విశాల దృక్పథం కల్గిన నాయకుడిగా సంకేతాలిచ్చేందుకు తీవ్రంగా కృషి చేశారు మోడీ. ఇటువంటి చర్యలతో నెహ్రూ కంటే తామే అధికులమని కమలనాథులంతా ప్రచారం చేసుకున్నారు. దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చుతున్న తొలినాళ్ళలో రెండు అగ్రరాజ్యాల మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధంలో నెహ్రూ ఎవ్వరి వైపూ పూర్తిగా మొగ్గు చూపలేదు. సరికొత్తగా అలీన విధానం అంటూ నూతన దారికి జీవం పోశారు. క్యాపిటలిజానికి, కమ్యూనిజానికి జరుగుతున్న పోరాటానికి ఆయన దూరంగా ఉన్నప్పటికీ వామపక్ష భావజాలం కల్గిన రష్యాతో సంబంధాలు నెరిపి పలు అభివృద్ధి పనులు చేసుకొచ్చారు. ఇంకా చెప్పాలంటే నెహ్రూ కృషి కారణంగా రష్యా ఈ దేశానికి ఎన్నో విధాలుగా సాయాలు చేసింది. ఇక మోడీ మాత్రం విదేశాల నుంచి చేసుకున్న ఒప్పందాలు, విధానాలు భారత ప్రజానీకం ఆకాంక్షలను చేరుకోలేక పోయాయి అనడంలో ఎటువంటి సంశయం అక్కర్లేదు. అఫ్ఘానిస్థాన్‌కు ఆర్థిక సాయం ఇవ్వడమేగాక, ఇటీవల కూడా మాల్దీవులకు 1.4 బిలియన్ డాలర్లు ఇస్తామని చెప్పారు. ఇతర దేశాలతో సత్సంబంధాలు ఎవ్వరికైనా అవసరమే కానీ వాటి పేర మన దేశ ప్రజానీకం కట్టిన నిధులను ఇతర దేశానికి ధారపోయడమంటే నిజంగా ప్రశ్నించాల్సిన అంశం. నెహ్రూ సైతం తన హయాంలో ఒకటి అర అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకున్నారు. దానిపై ఎవ్వరికీ భిన్నాభిప్రాయం లేదు. కానీ, ఆయన చేసిన అంతర్గత అభివృద్ధి... ఇతర దేశాలతో నెరిపిన సంబంధాల తీరు నెహ్రూలోని ఓ విలక్షణ నాయకుడిని బహిర్గత పరిచాయి. అవే నెహ్రూను ప్రపంచం గర్వించదగ్గ స్టేట్స్‌మన్‌ను చేశాయి. అందుకే భారత విదేశాంగ రూపశిల్పి అని అంటారు. నెహ్రూ వ్యవసాయంలో విప్లవం, పారిశ్రామిక విధాన అభివృద్ధే తన ప్రభుత్వ నినాదంగా మార్చుకున్నారు. అందువల్లే దేశం లోపల, వెలుపల ఆయనొక శిఖర సమాన నాయకుడయ్యాడు. అటువంటి నాయకుడితో మోడీ పనిలో పోటీపడాలి. దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొత్త పుంతలు తొక్కించాలి. అవేవీ చేయకుండా నెహ్రూ స్థాయితో పోల్చుకొని మోడీ విదేశీ టూర్ చేయడం అక్కడ అద్భుత ప్రసంగాలు చేయడం వల్ల పెద్ద ఉపయోగం ఏమీ ఉండదు. ఖద్దరు సూటు, ఖరీదైన బూటు వేసుకొని విదేశీ గడ్డపై అంతర్జాతీయ ఛానళ్ళకు ఇంటర్వ్యూలు ఇవ్వడం ద్వారా దేహ ప్రచారం వస్తుందేమో కానీ దేశభక్తి అగుపించదన్న విషయం ప్రధాని మోడీ గుర్తించాలి.

సెల్: 9494041258



2018 హిందీ పదంగా 'నారీశక్తి'

ఇంతకుముందులా ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూపు చూసే పరిస్థితులు నెమ్మది నెమ్మదిగా మారుతున్నాయి. తమ జీవితంలో నిర్ణయాలు తామే తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు. అన్నింటికీ మించి అవగాహన, చైతన్యం పెరుగుతున్నాయి. అందుకు కారణం... వివిధ రంగాల్లో పెరిగిన మహిళా పోరాటాలు. దీంతో గత ఏడాది హిందీలో ఎక్కువగా నారీశక్తి అనే పదాన్ని ఉపయోగించారు. అందుకే గత ఏడాది(2018)కి సంబంధించి హిందీ పదంగా 'నారీశక్తి' నిలిచిందని ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం ఇక్కడ జరుగు తున్న జైపుర్ లిటరేచర్ ఫెస్టివల్ (జేఎల్ఎఫ్)లో ఈ ప్రకటన చేసింది. "గత ఏడాది మార్చిలో నారీశక్తి పదాన్ని భారీ స్థాయిలో ఉపయోగించారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం నారీశక్తి పురస్కారాలను ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది" అని వివరించింది. ❄





ఒకప్పుడు రవికలంటే ఒకే రకంగా ఉండేవి. కానీ ఇప్పుడు రకరకాల బ్లౌజులు వచ్చాయి. ఇప్పుడు బ్లౌజులకు కాలర్ ఓ ట్రెండ్. అలాగే... రకరకాల స్లీవ్స్ ఓ ఫ్యాషన్. ఎలాంటి చీరకట్టినా బ్లౌజు ప్రత్యేకమైతే వచ్చే లుక్కే వేరు. అందుకే బ్లౌజులపట్ల ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారు మగువలు. అలాంటి రకరకాల రవికెలవి.

రకరకాల రవికెలు







ఇట్లచేద్దాం

వంట చేసేటప్పుడు, స్టవ్, వంట బండపై నూనెతోపాటు రకరకాల మరకలు పడతాయి. ఆ జిడ్డు అంత సులభంగా వదలదు. కాసిన్ని వేడినీళ్లలో రెండు చెంచాల వెనిగర్, చెంచా ఉప్పు కలిపి ఆ మిశ్రమంతో శుభ్రం చేయాలి.



జీర్ణసమస్యలకు చింత

చింతకాయల్ని చూడగానే నోరూరుతుంది. పిందె దశ నుంచి పండిన కాయలుగా మారేదాకా ఒక్కో దశలో ఒక్కో రుచినిస్తుంటాయి. చింతకాయను పచ్చళ్లు, కూరల తయారీకి వాడుతుంటారు. ఇవి రుచిగా ఉండటమే కాదు.. మనకు ఆరోగ్యపరంగాను ఎన్నో లాభాలున్నాయి.

- చింతచిగురు, పిందెలు, కాయలు, పండిన కాయలు, ఎండు చింత అన్ని ఉపయోగమే. చింత గుజ్జులో జీర్ణక్రియ, కూలింగ్, లాక్సేటివ్, యాంటీ సెప్టిక్ గుణాలుంటాయి. గ్యాస్ట్రిక్, జీర్ణసంబంధిత సమస్యలకు ఆయుర్వేదంలో చింతపండును వాడుతారు.
- ఉదరంలో ఉండే నులిపురుగుల్ని చింత ఆకు నశింప చేస్తుంది. జాండిస్ ఉన్న వారికి ఇది ఔషధం లాంటిది.
- పండిన చింతకాయల నుంచి పైపెంకు, గింజ తిసి ఎండబెట్టి చింతపండు తయారు చేస్తారు. వీటి గుజ్జు వికారం, మలబద్దకం, అజీర్ణం వంటి సమస్యలను నుంచి ఉపశమనం కలిగిస్తుంది. నీటిలో నానబెట్టి గుజ్జు పిండుకోవాలి. ఆకలి మందగించినప్పుడు, ఆహారం తినాలన్న కోరిక నశించినప్పుడు ఇది ఉపకరిస్తుంది.
- చింతచిగురు కాలిన గాయాలకు ఉపయుక్తమైన చికిత్స. ఆకుల్ని సెగపై కాల్చి పొడి చేసి జల్లించి, నువ్వుల నూనెతో కలిపి కాలిన గాయాలపై రాయాలి. కొద్దీ రోజుల్లోనే గాయం మానుతుంది. చింత ఆకులు నలిపి నీటిలో వేసి, కషాయం తయారు చేసి జాయింట్లు, మడమలపై రాస్తే నొప్పుల వాపు తగ్గుతాయి.
- 'సి' విటమిన్ లోపం వల్ల వచ్చే స్కర్వీ వ్యాధిని చింతపండు నివారిస్తుంది.
- చింతపండు, మిరియాల రసం జలుబు, దగ్గులకు మంచి సూప్. చింతపండు పిండి, అందులో టీ స్పూన్ మిరియాల పొడి వేసి తాలింపు పెడితే నోటికి రుచిగా ఉంటుంది. జ్వరం నుంచి కోలుకున్నప్పుడు జీర్ణశక్తినిస్తుంది.
- గొంతులో గరగరలాడుతున్నట్టుంటే చింత పండు నీటితో పుక్కిలిస్తే మంచి ఫలితం ఉంటుంది. నీటిలో చింతపండు వేసి బాగా మరిగించి రసాన్ని తయారు చేసుకోవాలి. ఎండు చింత ఆకుల పొడిని కూడా పుక్కిలించుకోవడానికి వాడుకోవచ్చు.
- భారతీయ ఆహారంలో చింతకాయ పచ్చడి ప్రసిద్ధి గాంచింది. ఇక చింతచిగురు పప్పు రుచి చూడాల్సిందే. ❄

నడిచేటప్పుడు...



నడకతో మానసికంగా, శారీరకంగా ఎన్నో రకాల ప్రయోజనాలున్నాయి. అయితే ఆ సమయంలో తగిన నియమాలు పాటించకపోతే ఎంత దూరం నడిచినా... శ్రమ పడినా ఫలితం ఉండదు. నడిచేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే శ్రమకు తగిన ఫలితం. అవేంటంటే..

- పాటలు వింటూనో, ఫోన్ మాట్లాడుతూనో, స్నేహితులతో కబుర్లు చెబుతూనో నడవకూడదు. నడిచే సమయంలో శ్వాస మీద ధ్యాస ఉండాలి. అప్పుడే దానికి ఫలితం అందుతుంది. అలానే పచ్చని చెట్ల మధ్య నడిస్తే మానసిక ఆరోగ్యమూ సొంతమవుతుంది.
- నడిచేటప్పుడు శరీరాక తి మీద ద ష్టి పెట్టాలి. వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలి. చాలామంది దీన్ని పట్టించుకోరు. కానీ ఈ ఒక్క జాగ్రత్త తీసుకోవడం వల్ల ఎన్నో సమస్యల్ని దూరం పెట్టొచ్చు. నడుము నొప్పి బాధించదు. పొట్ట త్వరగా తగ్గుతుంది.
- పాదాన్ని బలంగా నేలకు తాకించడం... కాలిని అదిమిపట్టి నడవడం సరికాదు. ఇలా చేస్తే పాదాలు నొప్పిపుడతాయి. పగుళ్ల సమస్య ఉంటే ఇంకా ఎక్కువ అవుతుంది.
- సమాంతరంగా ఉండే బూట్లు వాడుకోవాలి. నడుము, మోకాళ్ల నొప్పులు ఉన్నవారు యాంకిల్ గ్రిప్ ఉన్నవి ధరించాలి. మోకాళ్లు, నడుము నొప్పి వచ్చి తగ్గిపోయిన వాళ్లు వాకింగ్ చేయాలనుకుంటే యాంకిల్ బ్యాండ్, మోకాలి పట్టీలు, నడుము బెల్టులు వేసుకోవచ్చు. ఇలా చేస్తే కండరాలు ఇంకా ద ఢమవుతాయి.
- గట్టిగా ఉండే ఉపరితలం మీద నడవడం సరికాదు. మట్టి, గడ్డిపరకలతో ఉన్న గ్రౌండ్‌లు, పార్కుల మీద నడవొచ్చు. సిమెంట్, తారు రోడ్ల మీద నడవకూడదు. పాదాల మీద మరింత ఒత్తిడి పడుతుంది. నొప్పులు బాధిస్తాయి.
- నడిచేటప్పుడు చెమట పీల్చేవి, వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. జీన్స్ సరికాదు. లోదుస్తులు నాణ్యమైనవి వేసుకోవాలి. ❄

ఆలివ్ ఆయిల్‌తో...

ఆలివ్ ఆయిల్‌తో చాలా ప్రయోజనాలున్నాయి. ఆరోగ్యంతో పాటు అందాన్నిచ్చే ఆలివ్ ఆయిల్ ని తరుచూ ఉపయోగిస్తే చాలా మంచిది. దీని వల్ల చర్మం నిగారింపు మరింత పెరుగుతుంది. అలాగే హార్ట్ రిలేటెడ్ డిసీజ్ రావు.

- ఆలివ్ ఆయిల్ ఆహారంతో తీసుకుంటే బరువు కూడా అదుపులో ఉంటుంది. బాడీలోని బ్యాడ్ కొలెస్ట్రాల్ మొత్తం పోతుంది.
- ఆలివ్ ఆయిల్ ను స్నానం చేసే ముందు బాడీకి పూసుకుంటే చర్మానికి చాలా మంచిది. ఇలా చేయడంవల్ల చలికాలంలో చర్మం పగుళ్లు ఏర్పడవు.రోజూ స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్ బాడీ మొత్తాన్ని మసాజ్ చేసుకోవాలి. తర్వాత ఒక అరగంటకు కాస్త గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి.
- కొందరికి చర్మం గరుకుగా ఉంటుంది. అలాంటి వారు ఆలివ్ ఆయిల్ లో కాస్త షుగర్ కలిపి, అది కరిగిపోయిన తర్వాత ఆ ఆయిల్ తో బాడీ మొత్తం మసాజ్ చేసుకోండి. దీంతో చర్మం మొత్తం కూడా మృదువుగా మారిపోతుంది.
- ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా జుట్టుకు ఉపయోగిస్తుంటారు. వెంట్రుకలు నిగనిగలాడాలంటే ఆలివ్ ఆయిలో కాస్త గుడ్డుసొన కలిపి దాన్ని బాగా మిక్స్ చేసి వెంట్రుకలకు పూసుకోవాలి. తరచూ ఇలా చేస్తే మీ హెయిర్ మొత్తం పట్టులా మారుతుంది.
- చాలా మంది షాంపులను ఉపయోగించి తలస్నానం చేస్తుంటారు. అలాంటి వారు కాస్త ఆలివ్ ఆయిల్ ను ఒక పాత్రలో పోసుకుని అందులో షాంప్ కలుపుకుని



దాంతో తలస్నానం చేయండి. దీంతో జుట్టు రాలదు. షాంప్ ఎఫెక్ట్ నేరుగా వెంట్రుకలపై పడదు. అలాగే డాండ్రఫ్ పూర్తిగా తగ్గుతుంది.

- నిమ్మరసంలో కాస్త ఆలివ్ ఆయిల్ ను కలుపుకుని హెయిర్ కు పూసుకోండి. తర్వాత హెడ్ బాత్ చేయండి. అలా రెగ్యులర్ గా చేస్తే జుట్టు మొత్తం కూడా నిగనిగలాడి పోతుంది.
- ఆలివ్ ఆయిల్ లో కాస్త అల్లం రసాన్ని కలిపి దాన్ని జుట్టుకు పూసు కోవాలి. ఇలా చేస్తే జుట్టు కుదుళ్లు బాగా గట్టిగా మారుతాయి.
- ఆలివ్ ఆయిల్ లో కాస్త తేనె కలిపి ఫేస్ కు రాసుకుంటే చాలా మంచిది. ఇలా రెగ్యులర్‌గా చేస్తే ఫేస్ మొత్తం చాలా అందంగా తయారవుతుంది.
- ఆలివ్ నూనెను గోళ్లకు పూసుకుంటే వాటి అందం పెరుగుతుంది. గోళ్లు పెసులుబారవు. గట్టిగా మారుతాయి.
- ఆలివ్ నూనెను రోజూ పెదాలకు రాసుకుంటే చాలా మంచిది. దీంతో పెదాలు మొత్తం కూడా పింక్ కలర్ లోకి మారుతాయి. రెగ్యులర్ గా పెదాలు పగిలే వారు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- ఆలివ్ నూనెను కాస్త వేడి చేసి దాన్ని జుట్టు కుదుళ్లకు పూసుకుంటే మంచిది. ఇలా పూసుకున్న తర్వాత హెడ్ బాత్ చేయాలి. ఇలా రెగ్యులర్ గా చేస్తూ ఉంటే జుట్టు కుదుళ్లు గట్టిగా మారుతాయి.
- ముందుగా వెల్లుల్లి పొట్టును కాల్చి దాని పౌడర్ ను రెడీ చేసుకోండి. దాన్ని ఆలివ్ నూనెలో కలపండి. తర్వాత ఆ ఆయిల్ ను కాస్త వేడి చేయండి. దాన్ని వెంట్రుకలకు పూసుకుంటే హెయిర్ నల్లగా మారుతుంది.
- కొందరికి కాళ్ల వేలి మధ్యలో పగుళ్లు ఏర్పడుతుంటాయి. ఆలివ్ నూనెలో పసుపును కలుపుకుని దాన్ని పూసుకుంటూ ఉంటే అక్కడ పగుళ్లు తగ్గిపోతాయి. ❄

చీటికిమాటికి కోపమా?

ఇప్పుడు న్యూక్లియర్ కుటుంబాలు. ఉద్యోగస్తులు అయినా, కాకపోయినా పిల్లలు తల్లిదండ్రుల చుట్టూనే ఉండాల్సిన పరిస్థితులు. దాంతో అనుబంధాలు మాత్రమే కాదు.. గారాబం కూడా పెరిగిపోయింది. అడిగిందల్లా ఇవ్వడం, కాదన్నప్పుడు పిల్లలు విపరీతమైన కోపం తెచ్చుకుంటున్నారు. ఇలా పిల్లలు చీటికి మాటికి కోపం తెచ్చుకుంటుంటే.. తల్లిదండ్రులు సైతం వారిమీద అలాగే అరుస్తున్నారు. కానీ ఇది మంచి పద్ధతి కాదంటున్నారు నిపుణులు.

- మీ పిల్లలకు కోపం ఎక్కువగా ఉందని అనిపించినా, చిన్న చిన్న విషయాలనే పెద్దగా చేస్తూ రాద్ధాంతం చేస్తున్నా... మీరు చెప్పిన పనులు చేయకపోయినా... ఏదైనా కావాలని మారాం చేస్తున్నా... వాళ్లను డీల్ చేయడానికి కొన్ని పద్ధతులున్నాయి.
- పిల్లలు గట్టిగా ఆరుస్తున్నప్పుడు మీకు కోపం వచ్చినా దాన్ని వ్యక్తం చేయకూడదు. అరిచే ప్రయత్నం అసలు వద్దు. కాసేపు మీరు మౌనంగా ఉండండి. ఆ సమయంలో వారి కోపం స్థాయి తగ్గిపోతుంది. తరవాత కారణం తెలుసుకునే ప్రయత్నం చేయొచ్చు. అంతేతప్ప మీరూ అరవడం వల్ల ఏ ప్రయోజనం ఉండదు.



- నెమ్మదిగా వారు ప్రవర్తించిన తీరుని వారికి అర్థమయ్యేలా వివరించండి. కోపంగా మాట్లాడటం, అరవడం వల్ల ఎదురయ్యే సమస్యల్ని తెలియజేయండి. మొదటిసారి వినకపోవచ్చు. కానీ పదే పదే చెప్పడం వల్ల అర్థం చేసుకుంటారు. కోపాన్ని తగ్గించుకుని.. కావాల్సినవి అడిగి సాధించుకోవడం వల్ల కలిగే లాభాలేంటో వారికి వివరించండి.
- మీ చిన్నారి అప్పుడప్పుడూ కోపంగా ఉండటం... కాసేపటికే ఏం జరగనట్టు సంతోషంగా ఉండటం.... ఇలా రెండు రకాలుగా ప్రవరిస్తుంటే జాగ్రత్తగా గమనించండి. వారు ఏదో బాధను మనసులో పెట్టుకుని ఉండొచ్చు. కాబట్టి దాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయండి.
- ఏదయినా విషయంలో పిల్లలు బాగా పేచీ పెడుతున్నారని అనిపించినా.. కోపంగా ఉన్నారనే సంకేతం అందినా.. వారి ద ష్టిని మరల్చే ప్రయత్నం చేయండి. ఆ సమయంలో వారికి ఇష్టమైన పని చేసేలా చూడండి. బొమ్మలు గీయడం, సైకిలు తొక్కడం.. ఇలా ఏదో ఒకటి చేయించండి. దానివల్ల కూడా వారిలో కొంత మార్పు కనిపిస్తుంది. ❄

నిరుద్యోగులను వంచిస్తున్న మోడీ : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా వివిధ శాఖల్లో 60 లక్షల ఖాళీలను భర్తీ చేయకుండా మోడీ ప్రభుత్వం నిరుద్యోగులను వంచిస్తోందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని బూటకపు హామీలు ఇచ్చి, యువతను మోసం చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా, ఖాళీలనూ భర్తీ చేయడం లేదని పేర్కొన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 60 లక్షలకుపైగా ఖాళీలున్నాయని పార్లమెంటులో ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నకు స్వయంగా కేంద్ర ప్రభుత్వం నివేదించిందని తెలిపారు. పాఠశాల విద్యలోనే 10 లక్షల ఖాళీలున్నాయని పేర్కొన్నారు. వైద్యరంగంలో 2 లక్షలకుపైగా, న్యాయవ్యవస్థలో జడ్జీల ఖాళీలు 5,523, రైల్వేల్లో 2.45 లక్షలు, కేంద్ర బలగాలు, సైన్యంలో 1.95 లక్షలు, తపాలా శాఖలో 57 వేలు, బ్యాంకుల్లో 6 వేలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో 4.12 లక్షలు, రాష్ట్రాల్లో 30 లక్షల ఖాళీలు కలుపుకొని మొత్తం 60 లక్షల ఖాళీలున్నాయని పేర్కొన్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి నాలుగున్నరేండ్లుగా గడిచినా చర్యలు చేపట్టలేదని తెలిపారు. విద్యా, వైద్యం, ఆరోగ్యం, రైల్వే, బ్యాంకులను బలోపేతం చేయకుండా మోడీ ప్రభుత్వం బలహీనపరుస్తోందని పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు రాయితీలిస్తూ యువతను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

గీతం పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని పరిశోధక విద్యార్థులు స్మిత చోర్మంగే, వి దీపికలు పీహెచ్‌డీ పట్టాలకు అర్హత సాధించారని వారి సమన్వయకర్త, సీఎస్ఈ విభాగాధిపతి ఎస్ ఫణికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్యూచర్ సబ్‌సెట్ సెలక్షన్ ఫర్ హై డైమెన్షనల్ డేటాబేస్డ్ ఆన్ క్లస్టరింగ్ అండ్ ఫిల్టర్ మెజర్స్, యాన్ ఎఫిసియంట్ రీకన్ఫిగరల్ వర్చువల్ మల్టీక్లాస్ బాక్‌బోన్ ఫర్ క్విక్ లింగ్ ఫెయిల్యూర్ రికవరీ ఇన్ మొబైల్ అడ్‌హాక్ నెట్‌వర్క్స్ అనే అంశాలపై పరిశోధించారని పేర్కొన్నారు. పదో స్నాతకోత్సవంలో వారు పీహెచ్‌డీ పట్టాలు అందుకుంటారని తెలిపారు. స్మిత, దీపికలు పీహెచ్‌డీ పట్టాలు పొందడానికి అర్హత సాధించడం పట్ల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వైస్ చాన్సలర్ ఎన్ శివప్రసాద్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ సంజయ్, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు అభినందించారు.

తెలంగాణ డాక్టర్స్ ఫోరం అధ్యక్షునిగా డాక్టర్ అన్వేష్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీ) డాక్టర్స్ ఫోరమ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ అన్వేష్ కలుకూరి నియమితులయ్యారు. ఈ మేరకు టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంపత్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం జరిగిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన నియామకానికి సభ్యులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారని పేర్కొన్నారు. కాగా, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అన్వేష్ కలుకూరి ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ - నందిగామ

అప్పుల బాధతో రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మోత్కులగూడ గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ రాంచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కేసారం గ్రామానికి చెందిన తోట రామయ్య(54)కు నందిగామ మండలం మోత్కులగూడ గ్రామంలో రెండెకరాలా 30 గుంటల పొలం ఉంది. అందులో టమాట, కందులు సాగు చేశాడు. సాగు నీటి కోసం అప్పు చేసి పొలంలో బోరు వేయించాడు. అందులో నీళ్లు పడలేదు. అంతకు ముందు సుమారు రూ.50వేలు పెట్టి గేదెను కొన్నాడు. అది సరిగా పాలివ్వకపోవడంతో రూ.20వేలకు అమ్మేశాడు. వేసిన పంట కూడా చేతికందలేదు. ఈ క్రమంలో సుమారు రూ.లక్షా50 వేల వరకూ అప్పు అయింది. అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురైన రామయ్య తన పొలంలోనే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు తోట నర్సింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలి : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం నుంచి నిధులు ఉపయోగిం చుకుంటున్న ప్రయివేటు ఆస్పత్రులు పేదలకు ఉచిత వైద్యం అందించాలని ఐద్వా ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఆయా ఆస్పత్రుల్లో ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని సూచించింది. ఈ మేరకు సోమవారం ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గవీటి సరళ, మల్లు లక్ష్మీ, రాష్ట్ర సహాయ కార్యదర్శి హైమావతి, ఉపాధ్యక్షురాలు కె.ఎన్ ఆశాలత ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది తక్కువగా ఉన్నారని, ఈ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని తెలిపాస్త్ర. మండల కేంద్రాలన్నింటిలో పీహెచ్‌సీలను బలోపేతం చేసి గర్భిణీలకు ప్రసూతి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక డాక్టరు, నర్సు, పార్మసిస్టు, ఒక బెడ్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకొని, రోగులకు నమ్మకం కలిగే విధంగా డాక్టర్లు వ్యవహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రజలకు అందుతున్న వైద్యంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ నాలుగేండ్ల కాలంలో రాష్ట్రంలో వైద్యం కొంత మెరుగుపడినప్పటికి అందరికి అన్ని జబ్బులకు సరైన చికిత్స అందించే స్థితిలో లేదు. ఇప్పటి వరకు ఐద్వా 400పైగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సర్వే నిర్వహించింది. ఆస్పత్రుల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం ముందు ఉంచింది. ఆ తరువాతనే ప్రభుత్వం కేసీఆర్ కిట్, ఆస్పత్రుల్లో కొన్ని పరికరాలు అందుబాటులోకి తెచ్చింది. అయినా పెరుగుతున్న రోగులకు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి 30 వేల మంది జనాభాకు 30 పడకల ఆస్పత్రి ప్రతి 5 వేల మందికి పీహెచ్‌సీ ఉండాలి. మన దేశంలో గాని, మన రాష్ట్రంలో గాని అటువంటి పరిస్థితి లేదు. రాష్ట్ర జనాభా ప్రకారం 8 వేల ఉపకేంద్రాలు ఉండాలి. కానీ 5 వేలే ఉన్నాయి. హైదరాబాద్లో కోటి జనాభా ఉంటే 1,000 సబ్ సెంటర్స్ అవసరం. కానీ అటువంటి పరిస్థితి లేదు. అందుకే ప్రభుత్వ వైద్యం మరింత సంక్షోభంలో పడింది. ముఖ్యంగా రోగులకు విశ్వాసం కలిగే విధంగా వైద్యులు సిబ్బంది వ్యవహరించడంలేదు. అదేవిధంగా ప్రయివేటు ఆస్పత్రులపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయి. ప్రజలు దోపిడికి గురవుతున్నారు. సీరియస్ జబ్బులు వస్తే ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిందే, ఆ దుస్థితి రాకుండా ప్రభుత్వ వైద్యాన్ని మరింత బలోపేతం చేయాలి. కార్పొరేటు స్థాయిలో ఆస్పత్రులను అభివృద్ధి చేయడమే కాకుండా గాంధీ, ఉస్మానియా వంటి పెద్దాసుపత్రుల్లో సూపర్ స్పెషాలిటీ సేవలందించే ఆస్పత్రుల్లో పేమెంట్ బ్లాకులు ఏర్పాటు చేయాలి. తమిళనాడు చెన్నై జనరల్ ఆస్పత్రుల్లో 'తాయ్' (తల్లి) అనే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దాంతో అత్యవసర చికిత్స విభాగంలో మరణాల రేటు 5.8 నుంచి 3. 5కు తగ్గింది. ఇటువంటి మరెన్నో పథకాలు మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వం వైద్యంలో అందుబాటులోకి తీసుకురావాలి' అని వారు కోరారు.

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే తాయిలాలు

ద్విముఖ రాజకీయాల స్థానంలో బహుముఖ రాజకీయ పరిస్థితి


- జనసేన, సీపీఐ(ఎం), సీపీఐ మధ్య ఫిబ్రవరిలో సీట్ల ఒప్పందం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు



అమరావతి: నాలుగున్నరేండ్ల కాలంలో టీడీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిందని, వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే ఎన్నికలకు ముందు మళ్లీ పింఛన్లు, బీసీ జయహో పేరుతో తాయిలాలు ప్రకటిస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రెండురోజుల పాటు జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ చేసిన తీర్మానాలను వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో, చుక్కల భూముల సమస్యలు పరిష్కరించ డంలో ప్రభుత్వం విఫలమైందని, కరువు ప్రాంతాల్లో సహా యక చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. మద్యాన్ని నియంత్రించకుండా బెల్ట్‌షాపులను విస్తరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 74 షెడ్యూల్ కేటగిరిలోని 50 లక్షల మంది కార్మికులకు 15 సంవత్సరాల నుండి వేతనాలు సవరించలేదని తెలిపారు. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణం కాలయాపన జరగడానికి ప్రభుత్వమే కారణమన్నారు. పోర్టు కోసం 33 వేల ఎకరాలు బలవంతపు భూ సేకరణకు పూను కుని ప్రభుత్వం వివాదాస్పదంగా మార్చిందన్నారు. 2013 చట్ట ప్రకారమే అవసరమైన మేరకు మాత్రమే భూములు సేకరించాలని స్పష్టం చేశారు. ఈ చట్టంలోని కీలకమైన సోషల్ ఇంప్యాక్టు ఎసెస్‌మెంట్ క్లాజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేయడం సరికాదన్నారు. ఇటువంటి విధానాలను ప్రజ లు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. టీడీపీకి ప్రత్యామ్నా యం అని చెప్పుకుంటున్న వైసీపీ వద్ద ప్రజల సమస్యలను పరిష్కరించే కార్యక్రమమేమీ లేదన్నారు. ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన, సీపీఐ(ఎం), సీపీఐ కలిసి మరో కొత్త శక్తిగా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో మంచి పరిణామమన్నారు. టీడీపీ లేదా వైసీపీ అనేలా ప్రస్తుత మున్న ద్విముఖ రాజకీయాల స్థానంలో బహుముఖ రాజకీ య పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జన సేన, సీపీఐ(ఎం), సీపీఐ మధ్య ఫిబ్రవరిలో ఎవరు ఏ సీట్లలో పోటీ చేయాలో నిర్ణయించుకుని ఎన్నికలకు సిద్ధపడతామని, ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో పొత్తులపై విలేకర్లడిగిన ప్రశ్నకు రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులు వేర్వేరుగా ఉన్నాయని, ఎన్నికల అనంతరమే బీజేపీకి వ్యతిరేకంగా దేశంలో లౌకిక ప్రభుత్వం ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, తూర్పు కృష్ణా కార్యదర్శి ఆర్.రఘు పాల్గొన్నారు.

సీఎంతో కోట్ల కుటుంబం భేటీ

- కర్నూలులో మారనున్న రాజకీయం



అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కర్నూలు మాజీ ఎంపీ కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి సుజాతమ్మ, కుమారుడు రాఘవేంద్రరెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి సోమవారం రాత్రి ఉండవల్లిలోని సీఎం నివాసంలో భేటీ అయ్యారు. కోట్ల కుటుంబానికి ముఖ్యమంత్రి డిన్నర్ ఇస్తుండటం రాజకీయంగా భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో ముఖ్యంగా కర్నూలు ఎంపీ సీటుతో పాటు డోన్, ఆలూరు ఎమ్మెల్యే సీట్లు తమ వర్గానికి కేటాయించాలని భేటీలో చర్చకు వచ్చే అవకాశముంది. కర్నూలు జిల్లా రాజకీయాల్లో కోట్ల, కేఈ కుటుంబాల మధ్య నాలుగు దశాబ్దాలుగా రాజకీయ వైరం ఉన్న నేపథ్యంలో కేఈ చేరికపై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. కోట్ల టీడీపీలోకి రాక గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు కేఈ కృష్ణమూర్తి స్పందిస్తూ తమకు ఇంత వరకు వారి చేరిక గురించి తమతో చర్చించలేదని, వారి చేరికపై ఎలాంటి సమాచారం తమకు లేదన్నారు.. సిట్టింగ్ ఎంపీ బుట్టా రేణుక వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. ఈమెకు పాణ్యం నుంచి అసెంబ్లీ సీటు కేటాయించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా రాజకీయ ప్రత్యర్థులు ఒకే పార్టీలో కొనసాగుతారా లేదా ననే అంశంపై కాలమే సమాధానం చెప్పాలి. రెండు వర్గాలను చంద్రబాబు ఎలా సమన్వయం చేస్తారో వేచి చూడాల్సిందే.

ఆశా వర్కర్లపై నిర్బంధం శ్రీకాకుళంలో సుమారు 500 మంది అరెస్టు

- సమస్యల పరిష్కారానికి డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం వద్ద ధర్నా

శ్రీకాకుళం: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు సోమవారం చేపట్టిన ధర్నాను భగ్నం చేసేందుకు ప్రభుత్వం విఫలయత్నం చేసింది. జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడే అరెస్టులకు పాల్పడింది. నిర్బంధాన్ని ఎదురొడ్డి వందలాది మంది ఆశా కార్యకర్తలు డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయానికి చేరుకొని ధర్నాలో పాల్గొన్నారు. జీఓ 113 ప్రకారం వేతనం, పారితోషికం చెల్లించాలని, ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసిన వారిని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని తదితర తొమ్మిది డిమాండ్లతో ఆశా వర్కర్లు జిల్లాలోని 38 మండలాల నుంచి జిల్లా కేంద్రానికి బయలుదేరారు. వీరిని ఎక్కడికక్కడే పోలీసులు అడ్డుకొని సుమారు 500 మందిని అరెస్టు చేసి, ఆయా పోలీస్ స్టేషన్లకు తరలివచ్చారు. అయినప్పటికీ, భయపడకుండా వందలాది ఆశా వర్కర్లు డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్దఎత్తున పోలీసులు మోహరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి విడనాడి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్ఓ చెంచయ్యను కలిసి వినతిపత్రం అందజేశా రు. అరెస్టు చేసిన వారందరినీ పోలీసులు ఆ తర్వాత విడుదల చేశారు.

ఏసీబీ వలలో ఎల్ఐసీ అధికారి

- రూ.60 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ సూపరింటెండెంట్



నవతెలంగాణ-హన్మకొండ

వరంగల్ అర్బన్ జిల్లా ఎల్ఐసీ కార్యాలయంలోని ప్రభుత్వ జీవిత బీమా సంచాలకులు, జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పల్లకొండ యాదగిరి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. సోమవారం ఓ వ్యక్తి నుంచి రూ. 60 వేలు లంచం తీసుకుంటుండగా పథకం ప్రకారం అధికారులు అతడిని పట్టుకున్నారు. 2011 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ సమ్మయ్య 2018 సెప్టెంబర్‌లో గుండెపోటుతో మరణించాడు. అప్పటికే కానిస్టేబుల్ ఎల్ఐసీలో ప్రీమియం కట్టి ఉండటంతో ఇన్సురెన్స్ క్లెయిమ్ డబ్బుల కోసం మృతుడి సోదరుడు సుమన్ ఎల్ఐసీ కార్యాలయానికి వెళ్లాడు. కానీ ఎల్ఐసీ సూపరింటిండెంట్ పల్లకొండ యాదగిరి రూ. 60 వేలు లంచం ఇస్తేనే పని జరుగుతుందని సుమన్‌ను ఇబ్బందులకు గురిచేశాడు. దానికి అతడు సరే అనడంతో, జిల్లా కోర్టులోని క్యాంటీన్ వద్దకు వచ్చి తనకు రూ.60 వేలు ఇవ్వాలని తెలిపాడు. బాధితుడు ఏసీబీ అధికారులను సమాచారం అందించి, అనంతరం డబ్బులను తీసుకొని హన్మకొండలోని కోర్టు క్యాంటీన్‌కు వెళ్ళాడు. సుమన్ వద్ద నుంచి రూ. 60 వేలు తీసుకునే క్రమంలో మాటు వేసిన ఏసీబీ అధికారులు యాదగిరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు. యాదగిరి నుంచి డబ్బులను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మావోయిస్టులపై ఆరా

- తమ శ్రేణులతో మావోయిస్టుల కొత్త ప్రతిజ్ఞ
- నిశితంగా దృష్టి సారించిన అధికారులు




నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

మావోయిస్టుల నుంచి వినిపిస్తున్న ఆపరేషన్ సమాధాన్‌పై రాష్ట్ర ఇంటెలిజెన్స్‌తో పాటు కేంద్ర నిఘా సంస్థ ఐబీ సీరియస్‌గా దృష్టి సారించాయి. ఆపరేషన్ సమాధాన్ పేరిట మావోయిస్టులు తమ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించడం వెనుక ఉన్న లక్ష్యం గురించి నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయని తెలిసింది. ఇటీవల మావోయిస్టులు అమరవీరుల సంస్మరణోత్సవాలను వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిషా, బీహార్‌లతో పాటు రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలం, ఏపీ సరిహద్దుల్లోని ఒడిషా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బెజ్జంగి మొదలైన ప్రాంతాలలోని తమ రహస్య స్థావరాలలో మావోయిస్టులు సభలు నిర్వహించి ప్రసంగాలు చేశారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. ఈ సమావేశాలలోనే తమ కేడర్‌తో ఆపరేషన్ సమాధాన్‌ను అమలు చేసి తీరుతామంటు ప్రతిజ్ఞలు చేయించారన్న వార్త నిఘా వర్గాలలో కదలికలకు దారి తీసినట్టు తెలిసింది. ఇటీవలి కాలంలో రాష్ట్రంతో పాటు సరహద్దులలో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో నలభై మందికి పైగా మావోయిస్టులు మరణించారు. అలాగే మహారాష్ట్రలోని గఢ్‌చిరోలీలో గతేడాది జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో పెద్ద సంఖ్యలోనే మావోయిస్టులు మృతి చెందారు. వీటన్నింటిని కలుపుకొని సాయుధ బలగాలపై ఎదురుదాడికి మావోయిస్టులు పన్నిన పకడ్బంధ వ్యూహమే ఆపరేషన్ సమాధాన్ అనే అనుమానాలను నిఘా వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టుల కదలికలపై మరింత జాగరూకతతో మెలగాలని కేంద్ర, రాష్ట్ర నిఘా విభాగాలు తమ పోలీసు అధికారులు, ప్రభావిత ప్రాంతాల పోలీసు యంత్రాంగాలను అప్రమత్తం చేసినట్టు తెలిసింది. దీంతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలను ఆనుకుని ఉన్న రాష్ట్ర సరిహద్దులలో గ్రేహౌండ్స్‌తో పాటు సీఆర పీఎఫ్ బలగాలను మోహరించి కూంబింగ్ ఆపరేషన్‌ను అధికారులు విస్తృతం చేశారని తెలిసింది. అలాగే మావోయిస్టుల కొత్త ఎత్తుగడల గురించి వారి శ్రేణు లు, సానుభూతి పరుల నుంచి సమాచారాన్ని సేకరించడానికి తమ కొరియ ర్‌లను కూడా పోలీసులు రంగంలోకి దింపినట్టు సమాచారం. ఏది ఏమైనప్పటికీ మావోయిస్టు చీఫ్‌గా నంబాళ కేశవరావు బాధ్యతలు చేపట్టాక తమ వైపు నుంచి ఎలాంటి సమాచారం లీక్ కాకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని, ఆయన కొత్త టీమ్ కార్యకలాపాలపై మరింత జాగ్రత్తగా కన్నేసి ఉంచాలనీ ప్రభావిత జిల్లాల ఎస్పీలు, మారుమూల ప్రాంతాల పోలీసులకు నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు కూడా జారీ అయినట్టు తెలిసింది.

రామ మందిర అంశంలో.. దేశాన్ని తప్పదోవ పట్టిస్తున్న యోగి

- యూపీ మంత్రి ఓం ప్రకాశ్ రాజ్ భర్



లక్నో: యూపీ మంత్రి, సుహెల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ అధినేత ఓం ప్రకాశ్ రాజ్‌భర్.. మరోసారి ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై విమర్శలు చేశారు. రామ మందిర వివాదంలో దేశాన్ని యోగి తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. అయోధ్య అంశం తమకు అప్పగిస్తే 24 గంటల్లో పరిష్కరిస్తామని సీఎం యోగి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆయన పైవిధంగా స్పందించారు. 'కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నది. గత ఐదేండ్లలో ఈ సమస్యపై వారు ఎలాంటి పరిష్కారాన్ని కనుగొనలేదు. మరి అలాంటప్పుడు రామ మందిర నిర్మాణంపై 24 గంటల గడువునిస్తే యోగి ఏం చేస్తారు?' అని ప్రశ్నించారు. 'కేంద్రంలో, రాష్ట్రంలో రెండింటా అధికారంలో ఉన్న బీజేపీని ఆలయ నిర్మాణం విషయంలో ఎవరు అడ్డుకుంటున్నారు?. ఈ విషయంలో సీఎం యోగి దేశ ప్రజలను అయోమయానికి గురిచేసి తప్పుదారి పటిస్తున్నారు' అన్నారు. ప్రధాని పదవికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ అర్హుడేనని, అయితే ప్రజాస్వామ్య దేశంలో ప్రజల తీర్పే శిరోధార్యమన్నారు. వెనుకబడిని కులాలను బీజేపీ మోసం చేసినందుకు ఫిబ్రవరి 24న ఆ పార్టీతో పొత్తులను తెగదెంపులు చేసుకుంటామని రాజ్‌భర్ పునరుద్ఘాటించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఎస్పీ-బీఎస్పీ కూటమికి మద్దతు పలుకుతారని అన్నారు. ప్రస్తుతం ఆయన యూపీ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రిగా ఉన్నారు.

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు హఠాన్మరణం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సంచాలకులు వెంకటేశ్వర్లు గుండెపోటుతో మతి చెందారు. తిరుపతిలో శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ సదస్సుకు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సదస్సు అనంతరం ఆయన తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. క్యూలైన్‌లో ఉండగానే ఆయనకు గుండెపోటు రావడంతో హుటాహుటిన స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మతి చెందారు. ఇది వుండగా వెంకటేశ్వర్లు హఠాన్మరణం పట్ల తెలంగాణ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు.

ప్రశాంతంగా ఇంటర్ నైతికత, మానవ విలువలు పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన నైతికత, మానవ విలువలు రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నైతికత, మానవ విలువలు రాతపరీక్షకు 4,94,529 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, 4,77,029 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షకు 17,500 (3.54 శాతం) మంది విద్యార్థులు గైర్హాజర య్యారని పేర్కొన్నారు. ఈనెల 31న పర్యావరణ విద్య పరీక్ష ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరగ నుంది.

ఈ పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఒకవేళ హాజ రు కాకపోయినా, ఉత్తీర్ణత పొందకపోయినా ఆ విద్యార్థులకు ఇంటర్ మార్కుల మెమో జారీ కాదు.

అంబేద్కర్ వర్సిటీ అర్హత పరీక్ష దరఖాస్తు గడువు మార్చి 28

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు తుది గడువు మార్చి 28 వరకు ఉంది. ఈ మేరకు అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సి వెంకటయ్య సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన అర్హత లేని వారు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందడానికి అర్హత పరీక్షలో ఉత్తీర్ణత పొందాలని తెలిపారు. ఈ ఏడాది జులై 1 నాటికి 18 ఏండ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 28న అర్హత పరీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

బలంలేని తిండి..

భారతీయులు తీసుకుంటున్న ఆహారంలో ప్రొటీన్లు (మాంసకృతులు) తక్కువగా, కార్బొహైడ్రేట్లు (పిండిపదార్థాలు) ఎక్కువగా ఉంటున్నాయి. ధనికులు, నగరాల్లో నివసిస్తున్నవారు జిహ్వా రుచి కోసం 'జంక్ ఫుడ్'కు అలవాటుపడ్డారు. 'ప్రాసెస్డ్ ఫుడ్', 'జంక్ ఫుడ్' తీసుకోవటాన్నే వారు భిన్నమైన ఆహారంగా భావిస్తున్నారు. రోజూ 2500 కి.కాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకోల్సిన చోట 200-300 కి.కాలరీల ఆహారంతో గ్రామీణ, పట్టణ ప్రజలు సరిపుచ్చుకుంటున్నారు.

- 'ద ఈట్-లాన్సెట్ కమిషన్' అధ్యయనం

ప్రొటీన్లు తక్కువ తింటున్నాం..

- అవసరానికి మించి పిండిపదార్థాలు
- సూచించిన స్థాయిలో ఆహార అలవాట్లు లేవు
- ముందు ముందు అనేక సమస్యలకు దారితీస్తుంది..
- గ్రామాలు, పట్టణాల్లో పౌష్టికాహారలోపం: లాన్సెట్ కమిషన్ అధ్యయనం





న్యూఢిల్లీ : సగటు భారతీయుల ఆహారంలో కార్బొహైడ్రేట్లు పెద్ద మొత్తంలో ఉంటున్నాయనీ, ప్రొటీన్లు చాలా తక్కువ మొత్తంలో ఉంటోందనీ తాజా అధ్యయనం ఒకటి హెచ్చరిస్తోంది. సంపాదనపరులైన భారతీయులు రుచికోసం 'జంక్ ఫుడ్'కు అలవాటు పడుతున్నారనీ, చక్కెర, ప్రాసెస్డ్ ఫుడ్ పట్ల ఆసక్తి పెంచుకున్నారనీ 'ద లాన్సెట్' కమిషన్ తేల్చింది. అంతర్జాతీయ నిపుణులతో కూడిన బృందం మూడేండ్లపాటు భారతీయుల ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం...తదితర అంశాలపై విస్తృత అధ్యయనం జరిపి పై విషయాల్ని తేల్చింది. ప్రతీరోజూ 2500కి.కాలరీల శక్తినిచ్చే ఆహారం తీసుకోవాలని ప్రతిపాదించింది.

సంతులనమైన పౌష్టికాహారం కోటీ 9లక్షల మందిని మరణానికి దూరం చేస్తుంది. ముఖ్యంగా పెద్దవాళ్లలో 22.4శాతం మందికి గుండె సంబంధిత సమస్యలు రాకుండా చేస్తుంది. గుండె రక్తనాళాల్లో కొవ్వు చేరటం, స్ట్రోక్, టైప్-2 చక్కెర వ్యాధి, క్యాన్సర్లు...అనేక సమస్యల నుంచి వారికి ఉపశమనం దక్కుతుందని అధ్యయనం ఘంటాపథంగా చెప్పింది.

అధ్యయనం ఏం తేల్చింది?

భారతీయుల్లో అత్యధికులు పిండిపదార్థముండే వరి, గోధుమ(కార్బొహైడ్రేట్స్)ను ఎక్కువగా, మాంసకృతులు (ప్రొటీన్లు)ఉండే శాఖాహార, మాంసాహారాన్ని తక్కువగా తీసుకుంటున్నారు. పెద్దమొత్తంలో చక్కెర, డైరీ ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఫుడ్ తింటున్నారు. పప్పులు, మొలకెత్తిన గింజలు, మాంసాహారం, కూరగాయలు, పండ్లు...అన్నీటినీ తీసుకోగలిగే ఆర్థిక స్థోమత ఉన్నవారు 'జంక్ ఫుడ్'కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ధోరణి ప్రమాదకరం. ముందు ముందు అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది.

ఎలాంటి ఆహారం మంచిది?

లాన్సెట్ కమిషన్ దేశవ్యాప్తంగా మూడేండ్లపాటు చేసిన విస్తృత అధ్యయనం ప్రకారం, వారు చేసిన ప్రతిపాదనలు.., ప్రతీ వ్యక్తి...రోజూ 2500 కి.కాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకోవాలి. ముఖ్యంగా ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న తృణధాన్యాలకు, మాంసాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే వరి, గోధుమలను తగ్గించుకోవాలి. చక్కెర, పాల ఉత్పత్తులు, శాచురేషన్ చేసిన కొవ్వులను చాలా తగ్గించాలి.

లాన్సెట్ కమిషన్ రిఫరెన్స్ డైట్

- మొత్తం 2500 కిలో కాలరీల శక్తిలో 850 కి.కాలరీల శక్తి కార్బొహైడ్రేట్స్ ద్వారా రావాలి. కానీ అధ్యయనంలో తేలినదాన్నిబట్టి గ్రామాల్లో 1318 కి.కాలరీలు, అర్బన్ ప్రాంతాల్లో 1058 కి.కాలరీ శక్తి కార్బొహైడ్రేట్స్ ద్వారా పొందుతున్నారు.
- ప్రొటీన్ల ద్వారా అందుతున్నది గ్రామాల్లో కేవలం 269 కి.కాలరీలు, అర్బన్‌లో 335 కి.కాలరీలు మాత్రమే ఉంటోంది. అంటే మొత్తం శక్తిలో 15 శాతం మాత్రమే ఇది.
- కూరగాయలు, పండ్లు ద్వారా 204 కి.కాలరీలు శరీరానికి అందాలి. ఈ విషయంలో గ్రామాల్లో 94 కి.కాలరీలు, అర్బన్‌లో 140 కి.కాలరీలు పొందుతున్నారు.

సూచించినదాని కన్నా తక్కువ

- అభివృద్ధి చెందిన దేశాల్లో 'రెడ్ మీట్'(మాంసాన్ని) ఎక్కువగా తీసుకుంటున్నారు. ముఖ్యంగా అమెరికన్లు 'రిఫరెన్స్ డైట్'కు 6.5 రేట్లు ఎక్కువగా రెడ్ మీట్‌ను తీసుకుంటున్నారు. పర్యావరణపరంగా, వారి వ్యక్తిగత ఆరోగ్యానికి ఇదెంత మాత్రమూ మంచిది కాదని అధ్యయనం తేల్చింది.
- మరోవైపు సూచించినదానికన్నా తక్కువగా మాంసాహారాన్ని భారతీయులు తీసుకుంటున్నారు. తక్కువ, స్వల్ప ఆదాయం గలవారిలో ఈ సమస్య ప్రధానంగా ఉంది. మొలకెత్తిన గింజధాన్యాల్లో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని కూడా చాలా అరుదుగా తింటున్నారు.
- భారతీయులు పండ్లు, కూరగాయలు చాలా చాలా తక్కువ మొత్తంలో తింటున్నారు. ఆర్థిక స్థోమత లేక చాలామంది ప్రతీ రోజు చాలీ చాలనీ తిండి తింటున్నారు. తద్వారా వారికి అందుతున్నది కేవలం 200-300 కి.కాలరీ శక్తి మాత్రమే.
- 1980 నుంచి సగటు భారతీయుల్లో రోజువారీ శ్రమ తగ్గిపోయింది. ధనికులు, ఉన్నత ఆదాయ వర్గాలు పండ్లు, కూరగాయలు పొందగలిగే అవకాశమున్నా జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్‌నే తీసుకుంటున్నారు.
- గ్రామాల్లో 20శాతం, అర్బన్ ప్రాంతాల్లో 23 శాతం భారతీయులు పౌష్టికాహార సమస్యతో (ఎన్ఎస్ఎస్ఓ డాటా) బాధపడుతున్నారు.



వాతావరణ మార్పులపై ఉధృత పోరు

• బ్రస్సెల్స్‌లో 70వేల మందితో ప్రదర్శన • ఫ్రాన్స్‌లో మానవహారాలు

బ్రస్సెల్స్ : వాతావరణ మార్పులపై పోరును ఉధృతం చేయాలని కోరుతూ బ్రస్సెల్స్‌లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తీవ్రమైన చలి, వర్షాన్ని కూడా లెక్క చేయకుండా దాదాపు 70వేల మంది ప్రదర్శనలో పాల్గొన్నారు. గత రెండు నెలల కాలంలో బ్రస్సెల్స్‌లో జరిగిన నాల్గవ ర్యాలీ ఇది. వాతావరణ మార్పులపై బెల్జియంలో జరిగిన అతి పెద్ద ప్రదర్శన ఇది. ఈ ప్రదర్శనకు చేరుకునేందుకు ప్రజలు వివిధ రవాణా మార్గాలను ఎంచుకున్నారు. దేశవ్యాప్తంగా రైళ్ళన్నీ జనాలతో కిక్కిరిసి పోయాయి. దీంతో, చాలా మంది సకాలంలో ప్రదర్శనకు హాజరు కాలేకపోయారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు తక్షణమే కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేస్తూ దాదాపు 35వేల మంది విద్యార్థులు తరగతులను బహిష్కరించి ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పునర్వి నియోగ ఇంధనాన్ని మరింతగా వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టాలని, మన తర్వాతి తరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించాలంటే మనం ఇప్పుడే కార్యాచరణకు దిగాలని ఆందోళనకారుడు హెన్నీ క్లాసెన్ వ్యాఖ్యానించారు. మే నెల్లో బెల్జియం, ఈయూ లో ఎన్నికలకు పార్టీలన్నీ సమాయత్త మవుతున్న నేపథ్యంలో వాతావరణ మార్పుల అంశాన్ని నేతల దృష్టికి తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రదర్శనలు కేవలం బెల్జియంకే పరిమితం కాలేదు. ఫ్రాన్స్‌వ్యాప్తంగా కూడా వేలాదిమంది మానవ హారాలు చేపట్టారు. బహిరంగ సభలు నిర్వహించారు.

రష్యా మద్దతు సంస్థలపై ఆంక్షల ఉపసంహరణ

మాస్కో : రష్యా మద్దతు ఇస్తున్న సంస్థలపై ఆంక్షలు ఉపసంహరించుకునే యోచనలో ఉన్నట్టు అమెరికా ప్రకటించింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన మంగళవారం విడుదలయ్యే అవకాశముంది. ఆలిగార్చ్ ఓలెగ్ డెరిపాస్క సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు ప్లాంట్‌లకు రష్యా అధ్యక్షుడు పుతిన్ మద్దతు ఇస్తున్నారు. ఈ సంస్థలపై ఆంక్షలు ఉపసంహరించుకోవాలని అమెరికా నిర్ణయించుకుంది. ఇదే విషయాన్ని సంస్థ నిర్వహకులు డెరిపాస్క కూడా ధ్రువీకరించారు.

తమ సంస్థలపై ఆంక్షల రద్దు పట్ల ట్రంప్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాగా, ఈ సంస్థపై ఆంక్షలు కొనసాగించాలని డెమొక్రాటిక్ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాగా, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈకేసులో డెరిపాస్క కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

ఇరాన్‌పై ఆంక్షలు ఉల్లంఘిస్తే చర్యలు

• ఈయూను హెచ్చరించిన ట్రంప్



వాషింగ్టన్ : ఇరాన్‌పై అమెరికా ఆంక్షలను ఉల్లంఘించినట్టయితే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని యురోపియన్ యూనియన్ దేశాలను ట్రంప్ ప్రభుత్వం హెచ్చరించింది. తమ ఆంక్షలు ఉల్లంఘించినట్టయితే కఠినమైన జరిమానాలు తప్పవని బెదిరించింది. కాగా, ఆంక్షలు ఉల్లంఘించకుండా ఇరాన్‌తో వ్యాపారం సాగించడాన్ని సులభతరం చేసేందుకు గానూ ప్రత్యామ్నాయ డబ్బు చెల్లింపు మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఈయూ భావిస్తోంది. ఈయూ చేసే ఈ ప్రయత్నాలను ట్రంప్ సర్కార్ నిశితంగా గమనిస్తోంది. ఈయూ ప్రతినిధి మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకునేందుకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయని, త్వరలోనే ఇందుకు సంబంధించి ప్రకటన వెలువడే అవకాశం వుందని అన్నారు.

చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు పెంపు : జపాన్ ప్రధాని అబె



టోక్యో : చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసుకుంటామని జపాన్ ప్రధాని షింజో అబె తెలిపారు. రక్షణ సామర్థ్యాలను మరింత పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సోమవారం జపాన్ పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా అబె ప్రసంగించారు. గత అక్టోబరులో తాను బీజింగ్‌లో పర్యటించిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సాధారణ స్థాయికి చేరుకున్నాయని చెప్పారు. వాణిజ్యం,ఇతర రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచాలని భావిస్తున్నట్టు తెలిపారు. రోదసీ, సైబర్ సాంకేతికతలను కూడా జపాన్ పెంచుకోవాల్సి ఉందన్నారు. కాగా, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో త్వరలో భేటీ అవుతానని అబె తెలిపారు. ఉత్తరకొరియాతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం దిశగా కృషి చేస్తామని అన్నారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటామన్నారు.

ఉగ్రసంస్థలపై ఉక్కుపాదం : ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు డ్యుటెర్టే



మనీలా : మానవాళి మనుగడకు అత్యంత ప్రమాదకరంగా మారిన ఉగ్రసంస్థలపై ఉక్కుపాదం మోపుతామని ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టే తెలిపారు. సోమవారం సైనికాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోమన్ క్యాథడ్రల్ చర్చి వద్ద జరిగిన జంట పేలుళ్ల ఘటన తనను ఎంతో కలిచివేసిందన్నారు. ఉగ్రవాదుల హింసాత్మక చర్యలను ఉపేక్షించేది లేదన్నారు. పేలుళ్ల ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పేలుళ్లు సంభవించడానికి ముందు అబూ సయ్యఫ్ ఉగ్రసంస్థ కీలక నేత సురాఖా ఇన్గాగ్ సోదరుడు కమాహ్ ఘటనాస్థలంలో రెక్కీ నిర్వహించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో నిక్షిప్తమయ్యాయని అన్నారు. కమాహ్ పేలుడు పదార్థాల తయారీలో సిద్ధహస్తుడని అన్నారు. జంటపేలుళ్ల కోసం 4కిలోగ్రాముల పేలుడు పదార్థాలు ఉపయోగించినట్టు అనుమానిస్తున్నామని అన్నారు. ఈపేలుళ్లలో 20 మంది మృతిచెందగా, 70 మంది గాయపడ్డారని అన్నారు. పరారీలో ఉన్న నిందితుని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

సిరియా సరిహద్దులో సేఫ్ జోన్స్ : ఎర్డోగన్



అంకారా : సిరియా సరిహద్దులో సేఫ్ జోన్స్ ఏర్పాటు చేయనున్నట్టు టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ తెలిపారు. సేఫ్ జోన్స్ ఏర్పాటు ద్వారా శరణార్థుల ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. ఇస్తాంబుల్‌లో జరిగిన సమావేశంలో ఎర్డోగన్ మాట్లాడారు. సిరియాలోని ఉగ్రసంస్థల నిర్మూలన కోసం టర్కీ బలగాలు అవిశ్రాంతంగా పోరాడుతున్నాయని అన్నారు. సిరియన్ల రక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడతామని చెప్పారు. ఉగ్రవాద, తిరుగుబాటు సంస్థల హింసాత్మక చర్యల కారణంగా ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన శరణార్థులు తిరిగి సిరియా సరిహద్దులోని సేఫ్ జోన్స్‌కు చేరుతున్నారని అన్నారు. 40లక్షల మంది సిరియా శరణార్థులకు టర్కీ ఆశ్రయం కల్పించనుందని ఎర్డోగన్ చెప్పారు. కాగా, సిరియాలోని ఉగ్రసంస్థలపై విజయం సాధించినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతనెలలో ప్రకటించిన సంగతి తెలిసిందే. సిరియాలోని 2వేల మంది అమెరికా సైనికులను వెనక్కి రావాలని ఆదేశాలు జారీ చేశారు.ట్రంప్ నిర్ణయంపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. రక్షణ మంత్రి జిమ్ మాటిస్ సహా పలువురు కీలక అధికారులు తమ పదవుల నుంచి వైదొలిగారు. మెజారిటీ అమెరికన్లు ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. సిరియన్ల భద్రత కోసం అమెరికా బలగాల మోహరింపు కొనసాగాలని కోరారు. సిరియా సరిహద్దులో సేఫ్ జోన్ ఏర్పాటు అంశంపై ఎర్డోగన్ ట్రంప్‌తో చర్చించారు. 32కిలోమీటర్ల మేర సేఫ్‌జోన్ ఏర్పాటునకు అమెరికా కూడా సానుకూలంగా స్పందించింది. సిరియాలో టర్కీ బలగాల కొనసాగింపును స్వాగతించింది. అయితే, ఐఎస్ వ్యతిరేక ఆపరేషన్‌లో అమెరికాకు సంపూర్ణ మద్దతిచ్చిన కుర్దుతిరుగుబాటుదారులపై అంకారా బలగాలు దాడులకు పాల్పడొద్దని కోరింది.

పైలట్ సిగరెట్ కాల్చడంతోనే....

• నేపాల్ విమాన ప్రమాదం దర్యాప్తు పూర్తి



ఖట్మాండ్ : గతేడాది మార్చిలో నేపాల్ రాజధాని ఖట్మాండ్ అంతరా జతీయ విమానాశ్రయంలో జరిగిన ప్రమాదంలో 51 మంది మృతిచెందారు. అయితే ఏడాది తర్వాత ఈ ప్రమాదానికి గల కారణాలు వెలుగులోకి వచ్చాయి. విమానం నడుపుతున్న పైలెట్ కాక్‌పిట్‌లో సిగరెట్ తాగడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు విచారణలో తేల్చారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఇందుకు గల కారణాలు తెలియరాలేదు. దీంతో, అధికారులు దర్యాప్తు కోసం ప్రత్యేక ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా ప్యానెల్.. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌ను పరిశీలించింది. విమానం నడుపుతున్న సమయంలో పైలట్ నిబంధనలకు విరుద్ధంగా కాక్‌పిట్‌లోనే పొగ తాగినట్టు అధికారులు గుర్తించారు. కాక్‌పిట్‌లోని సిబ్బంది నిర్లక్ష్యం, ల్యాండింగ్ సమయంలో పరిస్థితిపై అవగాహన కోల్పోవడం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు నిర్ధారించారు. గతేడాది మార్చిలో యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్‌కు చెందిన బాంబార్డియర్ డాష్ 8 క్యూ 400 విమానం 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి కఠ్మాండుకు బయల్దేరింది. నేపాల్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో కఠ్మాండు ఎయిర్‌పోర్టులో దిగుతుండగా ఈ ఘోరం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు సిబ్బంది సహా 51 మంది చనిపోయారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో మొత్తం 67మంది ఉన్నారు.

క్యూబాలో టోర్నడోలు

• ముగ్గురు మృతి, 172 మందికి గాయాలు




హవానా: క్యూబాలో టోర్నడోలు బీభత్సం సృష్టిస్తున్నాయి. బలమైన గాలులు, వర్షం ప్రభావానికి హవానా బిక్కుబిక్కుమన్నది. టోర్నడోల కారణంగా ముగ్గురు మృతి చెందగా, మరో 172 మంది గాయపడ్డారు. నష్టం తీవ్రంగా ఉన్నట్టు క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ తన ట్విట్టర్‌లో వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో భవనాలు దెబ్బతిన్నాయి. 800కు పైగా చెట్లు నేలమట్టమయ్యాయి. కార్లు ధ్వంసం అయ్యాయి. టోర్నడో ప్రమాదానికి గురైన ప్రాంతాలను అధ్యక్షుడు మిగుల్ సందర్శించనున్నారు. టోర్నడోల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

‘హెల్త్’కు ‘సెల్ఫీ’ గోల్!

సెల్ఫీలో అందంగా కనిపించడానికి ప్లాస్టిక్ సర్జరీల బాట పడుతోన్న యువత

2013 నుంచి 47శాతానికి పైగా పెరిగిన అనవసర ప్లాస్టిక్ సర్జరీలు : ఏఏఓఎఫ్ పిఏఆర్ఎస్

- బోటాక్స్, ఫిల్లర్స్ , మైక్రో నీడిలింగ్ వంటి నాన్ సర్జికల్ కాస్మోటిక్ థెరపీలు కూడా!
- ఎముకల సమస్యతో పాటు కార్పల్ టన్నెల్ సిండ్రోమ్‌కి దారితీస్తోన్న వ్రిస్ట్ సెల్ఫీ..
- అనవసర ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకోవద్దు : హెచ్చరిస్తున్న నిపుణులు



కడవేర్గు

ప్రస్తుతం ట్రెండ్ అంతా సెల్ఫీల చుట్టే తిరుగుతోంది. ఈ సెల్ఫీ పిచ్చితో యువత మరీ విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు వినూత్న ఫోటోలను క్లిక్కుమనిపించి ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రామ్ లలో పోస్ట్ చేసి లైక్స్ కోసం ఆరాటపడటం సర్వసాధారణమైంది. కాగా, ఇటీవల విడుదలైన రెండు నివేదికలు.. సెల్ఫీల కోసం యువతీ, యువకులు తమ ఆరోగ్యాన్ని ఏ విధంగా బలిపెడుతున్నారో సవివరంగా పేర్కొన్నాయి.

మణికట్టుకు సెల్ఫీ షాక్

సెల్ఫీలు తీసుకోవడం వలన వచ్చే ఆనందం మాట అటుంచితే, సెల్ఫీల మాయలో యువత అనవసర ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకోవడం మరింత ఎక్కువవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు.


ఐరిష్ మెడికల్ జర్నల్ లో ప్రచురితమైన తాజా కథనం ప్రకారం.. సెల్ఫీ తీసుకునేందుకు ఎక్కువ సమయం సెల్ ఫోన్ ను పట్టుకోవడం మూలంగా మణికట్టులో(వ్రిస్ట్) నొప్పి సంబంధిత పలు సమస్యలు తలెత్తుతున్నట్టు.. మణికట్టులో తీవ్రమైన నొప్పితో పాటు జలదరించినట్టు(షాక్ తగిలినట్టు) అనిపించేలా చేసే కార్పల్ టన్నెల్ సిండ్రోమ్‌కి ఇది దారితీసే అవకాశమున్నట్టు వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఈమధ్య ఇలాంటి కేసుల సంఖ్య బాగా పెరిగిపోయాయని అధ్యయనకారులు చెబుతున్నారు. ఇక, సెల్ఫీల కోసం ఎత్తైన ప్రాంతాలను ఎక్కడం, స్టంట్స్ చేయడం, ఎగరడం, దూకడం వగైరాల మూలంగా శరీరంలోని ఎముకలపై ఆయా చర్యలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు. కాగా, అక్టోబర్ 2011 – నవంబర్ 2017 మధ్య కాలంలో దాదాపు 259 సెల్ఫీ మరణాలు సంభవించినట్టు.. ఈ మరణాలు అధికంగా ఇండియా, యూఎస్, రష్యా, పాకిస్థాన్ దేశాల్లోనే జరిగినట్టు 2018 లో విడుదలైన ఓ నివేదిక వెల్లడించింది.

సెల్ఫీ కోసం సర్జరీ

సోషల్ నెట్ వర్కింగ్ సైట్లలో సెల్ఫీలను వీలైనంత అం దంగా పోస్ట్ చేసుకోడానికి యువత నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా, 23 నుంచి 38 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు సెల్ఫీల్లో అందంగా కనిపించడం కోసం ఏకంగా ప్లాస్టిక్ సర్జరీలు, నాన్ సర్జికల్ ట్రీట్ మెంట్లు చేయించుకుంటున్నట్టు ఇటీవల ఓ సర్వేలో తేలింది. అమెరికా అకాడమీ ఆఫ్ ఫేషియల్ ప్లాస్టిక్ అండ్ రికన్స్ట్రక్టివ్ సర్జరీ (ఏఏఓఎఫ్ పిఏఆర్ఎస్) సంస్థ అధ్యయనం ప్రకారం.. 2013 నుంచి సాధారణంతో పోలిస్తే, దాదాపు 47శాతం ఎక్కువ ప్లాస్టిక్ సర్జరీలు(అవసరంలేని) జరిగాయని.. ఇందులో 72శాతం మంది ముప్పై ఏండ్లు కూడా నిండని యువతేనని తేలింది.

సోషల్ మీడియాలో సెల్ఫీ ఫోటోలు అందంగా కనబడటానికి ఇలాంటి కాస్మోటిక్ సర్జరీల వైపు యువత పయనిస్తున్నట్టు నిపుణులు చెబుతుంటే, అలాంటిది ఏం లేదని కొందరు సైకియాట్రిస్టులు కొట్టిపారేస్తున్నారు. ఐతే, గణాంకాల ప్రకారం.. బోటాక్స్, ఫిల్లర్స్ , మైక్రో నీడిలింగ్ వంటి నాన్ సర్జికల్ కాస్మోటిక్ థెరపీలపై ఈమధ్య కాలంలో యువత మక్కువ చూపుతున్నట్టు తేలింది. అందంగా కనిపించడం కోసం లేనిపోని సమస్యలను



తెచ్చుకోవడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు సెలవిస్తున్నారు. కాగా, 2015 సంవత్సరంలో ఢిల్లీకి చెందిన సాహిల్ కమ్రా పేరుగల 23ఏండ్ల యువకుడు సెల్ఫీలలో అందంగా కన్పించేందుకు ఏకంగా 80 వేల రూపాయలు ఖర్చు చేసి, పెదవులు, ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవడం అప్పట్లో సంచలనాన్ని సృష్టించింది. తన ఇన్ స్టాగ్రామ్ లో 500 మంది ఫాలోవర్లు ఉన్నారని, వారిని ఆకట్టుకునేందుకే ఇలా చేశానని అతడు చెప్పడం గమనార్హం.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ముఠా గోపాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం 2019 క్యాలెండర్‌ను ముషీరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలు చేసి తీరుతామన్నారు. చేతి వృత్తుల వారందరికీ మెరుగైన జీవనోపాధి కల్పిస్తామని చెప్పారు.. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లల బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది మత్స్యకారులున్నారని, 3650 మత్స్య సహకార సంఘాల్లో సుమారు నాలుగు లక్షల మంది మత్స్యకారులు సభ్యులుగా కొనసాగుతున్నారని వివరించారు.

ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్టుక కుమారస్వామి అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవి రమణ, సంఘం రాష్ట్ర కార్యదర్శులు కర్రెల్లి లలిత, అర్వపల్లి శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చెనమోని శంకర్, రాష్ట్ర నాయకులు పూస నాగమణి, వెంకన్న, భాషయ్య, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.




2019 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నల్సార్ విద్యార్థులకు స్వైన్ ఫ్లూ

• గాంధీలో చికిత్స • వాతావరణ మార్పులే కారణం..

నవతెలంగాణ - సికింద్రాబాద్

వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో స్వైన్‌ఫ్లూ తన ప్రతాపం చూపుతోంది. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే పలు ఆస్పత్రుల్లో అనుమానిత కేసులు నమోదై ఉన్నాయి. తాజాగా నల్సార్ యూనివర్శిటీకి చెందిన నలుగురు విద్యార్థులు స్వైన్‌ఫ్లూతో సోమవారం గాంధీ ఆస్పత్రిలో చేరారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలో ఉన్న నల్సార్ యూనివర్శిటీకి చెందిన 9 మంది లా విద్యార్థులకు తీవ్ర జ్వరం వచ్చింది. స్థానిక ఆస్పత్రిలో చూపించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు స్వైన్‌ఫ్లూ ఉందని నిర్ధారించారు. వెంటనే వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికే గాంధీలో ఐదుగురు స్వైన్‌ఫ్లూకు చికిత్స పొందుతున్నారు.


తనయుడు జునైద్‌తో అమీర్‌ఖాన్

బెస్ట్ ఛాయిస్..

'నా జీవితం ఆధారంగా బయోపిక్ తీస్తే అందులో నా పాత్రకి మా అబ్బాయి జునైద్ న్యాయం చేయగలడు' అని అంటున్నారు అమీర్‌ఖాన్. ఆయన తనయుడు జునైద్ ఖాన్ హీరోగా తెరంగేట్రం కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో తనయుడు జునైద్ ఎంట్రీ గురించి అమీర్ మాట్లాడారు. 'జునైద్ ప్రస్తుతం నటనలో శిక్షణ పొందుతున్నాడు. జునైద్ తెరపై నటుడిగా తానేంటో నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. ఓ తండ్రిగా అతనికి సూచించేది ఒక్కటే. కేవలం హీరో పాత్రని చేయడమే కాదు, అందులో లీనం కావాలి. ఓ హీరోగా ఉండటమే కాదు, స్క్రీన్‌పై ఆ పాత్రలో జీవించాలి. అదే నటనలో ఉండే సంతోషం. దాన్ని ప్రతి ఒక్క నటుడు నమ్మాలి. నాకు తెలిసి నా బయోపిక్‌లో నటించేందుకు జునైద్ బెస్ట్ ఛాయిస్. నా పాత్రకి న్యాయం చేయగలడు' అని చెప్పారు.

నవచిత్రం

సందేశాత్మక లఘు చిత్రం

రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో శ్రీదేవి ప్రసన్న మూవీస్ పతాకంపై పి.కృష్ణకాంత్, రాఘవ్ ఓంకార్ శశిధర్ సంయుక్తంగా 'నన్ను క్షమించండి' లఘు చిత్రాన్ని రూపొందించారు. ఇటీవల ఈ షార్ట్ ఫిల్మ్‌ని ప్రదర్శించిన సందర్భంగా దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ, 'శశిధర్ మంచి దర్శకుడు అని గతంలో 'లడ్డు' లఘు చిత్రంతో నిరూపించుకున్నాడు. ఇప్పుడు మంచి ఆలోచనాత్మక షార్ట్ ఫిల్మ్ రూపొందించాడు. బూతు కంటెంట్‌తో వెబ్ సిరీస్‌లు వస్తున్న ఈ రోజుల్లో ఇలాంటి మంచి సినిమాలు రావాలి. మంచి కథ చెబితే శశిధర్‌తో సినిమా తీయడానికి నేను రెడీ' అని అన్నారు.
చిత్ర దర్శకుడు శశిధర్ చెబుతూ, 'నేను రూపొందించిన లఘు చిత్రం 'లడ్డు'నికి 28 అంతర్జాతీయ అవార్డులు, నాలుగు నంది అవార్డులు లభించాయి. మంచి పేరు కూడా వచ్చింది. ఇక లఘు చిత్రాలు చేయొద్దు అనుకున్నా. కానీ కృష్ణకాంత్ కలిసి షార్ట్ ఫిల్మ్ చేయమని అడిగిన పద్ధతి నాకు బాగా నచ్చి ఆయన కోసం ఈ లఘు చిత్రం తీశా. డీఓపీ శేఖర్, మ్యూజిక్ డైరెక్టర్ సునీల్ కశ్యప్, నటుడు రవివర్మ సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ, నా కోసం పనిచేశారు. తాగుబోతు రమేష్, గిరి అన్న చాలా సపోర్ట్ చేశారు. నెక్స్ట్ సినిమాతో మీ ముందుకు వస్తా' అని చెప్పారు. 'ఓ లఘు చిత్రం చేయాలని ఎప్పట్నుంచో అనుకున్నా. 'లడ్డు' చూశాక ఈ దర్శకుడితో షార్ట్ ఫిల్మ్ చేయాలనిపించింది. నేను నా జీవితంలో యాక్టింగ్ చేస్తాననుకోలేదు. ఎవరితోనైనా యాక్ట్ చేయించే సత్తా శశిధర్‌కి ఉంది. మా నాన్నకి పెద్ద గిఫ్ట్ ఇచ్చాడు' అని నిర్మాత కృష్ణకాంత్ తెలిపారు.


'నన్ను క్షమించండి' లఘు చిత్ర యూనిట్ సభ్యులు

ప్రేక్షకులు మెచ్చే నవ్య ప్రేమకథ


ఆది పినిశెట్టి, ఎస్.చంద్రశేఖర్, రవిచంద్ర

రవిచంద్ర, సుమయ జంటగా ఆది పినిశెట్టి దర్శకత్వంలో శేఖర్ మూవీస్ బ్యానర్‌పై చంద్రశేఖర్ ఎస్ నిర్మిస్తున్న చిత్రం 'ఈ 2 మనసులు'. ఈచిత్ర టీజర్, సాంగ్ విడుదల కార్యక్రమం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ, 'ఈ సినిమా స్క్రిప్ట్ విషయంలో నా తమ్ముడు సత్య చాలా హెల్ప్ చేశారు. మమ్మల్ని నమ్మి ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతకి రుణపడి ఉంటా. ఇదొక లవ్ స్టోరీ. అందరికి నచ్చుతుందని నమ్ముతున్నా' అని అన్నారు. 'సినిమాలో నటించిన నటీనటులు, పనిచేసిన టెక్నీషియన్లు కొత్తవాళ్లైనా సినిమా చాలా బాగా వచ్చింది. పెద్ద హీరోలు చేయకపోవడంతో కొత్తవాళ్ళతో రూపొందించాం. ఎప్పటికైనా మాది పెద్ద బ్యానర్ అవుతుంది. మాలాంటి నిర్మాతలను ప్రోత్సహిస్తేనే మరిన్ని మంచి కథలతో మీ ముందుకు రాగలం. సినిమా చిత్రీకరణ 70శాతం పూర్తయ్యింది. చివరి షెడ్యూల్ ఫిబ్రవరిలో పూర్తి చేసుకుని సమ్మర్‌లో సినిమాని విడుదల చేస్తాం' అని నిర్మాత తెలిపారు. హీరో రవిచంద్ర మాట్లాడుతూ, 'ఈ మధ్య వచ్చిన లవ్‌స్టోరీస్‌కి చాలా భిన్నంగా ఉంటుంది. దర్శకుడు ఎలాంటి నటన కావాలో అలాంటి నటన రాబట్టుకున్నారు. సినిమా విజయం సాధిస్తుందని భావిస్తున్నాం' అని చెప్పారు.

వరుణ్ తేజ్ వాల్మీకి మొదలైంది


నిహారిక
వరుణ్‌తేజ్

వరుణ్‌తేజ్ నటిస్తున్న నూతన చిత్రం 'వాల్మీకి'. హరీష్ శంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. వరుణ్‌తేజ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నటి నిహారిక కొణిదెల క్లాప్ నివ్వగా, రామ్ బొబ్బ కెమెరా స్విచాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. మరో దర్శకుడు సుకుమార్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'కథ సిద్ధమైంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ని ఆరంభిస్తాం. అలాగే సినిమాలో నటించే నటీనటులు, టెక్నీషియన్ల వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం' అని చిత్ర బృందం తెలిపింది.
ఈ సినిమాకి సంగీతం:దేవిశ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: అయనంకా బోస్, కథ: కార్తీక్ సుబ్బరాజ్, స్క్రీన్‌ప్లే: మధు, చైతన్య, ఆర్ట్: అవినాష్ కొల్లా, ఎడిటింగ్: ఛోటా కె.ప్రసాద్. ఫైట్స్: రామ్‌లక్ష్మణ్.


నిధి అగర్వాల్

అందుకే హ్యాపీ ఎండింగ్ ఇచ్చా..


వెంకీ అట్లూరి

'నటనతో పోలిస్తే కథ, మాటలు రాయడం, దర్శకత్వంలోనే ఎక్కువ సంతృప్తి ఉంది' అని అంటున్నారు వెంకీ అట్లూరి. గతేడాది 'తొలి ప్రేమ' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న వెంకీ తాజాగా 'మిస్టర్ మజ్ను' చిత్రానికి దర్శకత్వం వహించారు. అఖిల్ హీరోగా రూపొందిన ఈ సినిమా ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో వెంకీ అట్లూరి మీడియాతో మాట్లాడుతూ, 'సినిమాకి మంచి స్పందన లభిస్తుంది. ఫ్యామిలీ రిలేషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, అఖిల్ నటన ఆడియెన్స్‌ని బాగా ఆకట్టుకుంటున్నాయి. ప్రేక్షకులు సినిమాని బాగా ఆస్వాదిస్తున్నారు. 'ప్రేమ్‌నగర్'లోని ఏఎన్నార్ పాత్రని స్ఫూర్తిగా తీసుకుని ఈ కథ రాసుకున్నా. చరిత్రలో మజ్ను జీవితం విషాదంగా ముగిసిపోయింది. అందుకు భిన్నంగా ఈ సినిమాని హ్యాపీ ఎండింగ్‌తో ముగించాను. అందుకే టైటిల్ 'మిస్టర్ మజ్ను' పెట్టాం. అఖిల్, నిర్మాతతోపాటు టీమ్ అంతా ఫలితం పట్ల సంతోషంగా ఉన్నారు. సినిమాకి నాగార్జున తొలి ఆడియెన్. తొలుత కథ విని షూటింగ్‌కి వెళ్ళమని చెప్పారు. ఇటీవల సినిమా చూసి మెచ్చుకున్నారు. కొన్ని సన్నివేశాలు రీషూట్ చేయమన్నారు. అవి మాకు హెల్ప్ అయ్యాయి. టాలీవుడ్‌లో ద్వితీయ విఘ్నం సెంటిమెంట్‌ని దృష్టిలో పెట్టుకుని షూటింగ్ జరిపినప్పుడు టెన్షన్ పడ్డా. రిజల్ట్ చూశాక ఆ భయం పోయింది. సినిమాపై రివ్యూస్ పరంగా కొన్ని నెగటివ్ కామెంట్స్ వచ్చాయి. కానీ ఆడియెన్స్ బాగా ఆదరిస్తున్నారు. విమర్శల్ని స్వీకరిస్తా. సినిమా అందరికి నచ్చాలని లేదు. మొదట్నుంచి దిల్‌రాజు నుంచి సలహాలు తీసుకుంటా. ఈ చిత్రానికి కూడా సలహాలిచ్చారు. ఆయన మనవడు ఆరాన్ష్ చిన్న పాత్రలో హుషారుగా నటించాడు. నటనతో పోల్చితే రాయడం సులభం. కథని ఎన్ని వెర్షన్స్ అయినా రాస్త, కానీ రెండో టేక్‌లో నటించమంటే చాలా ఇబ్బందిగా అనిపించింది. అందుకే మళ్ళీ నటించాలనుకోవడం లేదు. 'స్నేహగీతం'కి మాటలు రాశా. త్రివిక్రమ్ నుంచి రాయడం నేర్చుకున్నా. ఆ తర్వాత నాకు మణిరత్నం అంటే స్ఫూర్తి. నెక్స్ట్ మూడు కథలు సిద్ధమయ్యాయి. మైత్రీ మూవీ మేకర్స్‌లో ఓ సినిమా, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్‌తో మరో సినిమా చేయాల్సి ఉంది. అఖిల్‌తో మరో సినిమా చేయాలనుకుంటున్నా. ఎన్టీఆర్‌తో మంచి అనుబంధం ఉంది. ఆయన పెద్ద ఇమేజ్ ఉన్న హీరో. ఆయనతో సినిమా తీయాలంటే దర్శకుడిగా మరింత అనుభవం, ధైర్యం, మంచి కథ కావాలి. ఆ అనుభవం, ధైర్యం వచ్చాక అన్ని విధాలుగా సరైన కథతో ఆయన దగ్గరకు వెళ్తాను' అని చెప్పారు.

ఫస్ట్ చిత్రంలోనే డిఫరెంట్ రోల్..


ధ్రువ

జైరామ్ వర్మ దర్శకత్వంలో విశ్వనాథ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై విశ్వనాథ్ తన్నీరు నిర్మిస్తున్న చిత్రం 'ఎం 6'. ఫిబ్రవరి రెండో వారంలో సినిమా విడుదలకు సిద్ధమవుతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయమవుతున్న ధ్రువ మాట్లాడుతూ, 'ఈ సినిమాతో హీరోగా పరిచయం కావడం చాలా సంతోషంగా ఉంది. నిర్మాత విశ్వనాథ్ అంతా కొత్తవారితో ఈ సినిమా నిర్మించబోతున్నారని తెలిసి ఆయన్ని కలిశా. ఫొటో షూట్ చేసి వారం రోజుల్లో ఫోన్ చేస్తామన్నారు. నెల రోజులు దాటినా ఫోన్ రాలేదు. ఇక ఛాన్స్ రాదులే అనుకుంటున్న సమయంలో విశ్వనాథ్ ఫోన్ చేసి 'నువ్వు మా సినిమాలో హీరోగా సెలెక్ట్ అయ్యావు. నెక్స్ట్ వీక్ షూటింగ్‌కి వెళ్తున్నాం' అని చెప్తే ఆశ్చర్యపోయాను. ఆయన చెప్పిన టైమ్‌కే షూటింగ్ స్టార్ట్ చేశారు. నన్ను ఓ కొత్త హీరోలా కాకుండా సొంత తమ్ముడిలా చూసుకున్నారు. అలాగే దర్శకుడు జైరామ్ వర్మ అన్ని విషయాల్లో సహకారం అందించారు. దీంతో ఇబ్బంది పడకుండా నటించాను. మంచి కథ, కథనాలతో వర్మ చాలా అద్భుతంగా ఈ సినిమాని తెరకెక్కించారు. అన్ని వర్గాల ప్రేక్షకులకి నచ్చే సినిమా అవుతుంది. నా ఫస్ట్ సినిమాలోనే డిఫరెంట్ రోల్ చేయడం హ్యాపీగా ఉంది. ఇలానే భిన్నమైన పాత్రలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకోవాలనుకుంటున్నా. ఈ చిత్ర ట్రైలర్‌ని ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ విడుదల చేయడం మరచిపోలేని అనుభూతిని కలిగించింది. ఈ సినిమాని, నన్ను ఆదరించాలని ఆడియెన్స్‌ని కోరుకుంటున్నా. ఈ ఛాన్స్ ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని అన్నారు.

వాళ్ళకు సరైన సమాధానం చెప్పే సినిమా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవితం ఆధారంగా 'చంద్రోదయం' సినిమా రూపొందుతుంది. పి.వెంకటరమణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన శ్రీజ సినిమాస్, శ్వేతార్క గణపతి ఎంటర్‌ప్రైజెస్ పతాకాలపై జి.జె.రాజేంద్ర నిర్మిస్తున్నారు. త్వరలో ఈ చిత్ర ఆడియో విడుదల చేయనున్నారు.
ఆ విశేషాలను దర్శకుడు తెలియజేస్తూ, 'చంద్రబాబు నాయుడు భారతదేశం గర్వించదగ్గ నాయకుడు. అపారమైన తన మేథా సంపత్తితో ఆంధ్రప్రదేశ్‌ని అగ్ర పథాన నిలిపాడు. 68 ఏండ్ల వయసులోనూ తెలుగు ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాడు. అందుకే అలాంటి మహానుభావుడి కష్టం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువాళ్ళకి తెలియజేయడానికి ఈ సినిమాని రూపొందిస్తున్నాం. చంద్రబాబు బయోపిక్ ఎందుకు తీస్తున్నావని అడిగే వాళ్ళకు ఈ సినిమా సరైన సమాధానం చెబుతుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఇప్పటికే రాంగోపాల్ వర్మ వెన్నుపోటు పాటకి వ్యతిరేకంగా రిలీజ్ చేసిన పాట సంచలనం సృష్టించింది.
ఈ నెల 31న చిత్ర ఆడియోని విడుదల చేయబోతున్నాం' అని అన్నారు. 'చంద్రబాబు నాయుడి బయోపిక్ తీసే అదృష్టం నాకు దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది. డిజిటలైజేషన్ వర్క్ కంప్లీట్ అయ్యాక సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసి సినిమాని విడుదల చేస్తాం' అని నిర్మాత తెలిపారు. వినోద్ నవ్వుల, శివానీ చౌదరి, మౌనిక, భాస్కర్ తదితరులు నటిస్తోన్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ ముకుందన్, సంగీతం: రాజ్ కిరణ్.

పూరీ ఇస్మార్ట్ హీరోయిన్

రామ్ హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో 'ఇస్మార్ట్ శంకర్' రూపొందుతున్న విషయం విధితమే. పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరీ కనెక్ట్స్ పతాకాలపై పూరీ జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కథానాయికగా నిధి అగర్వాల్‌ని ఎంపిక చేశారు. 'అందం, అభినయంతో ప్రేక్షకుల్ని అలరిస్తున్న నిధి అగర్వాల్‌కిది తెలుగులో మూడో సినిమా. రామ్‌తో కలిసి ఆమె మెస్మరైజ్ చేయడం ఖాయం. ఇటీవలే సినిమా రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అయ్యింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ యాక్షన్ సీన్స్‌ని చిత్రీకరిస్తున్నాం. ఇందులో హీరో రామ్ పాల్గొంటున్నారు. రియల్ సతీష్ ఈ యాక్షన్ ఎపిసోడ్స్‌కి కొరియోగ్రఫీ చేస్తున్నారు. త్వరలో నిధి కూడా షూటింగ్‌లో పాల్గొంటుంది. మేలో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం' అని చిత్రయూనిట్ తెలిపింది. పునీత్ ఇస్సార్, సత్యదేవ్, మిలింద్ గునాజి, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: రాజ్ తోట, ఆర్ట్: జానీ షైక్, ఎడిటర్: జునైద్ సిద్ధిఖీ.


చంద్రబాబునాయుడుతో 'చంద్రోదయం' చిత్ర బృందం

స్పెషల్ సాంగ్‌లో మమ్ముట్టికి జోడీ


సన్నీలియోన్

సన్నీలియోన్ పోర్న్ సినిమాలకి దూరంగా ఉన్నప్పట్నుంచి పలు చిత్రాల్లో భిన్న పాత్రలు పోషిస్తూ నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా ప్రత్యేక పాటలకు కేరాఫ్‌గా నిలిచింది. ఇప్పటికే పలు దక్షిణాది చిత్రాల్లో స్పెషల్ సాంగ్‌ల్లో మెరిసిన ఆమె తాజాగా మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టికి జోడీగా నటించనుంది. మమ్ముట్టి హీరోగా 'మధురరాజా' చిత్రం రూపొందుతుంది. వైశాఖ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా గతంలో వచ్చిన 'పోకిరి రాజా' చిత్రానికి సీక్వెల్. జై, అనుశ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో కథానుగుణంగా ఓ ప్రత్యేక పాటలో మమ్ముట్టితో కలిసి సన్నీ డాన్స్ చేయనుందట. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతుంది. మమ్ముట్టి తెలుగులో 'యాత్ర' చిత్రంలో నటిస్తున్న విషయం విదితమే. మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా మహి.వి.రాఘవ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సన్నీలియోన్ మలయాళంలో 'రంగీలా'లో నటించడంతోపాటు తమిళంలో తెరకెక్కుతున్న 'అయోగ్య'లోనూ స్పెషల్ సాంగ్‌లో మెరవనుంది.

సప్తగిరి వజ్ర కవచధర గోవింద

'గోవిందు ఫన్నీ దొంగ. కానీ అతనికో లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం ఏం చేశాడన్నది తెలుసుకోవాలంటే 'వజ్ర కవచధర గోవింద' సినిమా చూడాల్సిందే' అని అంటున్నారు హీరో సప్తగిరి. ఆయన హీరోగా అరుణ్ పవార్ దర్శకత్వంలో శివ శివమ్ ఫిల్మ్స్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎస్ రెడ్డి సంయుక్తంగా ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'సప్తగిరి హీరోగా నేను రూపొందించిన 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా రూపొందిస్తున్న ఈ సినిమా అంతకు మించి ఉంటుంది. అవుట్‌పుట్ చాలా బాగా వస్తోంది. సప్తగిరి నుంచి ఆడియెన్స్ ఏం ఆశిస్తారో, ఆ అంశాలన్నీ సినిమాలో ఉన్నాయి. ఆయన బాడీ లాంగ్వేజ్‌కి బాగా సూట్ అయ్యే కథ ఇది. కథకు తగ్గట్టుగానే టైటిల్ పెట్టాం. నిర్మాతలు కొత్తవారైనా రాజీపడకుండా సినిమాని నిర్మిస్తున్నారు. కడుపుబ్బా నవ్వించే అంశాలతోపాటు, మంచి యాక్షన్, ఎమోషన్, ఇతర వాణిజ్య అంశాలు మెండుగా ఉంటాయి' అని అన్నారు.
'సినిమా షూటింగ్ 80శాతం పూర్తయ్యింది. కర్నాటకలోని ఓ గుడిలో మిగిలిన కీలకమైన ఎపిసోడ్స్‌ని 10 రోజుల పాటు చిత్రీకరిస్తాం. టైటిల్ ప్రకటించగానే సినిమాపై ఇండస్ట్రీలోను, ప్రేక్షకుల్లోనూ అటెన్షన్ నెలకొంది. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' వంటి సూపర్‌హిట్ తర్వాత సప్తగిరి, అరుణ్ పవార్ కాంబినేషన్‌లో సినిమా చేసే ఛాన్స్ నాకు దక్కడం హ్యాపీగా ఉంది. హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమా సాగుతుంది' అని నిర్మాతలు తెలిపారు.
వైభవీ జోషి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్, రాజేంద్ర జాన్ కొట్టోలి, వీరేన్ తంబిదొరై తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: ప్రవీణ్ వనమాలి, ఎడిటింగ్: కిషోర్ మద్దాలి.


సప్తగిరి

విజయ్ సేతుపతి సరసన..!


రాశీ ఖన్నా

గతేడాది 'తొలిప్రేమ'తో విజయాన్ని అందుకున్న రాశీఖన్నా 'శ్రీనివాస కళ్యాణం'తో పరాజయాన్ని చవిచూసింది. ఆ తర్వాత తెలుగులో ఆమె మరే సినిమాకి సైన్ చేయలేదు. అయితే వరుసగా తమిళ సినిమా అవకాశాలను అందుకుంటూ అందరిని సర్‌ప్రైజ్ చేస్తోంది. ప్రస్తుతం రెండు తమిళ చిత్రాల్లో నటిస్తుండగా తాజాగా మరో నయా ఆఫర్‌ని దక్కించుకుంది. విభిన్న పాత్రలు పోషిస్తూ హీరోగా రాణిస్తున్న విజయ్ సేతుపతి సరసన నటించే లక్కీ ఛాన్స్‌ని కొట్టేసింది. ప్రస్తుతం 'సూపర్ డీలక్స్'లో నటిస్తున్న విజయ్ సేతుపతి త్వరలో విజయ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ఓ సినిమా చేయబోతున్నారు. విజయ్ చందర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన రాశీఖన్నా ఓ కథానాయికగా నటించనుందట. ఆమెతోపాటు మరో హీరోయిన్‌గా నివేదా పేతురాజ్ ఎంపికైనట్టు సమాచారం. ఓ కొత్త తరహా ప్రేమ కథగా ఈ సినిమా తెరకెక్కనుందని తెలుస్తోంది. విజయ్ సేతుపతి తెలుగులో 'సైరా నరసింహారెడ్డి'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. రాశీఖన్నా తమిళంలో 'అయోగ్య', 'సైతాన్ కా బచ్చా' చిత్రాల్లో నటిస్తోంది. తెలుగులో అవకాశాలు తగ్గినప్పటికీ తమిళంలో రాశీ బిజీ అవ్వడం విశేషం.

వృత్తి విద్యా ఫీజులు పెరిగేనా?

టీఏఎఫ్‌ఆర్సీ చైర్మెన్ పోస్టు ఖాళీ

- నియామకంపై దృష్టి సారించని సర్కారు
- కాలేజీ యాజమాన్యాల్లో ఆందోళన
- ఆన్‌లైన్‌లో ఆదాయ, వ్యయాలు సమర్పిస్తున్న వైనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వృత్తి విద్యా కోర్సుల ఫీజులు పెంపుదలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ) చైర్మెన్ పోస్టు ఖాళీగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా ఉన్నది. టీఏఎఫ్‌ఆర్సీ చైర్మెన్‌గా జస్టిస్ పి స్వరూప్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం 2015, జులై 22న నియమించింది. ఆయన 2015, ఆగస్టు 17న బాధ్యతలు స్వీకరించారు. 2018, జులై 21న ఆయన పదవీ కాలం ముగిసింది. జులై నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉన్నది. ఫీజుల పెంపునకు సంబంధించి టీఏఎఫ్‌ఆర్సీ చైర్మెన్ పోస్టు ఎంతో కీలకమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై అలసత్వం ప్రదర్శిస్తున్నది. ఆరు నెలలుగా ఆ పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టలేదన్న విమర్శలు వస్తున్నాయి. టీఏఎఫ్‌ఆర్సీ చైర్మెన్ పోస్టును భర్తీ చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కావాలనే నియమించడం లేదా? లేక వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నదా? అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు వృత్తి విద్యా కోర్సుల ఫీజు పెంపుదలలో కీలకమైన టీఏఎఫ్‌ఆర్సీ చైర్మెన్ పోస్టు ఖాళీగా ఉంటే ఫీజులు పెరుగుతాయా? అన్న అనుమానం వస్తున్నది. పాత ఫీజులనే కొనసాగించే అవకాశమూ లేకపోలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఫీజులు ఖరారు చేసే నాటికి టీఏఎఫ్‌ఆర్సీ చైర్మెన్‌ను ప్రభుత్వం నియమించే అవకాశముందని విశ్వసనీయంగా తెలిసింది. ఇలా అనేక రకాలుగా వృత్తి విద్యా కోర్సుల ఫీజుల ఖరారుపై వాదనలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాలు కోరుతున్నాయి.

ఆదాయ, వ్యయాల సమర్పణ ప్రక్రియ షురూ

రాష్ట్రంలో వృత్తి విద్యా కోర్సుల ఫీజులకు సంబంధించి కాలేజీ యాజమాన్యాల నుంచి ఆదాయ, వ్యయాల సమర్పణ



ప్రక్రియ ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఈసారి పూర్తిగా ఆన్‌లైన్‌లో ఆదాయ, వ్యయాల వివరాలను పూర్తిగా సమర్పించాల్సి ఉంటుంది. 2016-17, 2017-18 విద్యాసంవత్సరాలకు సంబంధించిన ఆడిట్ నివేదికలు కాలేజీ యాజమాన్యాలు సమర్పించాలి. http://tafrconlince.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆదాయ, వ్యయాల వివరాలను ఇవ్వాలి. ఆ వివరాలకు సంబంధించిన పూర్తి సెట్‌ను మ్యానువల్‌గా టీఏఎఫ్‌ఆర్సీ అధికారులకు ఇవ్వాలి. కొత్త ఫీజులు 2019-20 విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. 2019-20, 2020-21, 2021-22 విద్యాసంవత్సరాల్లో ఈ ఫీజులు అమల్లో ఉంటాయి. కాలేజీ యాజమాన్యాలు ఆదాయ, వ్యయాల వివరాలు సమర్పించేందుకు తుది గడువు వచ్చేనెల 21వ తేదీ వరకు ఉంది. మూడేండ్లకోసారి వృత్తి విద్యా కోర్సుల ఫీజులను టీఏఎఫ్‌ఆర్సీ ఖరారు చేస్తుంది. 2016-17, 2017-18, 2018-19 విద్యాసంవత్సరాలకు టీఏఎఫ్‌ఆర్సీ ఫీజులను ఖరారు చేసింది. ఈ విద్యాసంవత్సరంలోనే ఆ ఫీజుల గడువు ముగుస్తుంది.

పెరిగిన ప్రాసెసింగ్ ఫీజు

కాలేజీ యాజమాన్యాలు కోర్సుకు చెల్లించే ప్రాసెసింగ్ ఫీజును టీఏఎఫ్‌ఆర్సీ పెంచింది. 2016-17 విద్యాసంవత్సరంలో మూడేండ్లకుగాను వృత్తి విద్యాకోర్సుల ఫీజుల ఖరారు సమయంలో ప్రాసెసింగ్ ఫీజు బీఈ/బీటెక్, బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బీఆర్క్, బీ ప్లానింగ్, ఎంఈ/ఎంటెక్, ఎంఆర్క్, ఎం ప్లానింగ్, ఎం ఫార్మసీ, ఫార్మా-డీ(పీబీ), బీఎఫ్ఏ (ఐదేండ్లు) కోర్సులకు ప్రాసెసింగ్ ఫీజు గతంలో రూ.11,475 వసూలు చేసింది. కాలేజీ యాజమాన్యాలు ఒక్కో కోర్సుకు రూ.11,475 చెల్లించాలి. ఆ కోర్సులకు ఇప్పుడు రూ.18 వేలు చెల్లించాలని టీఏఎఫ్‌ఆర్సీ నిర్ణయించింది. దీంతో రూ.6,525 ఫీజును పెంచింది. ఇక ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఎల్‌పీటీ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ/బీఎల్, ఎల్ఎల్ఎం/ఎంఎల్, బీఎఫ్ఏ (మూడేండ్లు), బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సులకు 2016-17లో రూ.5,750 ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేసింది. ఆ ఫీజును ఇప్పుడు రూ.9 వేలకు పెంచింది. అంటే రూ.3,250 ప్రాసెసింగ్ ఫీజు పెరిగింది.

హెచ్‌ఎండీఏ కమిషనర్ బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేస్తున్న అరవింద్‌కుమార్‌కు హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే, ఈ బదిలీ వెనుక కోకాపేట్ భూముల వివాదమే కారణమని అధికారవర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది.

మలుపుతిప్పిన కోకాపేట్..

కోకాపేట్‌లో 623 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఐటీ సెజ్‌కు 120 ఎకరాలు కేటాయించారు. మరో 50 ఎకరాలు ఆయా కుల సంఘాలకు కేటాయించారు. మరో 166 ఎకరాలను 2006-08లో గోల్డ్‌మైన్ పేరుతో హెచ్‌ఎండీఏ వేలం వేసింది. మిగిలిన 200-250 ఎకరాల్లో లే అవుట్ చేయాలని అప్పటి హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు నిర్ణయించారు. ఈ విషయంపై సర్కార్‌కు ప్రతిపాదనలు పంపించారు. దానికి సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. అయితే, అప్పట్లో వేలం వేసిన భూమి ఎకరాకు రూ.5.50 కోట్ల నుంచి రూ.13కోట్లు పలికింది. ప్రస్తుతం ఎకరాకు సుమారు రూ.30 కోట్లపైనే ఉందని అధికారుల అంచనా. అయితే, ఈ భూములు తమ వారసత్వమని ఓ వ్యక్తి ప్రభుత్వాన్ని ఆశ్రయించడంతో వివాదం మొదలైంది. దాంతో కొనుగోలు చేసిన వారికి ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తాము చెల్లించిన డబ్బులు తమకు ఇవ్వాలని వారు కోరారు. మరికొంత మంది 2006-08లో ఉన్న ధరకే తమకు భూములు రిజిస్ట్రేషన్ చేయాలని పట్టుబడుతున్నారు. కానీ దీనికి ప్రస్తుత హెచ్‌ఎండీఏ కమిషనర్ జనార్దన్‌రెడ్డి అంగీకరించడం లేదని సమాచారం. పైగా కొనుగోలుదారులు ఎంత డబ్బు చెల్లించారో ఆ మేరకు మాత్రమే భూమిని రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పినట్టు తెలిసింది. లేదంటే ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం డబ్బులు చెల్లిస్తే పూర్తిగా రిజిస్ట్రేషన్ చేయడానికి హెచ్‌ఎండీఏ సిద్ధంగా ఉందనడంతో కమిషనర్ జనార్దన్‌రెడ్డి, కొనుగోలుదారుల మధ్య వివాదం నడుస్తున్నది. ఈ భూముల పక్కనే ఉన్న 200-250 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ లేఅవుట్ చేస్తుండటంతో వేలం వేసిన భూముల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో 166 ఎకరాల వివాదంలో ఉన్న కొనుగోలుదారులు రాజకీయ నేతలను రంగంలోకి దింపినట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. వారి ఒత్తిళ్లకు కమిషనర్ జనార్దన్‌రెడ్డి లొంగకపోవడంతోనే బదిలీవేటు వేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఎన్నికలకు ముందు బదిలీ..

ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణ రాష్ట్రంలోనూ పురపాలక శాఖ కమిషనర్‌గా జనార్దన్‌రెడ్డి పనిచేశారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఇష్టానుసారమే జనార్దన్‌రెడ్డిని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా తీసుకొచ్చారని అప్పట్లో ప్రచారం జరిగింది. అప్పుడు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సీఎం కేసీఆర్ వద్దే ఉంది. తర్వాత ఆ శాఖను కేటీఆర్‌కు అప్పగించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా జనార్దన్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా చిరంజీవులు ఉండగా, తెలంగాణ శాసనసభ ఎన్నికల ముందు ఇరువురినీ బదిలీ చేశారు.

మద్యం పట్టివేత

నవతెలంగాణ- విలేకరులు

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పలుచోట్ల మద్యం పట్టుబడింది. సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ శివ కుమార్, ఎస్ఐ దశరథ్ వాహనాల తనిఖీలు చేపట్టారు. టాటాఏస్ వాహనంలో సుమారు రూ.2.4 లక్షల విలువైన మద్యం తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు చంద్రశేఖర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రం మీదుగా బండవెల్కిచర్లకు ఆటోలో తరలిస్తున్న 8 కాటన్ల బీర్లు, మరికొన్ని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

మంగపేటలో ఎన్నికలు నిలిపివేత

నవతెలంగాణ-మంగపేట

ఈనెల 30న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండలంలో జరగాల్సిన గ్రామపంచాయతీ ఎన్నికలు నిలిచిపోయాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రెటరీ ఎన్ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో భీంరెడ్డి రవీంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ మంగపేట మండలాన్ని షెడ్యూల్డ్ ఏరియాగా భావిస్తూ 25 గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డ్ సభ్యుల పదవులను షెడ్యూల్డ్ ట్రైబ్‌లకు రిజర్వు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై ఈ నెల 25న గిరిజనేతరులు హైకోర్టుకు వెళ్లారు. ఎన్నికలను నిలిపివేయాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది.

రైతాంగాన్ని ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కోతకొచ్చిన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. కల్లాల్లో ఉన్న పత్తి, మిరప పంటలతో పాటు, మార్కెట్ యార్డులకు, ఐకేపీ కేంద్రాలకు అమ్మడానికి తెచ్చిన ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని పేర్కొన్నారు. ఈ ధాన్యాన్ని కొనడానికి వ్యాపారులు, ప్రభుత్వ కొనుగోలు సంస్థలు నిరాకరిస్తున్నాయని తెలిపారు. దీంతో రైతులు, కౌలురైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఆగష్టు 11-20 తేదీల్లో కురిసిన వర్షాల వల్ల కూడా 4 లక్షల ఎకరాల్లో పంటలు మునిగిపోగా, 2.08 లక్షల ఎకరాల్లో పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ తన ప్రాథమిక నివేదికలో వెల్లడించిందని తెలిపారు. 11 జిల్లాల్లో పత్తి, మిరప, వరి, సోయ, కంది, పెసర, మొక్కజొన్న, జొన్న, మినుముల పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వ నివేదికలో గుర్తించిన ప్రకారం కూడా రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు.

గత నాలుగేండ్లలో ప్రకృతి వైపరిత్యాల వల్ల జరిగిన నష్టానికి ప్రభుత్వం పరిహారం ఇవ్వాలనే ఆలోచనకు రాకపోవడం దురదృష్టకరమని తెలిపారు. 14వ ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల పరిహారం కింద ఏటా రూ.300 కోట్లు కేటాయిస్తున్న నిధులనూ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి ఈ ఏడాది ఖరీఫ్, రబీలో జరిగిన పంట నష్టానికి ఎకరాకు రూ.20 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

పంట నష్టాన్ని అంచనావేసి పరిహారం చెల్లించాలి
తెలంగాణ రైతు సంఘం

రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనావేసి, పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. జంగారెడ్డి, కార్యదర్శి టి. సాగర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాణిజ్య పంటలకు ఎకరానికి రూ. 20వేల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. వేరుశనగ పంటకు మొలకలు వచ్చే పరిస్థితి ఉందని, మామిడి పూత పూర్తిగా రాలిపోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెవెన్యూ, వ్యవసాయ అధికారులను పంపించి పంట నష్టం అంచనా వేయించాలని కోరారు. తడిసిన ధాన్యానికి నాణ్యతా ప్రమాణాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

లింగ నిష్పత్తిలో అంతరాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నది. ఇక కర్నాటక, తెలంగాణలలోనూ వేయి మంది బాలురకు వరుసగా 896 మంది, 881 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాలే గాక ఉత్తరాదిలో బీహార్, యూపీలు కూడా బాలికల నిష్పత్తిలో అంతరాయం స్పష్టంగా కనిపిస్తోంది. గణాంకాల ప్రకారం యూపీలో 885 మంది, బీహార్‌లో 837 మంది బాలికలు మాత్రమే ఉన్నారు.

కాగా, కేరళలో మాత్రం ఎప్పటిలాగే నవజాత శిశువుల లింగ నిష్పత్తిలో ఆ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నది. 2016లో కేరళలో వేయి మంది బాలురకు 954 మంది బాలికలు ఉన్నారు. ఇది దేశ సగటు కంటే అధికం కావడం గమనార్హం. ఇదే సమస్యపై పోరాడుతున్న సామాజిక కార్యకర్త సబూ జార్జ్ మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలలో ఎస్ఆర్‌బీ రేటు పడిపోవడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు.

కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

"గుప్పెడు సూర్యుడు, మరికొన్ని కవితలు " పేరిట అనువదించినందుకు 2018 లో తెలుగులో కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారానికి ఎంపిక అయ్యారు. ఈ మేరకు సోమవారం నాడిక్కడ రబీంద్ర భవన్‌లో సాహిత్య అకాడమీ అధ్యక్షులు చంద్రశేఖర్ కంభర్ నేతృత్వంలో అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం జరిగింది. ఈ విషయాన్ని బోర్డ్ కార్యదర్శి కె శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో 24 పుస్తకాలను సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం-2018నకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఆ పుస్తకాలను ప్రతి భాషకు ముగ్గురు సభ్యులతో కూడిన ఎంపికల కమిటీలు నియమ, నిబంధనలకు లోబడి చేసిన ప్రతిపాదనల మేరకు ఎంపిక చేసినట్టు చెప్పారు. 2012 జనవరి 1 నుంచి 2016 డిసెంబర్ 31 మధ్య వెలువడిన అనువాద పుస్తకాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ పురస్కారాన్ని ఈ ఏడాదిలోనే ప్రత్యేక సభ ఏర్పాటు చేసి అందజేస్తామని, రూ.50 వేల నగదు బహుమతితో పాటు, రాగి షీల్డ్ అందజేస్తామని తెలిపారు. 24 భాషాల్లో ప్రకటించిన ఈ పురస్కారం, తెలుగులో కృష్ణారావుకు వచ్చింది. తెలుగులో జ్యూరీ సభ్యులుగా ప్రొఫెసర్ షేక్ మస్తాన్, శ్రీమతి ఓల్గా, వై. లక్ష్మీ ప్రసాద్‌లు వ్యవహరించారు. భారతీయ స్త్రీ ఎదుర్కొనే సామాజిక అన్యాయం, సుఖ దు:ఖాలతో పాటు దేశ విభజన సమయంలో తన తండ్రిని పోగొట్టుకున్న కవయిత్రి మానసిక వేదన ఈ కవితల్లో వ్యక్తీకరించారు. వీటిని కృష్ణారావు తెలుగులో అనువదించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మీడియాతో మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్, పంజాబ్ పరిసర ప్రాంత ప్రజల భాష డోగ్రికి సంబంధించిన కవితలకు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు రావటం ఆనందకరమని వ్యాఖ్యానించారు. దేశ విభజన సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై కవితలు ఉంటాయని చెప్పారు. మైనార్టీలు మాట్లాడే భాషకు సంబంధించిన రచనలకు గుర్తింపు ఇవ్వడం శుభ పరిణామం అని చెప్పారు. కాగా, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటంపై తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం చంద్రబాబు కృష్ణారావుని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్ లో ఆయన మరిన్ని రచనలు చేసి తెలుగు భాషకు పేరు ప్రఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు.

మూడో విడతకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. గత 15 రోజులుగా చేపడుతున్న ప్రచారంలో భాగంగా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి గాను భారీగా డబ్బు, మద్యం, చీరలు పంపిణీ చేసినట్టు సమాచారం. చివరి పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. మొత్తం 12,732 పంచాయతీల్లో ఇప్పటికే రెండు విడతలుగా ఎన్నికలు పూర్తవగా.. మిగతా 4,116 పంచాయతీలకు ఈ నెల 30న ఎన్నికలు జరగాల్సి ఉండగా ఇందులో 573 గ్రామాల్లో సర్పంచి పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 3,529 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ్ పదవి కోసం మొత్తం 11,667 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

వార్డుల పరిధిలో మొత్తం 36,729 వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీకాగా.. 8,956 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగత 27,583 వార్డులకు గానూ 67,316 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నల్గొండ, నిజామాబాద్, మంచిర్యాల జిల్లాలలోని మూడు పంచాయతీల పరిధిలో నిలిచిపోయిన పలు వార్డులకు కూడా ఈ నెల 30న ఎన్నికలు నిర్వహించి.. అదే రోజున ఫలితాలు వెల్లడించనున్నారు.

ఓటర్లకు గాలం

ఎన్నికల్లో గెలవాలన్న పట్టుదలతో పోటీ పడుతున్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మహిళలకు చీరలు, పురుషులకు మద్యం, నగదు పంపిణీ చేసినట్టు సమాచారం. ప్రధానంగా టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ పార్టీల అగ్రనేతలు సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారన్న విమర్శలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా పంచాయతీ ఎన్నికల్లోనూ నగదు, మద్యం పంపిణీ జరిగింది.

రూ.1.80 కోట్ల నగదు స్వాధీనం

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.1.80 కోట్ల నగదు, రూ.36,27లక్షలు విలువ చేసే 1446 లీటర్ల మద్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు విడతల్లో జరిగిన ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలకు సంబంధించి 200 కేసులు నమోదయ్యాయి.

30తో ముగింపు

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జనవరి 1న షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రాష్ట్రంలో ఎన్నికల కోలాహలం మొదలైంది. నెల రోజుల పాటు గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడిక్కింది. ఈ నెల 30తో పంచాయతీ ఎన్నికలకు తెరపడనున్నది.

మూడో విడత ముఖ చిత్రం

మొత్తం పంచాయతీలు	4116
ఏకగ్రీవమైన సర్పంచ్‌లు ...	579
ఎన్నికలు జరిగే పంచాయతీలు ..	3529
బరిలో నిఇచిన అభ్యర్థులు ..	11667
పోలింగ్ తేదీ	30న

తెలంగాణ ఇన్‌చార్జిగా ప్రియాంక?

(మొదటిపేజీ తరువాయి)

రామచంద్రకుంతియా కూడా ఆ ప్రభావాన్ని చూపడంలో విఫలం చెందారని నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. ఎన్నికల్లో పార్టీ నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించలేదనే అధిష్టానం అభిప్రాయపడుతున్నది. ఇలాంటి క్లిష్ట సమయంలో లోక్‌సభ ఎన్నికలను ఏఐసీసీ సీరియస్‌గా తీసుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు వస్తే కేంద్రంలో ప్రభుత్వానికి ఏర్పాటు అవకాశం ఉన్నది. దీనిపై ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ సీరియస్‌గా ఆలోచిస్తున్నట్టు తెలిసింది. కుంతియా విషయంలో రాహుల్‌గాంధీ అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికలను కుంతియా, ఉత్తమ్ సీరియస్‌గా తీసుకోకుండా గోల్కొండ,పార్కుహయత్ హోటళ్లలో కాలయాపన చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఎన్నికల్లో క్రమశిక్షణారాహిత్యంతో వ్యవహరించడంతోపాటు సీరియస్‌గా తీసుకోలేదన్నట్టు తెలిసింది. దీని కారణంగానే ముందస్తు ఎన్నికల్లో పార్టీ నేతలు వ్యూహాత్మంగా వ్యవహరించకపోవడం వల్లే పార్టీ ఓడిపోయిందని భావిస్తోంది. దీంతోనే పార్టీ నేతలపై అధిష్టానం సీరియస్‌గా ఉన్నది. ఎన్నికలనంతరం అధిష్టానం పెద్దలను కలిసేందుకు ఇప్పటివరకు 150 మంది నేతలు అపాయింట్‌మెంట్ కోరగా ఎవరికీ అనుమతి ఇవ్వలేదని తెలిసింది. గ్రూపులు, అంతర్గత కుమ్ములాటలపై ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడానికే అపాయింట్‌మెంట్ కోరుతున్నారనే నేపథ్యంలో తిరస్కరించినట్టు తెలిసింది. అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో ప్రతిపక్ష నేతను సైతం అధిష్టానమే నిర్ణయించినట్టు తెలిసింది. ఫిబ్రవరి మొదటివారంలో పార్టీ ఓటమి, వైఫల్యాలపై పార్టీ సీనియర్ నేతలతో ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ చర్చించనున్నారు. దీంతోపాటు పార్లమెంటు ఎన్నికలు, డీసీసీల నియామకంపై చర్చించనున్నారు. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ఎంపీ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్పాయి.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్నాయి. నేడు ప్రజాస్వామ్య విలువలు ప్రశ్నార్థకంగా మారాయి. వాటికి తూట్లు పొడుస్తున్నారు"అని అన్నారు. భారత్‌లాంటి దేశాల్లో ఎలాంటి న్యాయవ్యవస్థ ఉండాలి?అని విద్యార్థుల్ని ఆయన ప్రశ్నించారు.

స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ డీవై.చంద్రచూడ్ మాట్లాడుతూ..."సమాజంలో అసమానతలు తగ్గించడానికి విద్యార్థులు కృషి చేయాలి. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి బాగోలేక వారి పిల్లాడు చదువుకు దూరం అవుతున్నాడు. పారిశుధ్య కార్మికులకు మానవ హక్కులు దూరమవుతున్నాయి. రుతుక్రమంలో ఉన్నారని ఒంటరి మహిళలపై వివక్ష చూపుతున్నారు. దళితులపై వివక్ష కొనసాగుతోంది. సమాజంలో కొనసాగుతున్న ఈ అసమానతల్ని అడ్డుకునేవిధంగా మీరంతా పనిచేయాలి"అని అన్నారు. మహిళలకు సమాన హక్కుల కోసం జరుగుతున్న పోరాటంలో పురుషులు సైతం గొంతు కలపాలని ఆయన అన్నారు.

ఉపాధి గోస..

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతున్నట్టు స్పష్టమవుతోంది. ఇక మహిళల్లోనూ ఆ వర్గాల్లో నిరుద్యోగులు అధికంగా ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారిలో నిరుద్యోగులు ఎస్సీల్లో 34.3 శాతం, ఎస్టీల్లో 29 శాతం, ఓబీసీల్లో 32.4 శాతం ఉండగా, ఉన్నత కులాల్లో 24.3 శాతంగా ఉన్నారు. గ్రాడ్యుయేట్లలో మహిళలతోపాటు పురుషుల సగటు 13.5 శాతం. అంటే.. మహిళల్లో మొత్తమ్మీద నిరుద్యోగులు అధికమని తేలింది.

ఈ నివేదిక ద్వారా తెలిసేదేమంటే దళిత, గిరిజన, వెనకబడిన కులాల విద్యావంతుల విషయంలో ఉద్యోగాల కల్పనలో వివక్ష తీవ్రస్థాయిలో కొనసాగుతున్నదని. లింగ వివక్ష అంతకన్నా తీవ్రంగానే ఉన్నట్టు స్పష్టం చేస్తోంది. సామాజిక సమానత్వం, మహిళా సాధికారత నినాదాలుగానే తప్ప ప్రభుత్వాల కార్యాచరణలో కొరవడిందని ఈ నివేదిక తేల్చి చెబుతోంది.

ఎంబీబీఎస్ పరీక్ష మరో'సారీ'

(మొదటిపేజీ తరువాయి)

మైక్రోబయోలజీ, పెథాలజీ, పోరెన్సిక్ మెడిసిన్ పరీక్షలు నిర్వహిస్తారు. షేడ్యుల్ ప్రకారం సోమవారం యూనివర్సిటీ పరిధిలో వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం ఫార్మాకాలజీ రెండో ఏడాది పేపర్-1 పరీక్షను నిర్వహించారు. తీరా పరీక్ష పూర్తయిన కొద్దిసేపటికి పరీక్షను రద్దు చేసినట్టు యూనివర్సిటీ నుంచి విద్యార్థుల ఫోన్లకు అధికారులు సందేశాలు పంపించారు. మరోసారి షెడ్యూల్ ఖరారు చేసి పరీక్ష నిర్వహిస్తామని యూనివర్సిటీ అధికారులు ఆ సందేశంలో పేర్కొన్నారు. సాధారణంగా ప్రతి పరీక్షకు ఒకే విధమైన మూడు సెట్ల పేపర్లు తయారు చేస్తారు. వేర్వేరుగా ఉంటే ఒక పేపర్ సులభంగా, మరో పేపర్ కఠినంగా ఉండే అవకాశం ఉంది. దీంతో విద్యార్థుల మెరిట్‌లో తేడా వచ్చే ప్రమాదం ఉంది. సోమవారం జరిగిన పరీక్షలో అదే జరిగింది. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఒక పేపర్, చల్మడ ఆనంద్‌రావ్ మెడికల్ కళాశాలలో ఇంకో పేపర్ వచ్చింది. పరీక్ష ప్రారంభమయ్యాక పొరపాటును అధికారులు గుర్తించారు. పరీక్ష జరిగిన రెండు సెంటర్లలో ఒక కోడ్‌కు బదులు.. మరో కోడ్ ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసి పరీక్ష నిర్వహించినందువల్ల పరీక్షను రద్దు చేయాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. కాగా, అధికారుల తప్పిదంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఎంబీబీఎస్ పరీక్షలంటే ఇంత నిర్లక్ష్యమా' అంటూ యూనివర్సిటీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం జరిగిన పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 వేల మంది వైద్య విద్యార్థులు హాజరయ్యారు.

పాతబస్తీలో 'మిత్తి' దందా

నవతెలంగాణ- సిటీబ్యూరో

నగరంలోని జుమెరాత్ బజార్‌కు చెందిన హుస్సేన్ చిరు వ్యాపారి. వ్యాపార అవసరాల కోసం ఓ ఫైనాన్షియర్ వద్ద అప్పు తీసుకున్నాడు. వ్యాపారం సరిగా నడవక తీసుకున్న అప్పు చెల్లించలేదు. అది వడ్డీతో చెల్లించాలని వ్యాపారి వేధింపులకు గురి చేశాడు. వేధింపులు తాళలేక హుస్సేన్ ఆత్మహత్య చేసుకు న్నాడు. పురానాపూల్‌కు చెందిన మహ్మద్ రవూఫ్, యాకుత్‌పుర బడాబజార్‌కు చెందిన అబ్దుల్ రహీం, జహెరానగర్‌కు చెందిన చాంద్‌పాషా అప్పుల వారి వేధింపులు తాళలేక ఉరేసుకున్నారు. పాతబస్తీ, దానికి ఆనుకుని ఉన్న అనేక కాలనీల్లో 35 లక్షల మంది నివసిస్తున్నారు. ఇందులో 90 శాతం పేదలే ఉన్నారు. 70 శాతం మంది పండ్లు, ఫుట్ పాత్‌పై వ్యాపారం, దినసరి కూలీలు, పంక్చర్లు చేయడం, ఆటోలు, రిక్షాలు

తోలుతూ జీవనం సాగిస్తున్నారు. చిరు వ్యాపారులు తమ వ్యాపార, కుటుంబ అవసరాల కోసం ఎక్కువగా డబ్బులు వడ్డీలకు తీసుకుంటూ ఉంటారు. కొందరు రోజువారీ చెల్లింపులకూ అధిక వడ్డీకి తీసుకుంటారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వడ్డీ వ్యాపారులు వడ్డీ, చక్రవడ్డీ, బారువడ్డీ పేరుతో ముక్కు పిండివసూలు చేస్తున్నారు. ఉదాహరణకు ఓ చిరు వ్యాపారి ఉదయం రూ.1000 అప్పు తీసుకుంటే అదే రోజు రాత్రి వడ్డీతో కలిపి రూ.1200 నుంచి రూ.1500 ఇవ్వాల్సి ఉంటుంది. ఆరోజు వ్యాపారం సాగక మరుసటి రోజు చెల్లిస్తే వడ్డీతో పాటు బారు వడ్డీగా వెయ్యి రూపాయలకు రూ.1500 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఆటో డ్రైవర్లు సొంతంగా ఆటోలు తీసుకునేందుకు 50వేల నుంచి 70వేల వరకూ అప్పు తీసుకుంటే ప్రతి రోజూ రాత్రి ఎనిమిది గంటలకల్లా రూ.1200 చెల్లించాలి. ఇందులోనూ షరతులు ఉంటాయి. అప్పు తీసుకున్న డ్రైవర్ ఏదైనా అనారోగ్యానికి గురైనా ఆ రోజు డబ్బులు ఇవ్వాల్సిందే. లేకపోదే ఆటో తీసుకెళ్లి పోతున్నారు. ఇలాంటి ఘటనలు పాతబస్తీలో అనే కం. ఆడపిల్లల పెండ్లిండ్ల కోసం కూడా చాలా మంది వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇంటి దస్తావేజులు తనఖా పెట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ అప్పు తీసుకుంటారు. అప్పు ఇచ్చేటప్పుడు ఫైనాన్షియర్లు ఆయా వ్యక్తులతో ప్రామిసరి నోటుపై అనేక షరతులతో రాయించుకుంటున్నారు. డబ్బు అవసరం కాబట్టి.. వారు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టేస్తున్నారు. ఆరు నెలల్లోపు అప్పుతో పాటు వడ్డీ, చక్ర వడ్డీ చెల్లించాల్సిందే. గడువు ముగిసినా అప్పు చెల్లించకపోతే బాధితులు తనఖా పెట్టిన ఇల్లును తమపేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. ఇలా అనేక మంది అప్పులు చెల్లించలేక తమ ఇండ్లు పోగొట్టుకున్నారు.

అప్పులిచ్చేటోళ్లదే రాజ్యం ..!

అప్పులిచ్చే ఫైనాన్షియర్లలో అత్యధికంగా మజ్లిస్ పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. పార్టీ పేరుకుని అడ్డుపెట్టుకున్న కొందరు తమ వ్యాపారాన్ని యథేచ్చగా సాగిస్తున్నారు.

పోలీసులను సైతం వారు మేనేజ్ చేస్తున్నారనే విమర్శలున్నాయి. వడ్డీ వ్యాపారికి వ్యతిరేకంగా బాధితులెవరైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయరనే విమర్శలున్నాయి. చాలామంది ఫిర్యాదు చేయడానికెళ్లినా వ్యాపారుల బెదిరింపులతో వెనక్కి తగ్గుతున్నట్టు తెలుస్తోంది.

50 వేల మంది వరకూ ..

వడ్డీ వ్యాపారస్తులతో ఇబ్బందులు పడిన వారు గడిచిన పదేండ్ల కాలంలో 50 వేల నుంచి లక్ష మంది వరకు ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులకు మాత్రం 400 ఫిర్యాదులు అందాయి. చాలా మంది బాధితులు ఫిర్యాదు చేస్తే లేనిపోని గొడవలు వచ్చి పడతాయని భావించి బస్తీలను వదిలి పోతున్నారని పోలీసులు చెబుతున్నారు.

'పార్లమెంట్'కు సిద్ధం కండి

సీఎస్, సీఈఓ, డీజీపీలతో సీఈసీ

- త్వరలో రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల పరిశీలనాబృందం
- ఫిబ్రవరి 22న ఓటర్ల తుది జాబితా
- ఎన్నికల సరిహద్దు రాష్ట్రాలతో 5న సమావేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని తెలిపింది. లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై సోమవారం ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి సునిల్ అరోరా వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారులు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కెజోషి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్, ఎన్నికల అధికారులు ఆమ్రపాలి, సత్యవాణి, డీజీపీ మహేందర్‌రెడ్డి, అడిషనల్ డీజీ జితేందర్, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు సోమేశ్‌కుమార్, రాజీవ్ త్రివేది, ఐటీ అధికారి సతీష్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ గతేడాది డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికలను నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికలయ్యే ఖర్చును విడుదల చేస్తామని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను ఫిబ్రవరి 22న విడుదల చేస్తామని తెలిపారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు. రెండు దశల పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయని, మూడవ దశ ఈ నెల 30న ముగుస్తుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలను కూడా ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన చత్తీస్‌గడ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఎలాంటి ఘటనలైనా ఎదుర్కొనడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. త్వరలోనే అంతరాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల కేసును పరిష్కరించడానికి చర్యలు, సమాచార మార్పిడి తదితర అంశాలపై వివరించారు. శాసనసభ ఎన్నికల నిర్వహణ కోసం పొరుగు రాష్ట్రాలకు చెందిన 19వేల మంది, కేంద్ర నుంచి 276 కంపెనీల పోలీసు సిబ్బందిని కేటాయించారని, అదే స్థాయిలో పార్లమెంట్ ఎన్నికలకు కేటాయించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు రవాణను అడ్డుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ - రజత్‌కుమార్

రాష్ట్రంలో ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని సీఈఓ రజత్‌కుమార్ చెప్పారు. ఇప్పటి వరకు 16లక్షల అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. పంచాయతీ ఎన్నికలు ఉన్నందున గడువును ఫిబ్రవరి 4వ తేదీ వరకు పొడగించామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కొరత లేదన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లో అవసరమైన రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉన్నారని తెలిపారు. అన్ని జిల్లాలో టోల్ ఫ్రీ నెంబర్ 1950 ఏర్పాటు చేశామన్నారు. ఇతర సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఎన్నికల పరిశీలన బృందం రాక

రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల పరిశీలనా బృందం త్వరలో రానున్నదని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి సునిల్ అరోరా తెలిపారు. పరిశీలన అనంతరం పార్టీల అభిప్రాయసేకరణ తీసుకుంటామని చెప్పారు.

'పూర్తి స్థాయి బడ్జెట్ రాజ్యాంగ విరుద్ధం'

న్యూఢిల్లీ: దేశంలో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మోడీ ప్రభుత్వం పార్లమెంటులో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి సమయంలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే హక్కు కేంద్రానికి లేదని బీజేపీ మాజీ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా అన్నారు. ఒకవేళ మధ్యంతర బడ్జెట్‌ను కాదని పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెడితే అది అనైతికం, రాజ్యాంగ విరుద్ధం అని యశ్వంత్‌సిన్హా అన్నారు. ఇది రాబోయే సాధారణ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని చెప్పారు. సాధారణంగా ఎన్నికలు జరిగే ఏడాదిలో ప్రభుత్వాలు మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండటం ఆనవాయితీగా వస్తున్నది. అయితే ఇది తప్పనిసరి ఏంకాదు. దేశం ఏడుశాతం వృద్ధిరేటులో ఉన్నప్పటికీ వ్యవసాయ, నిరుద్యోగ సమస్యలు ఇంకా ఎందుకున్నాయని ఆయన ప్రశ్నించారు. ఆర్థిక మంత్రిగా యశ్వంత్‌సిన్హా గతంతో ఏడు బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 31 నుంచి బడ్జెట్ సెషన్స్ ప్రారంభమవనున్నాయి.


సెన్సెక్స్ ▼369 35,656

నిఫ్టీ ▼119 10,661

డాలరుకు రూపాయి విలువ 71.10



బంగారం(10.గ్రా) రూ. 32,478




వెండి (కేజీ) రూ. 39,050



కోడిగుడ్లు (వందకి)

హైదరాబాద్	418	విజయవాడ	423
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	420	ముంబయి	473



సరసమైన ధరలతో శాంసంగ్ కొత్తఫోన్లు



న్యూఢిల్లీ: భారత మొబైల్ మార్కెట్‌లో వెనుకబడిపోతున్న శాంసంగ్ అత్యాధునిక ఫీచర్లతో గెలాక్సీ ఎం సరీస్‌లో రెండు కొత్త స్మార్ట్‌ఫోన్లను విపణిలోకి తెచ్చింది. ఇక్కడ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో శాంసంగ్ గెలాక్సీ ఎం10, ఎం20 పేరుతో ఈ స్మార్ట్‌ఫోన్లను తీసుకొచ్చింది. యువతను ఆకర్షించడమే లక్ష్యంగా అధునాతన ఫీచర్లతో సరసమైన ధరలకు శాంసంగ్ ఈ ఫోన్లను విడుదల చేసింది. ఇన్ఫినిటీ డిస్‌ప్లే, టాప్‌లో వి నాచ్, డ్యుయల్ కెమెరా, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ(ఎం2) ఈ ఫోన్ల ప్రత్యేకత. శాంసంగ్ గెలాక్సీ ఎం10 పూర్తి బడ్జెట్ స్మార్ట్‌ఫోన్. 6.22 అంగుళాల హెచ్‌డీం డిస్‌ప్లే, శాంసంగ్ ఎగ్జినోస్ 7870 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ ఓరియో 8.1, 2జీబీ/3జీబీ ర్యామ్, 16జీబీ/32జీబీ ఇంటర్నల్ స్టోరేజ్, మైక్రో ఎస్డీ కార్డు సాయంతో 512 జీబీ వరకూ మెమొరీ పెంచుకునే సదుపాయం, వెనుకవైపు 13.5మెగా పిక్సెల్ కెమేరా, ముందువైపు 5 మెగా పిక్సెల్ కెమేరా, 3,400 ఎంఏహెచ్ బ్యాటరీ, మైక్రో యూఎస్‌బీ ఈ ఫోన్ ప్రత్యేకతలు. ఈ ఫోన్‌ధరను రూ.7990 నుంచి రూ.8,990గా నిర్ణయించారు. ఇక మిడ్ రేంజ్‌లో గెలాక్సీ ఎం20 పేరుతో మరో మొబైల్‌ను కూడా శాంసంగ్ విడుదల చేసింది. 6.3 ఫుల్‌హెచ్‌డీం డిస్‌ప్లే, శాంసంగ్ ఎగ్జినోస్ 7904 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ ఓరియో 8.1, వెనుకవైపు 13.5మెగాపిక్సెల్ కెమెరాలు, ముందువైపు 8మెగాపిక్సెల్ కెమెరా విత్ పోట్రెయిట్ మోడ్, 5000 ఎంఏహెచ్ భారీ బ్యాటరీ, దీనిలో 3జీబీ ర్యామ్/32జీబీ ఇంటర్నల్ స్టోరేజ్, 4జీబీ ర్యామ్/64జీబీ మెమొరీ వేరియంట్లలో ఇది లభిస్తుంది. వీటి ధరలు వరుసగా రూ.10,990, రూ.12,990గా నిర్ణయించారు. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి శాంసంగ్ ఆన్‌లైన్‌స్టోర్‌తో పాటు అమెజాన్ ఇండియాలోనూ వీటిని విక్రయించనున్నట్టుగా కంపెనీ వర్గాలు తెలిపాయి.

జియో ఫోన్లలో రైల్వే టిక్కెట్ల యాప్



న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా జియో ఫోన్ వినియోగదారుల మరింత ఆదరాభిమానాలను చూరగొనేందుకు టెలికాం కంపెనీ రిలయన్స్ జియో మరో సరికొత్త అప్లికేషన్‌తో ముందుకు వచ్చింది. ప్రస్తుతం రైలు టిక్కెట్‌లను బుక్ చేసుకునేందుకు ఉపయోగిస్తున్న ఐఆర్‌సీటీసీ యాప్ లాగే సేవలందించేందుకు 'జియో రైల్' యాప్‌ను కంపెనీ అందుబాటులోకి తెచ్చింది ఈ యాప్ ఉపయోగించుకొని వినియోగదారులు డెబిట్, క్రెడిట్ కార్డులు, ఈ- వాలెట్‌ల ద్వారా రైలు టికెట్‌లను బుక్ చేసుకోవచ్చు. రైళ్ల రాకపోకలకు సంబంధించిన సమాచారం, పీఎన్‌ఆర్ స్టేటస్, సీట్ల లభ్యత, టిక్కెట్‌ల రద్దు వంటి సేవలను ఈ యాప్‌లో పొందుపరిచారు. అంతేకాకుండా చివరి నిమిషాల్లో ప్రయాణం కోసం బుక్ చేసుకునే తత్కాల్ టికెట్‌లకు కూడా ఈ యాప్‌ను ఉపయోగించి బుక్ చేసుకోవచ్చు. ఒకవేళ వినియోగదారులకు ఐఆర్‌సీటీసీ ఖాతా లేకపోయినప్పటికీ 'జియో రైల్' యాప్‌లో కొత్త ఖాతా సృష్టించుకోవచ్చు. ఈ అప్లికేషన్ 'జియో యాప్ స్టోర్'లో వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆర్బీఐ చర్యలు అర్థవంతమైనవే..!

ఫిబ్రవరి 12 నోటిఫికేషన్‌తో బ్యాంకింగ్‌కు మేలే

- డిఫాల్టులు తగ్గుముఖం పట్టాయి..
- కార్పొరేట్‌ల కాకి వాదనలు తప్పు..
- 'మెమో' రూపొందించిన పెద్ద బ్యాంక్



ముంబయి: బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) సమస్య పరిష్కారానికి భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) అమలులోకి తెచ్చిన కఠినమైన విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇప్పుడు ఇదే విషయాన్ని ఆధారాలతో సహా వెల్లడిస్తూ తన వైఖరి సరైదేనని నిరూపించుకొనేందుకు పెద్ద బ్యాంక్ ఆర్బీఐ సన్నద్ధమవుతోంది. నిరర్థక ఆస్తులను కట్టడి చేసేందుకు ఆర్బీఐ వివిధ ఇతర చర్యలతో పాటు గతేడాది ఫిబ్రవరి 12న ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డిఫాల్టుగా మారిన రుణాలను 'స్పెషల్ మెన్షన్ అకౌంట్స్'గా విభజించాలని సూచించింది. వీటిలో రూ.2000 కోట్లు అంతకంటే పైబడిన రుణాలను కలిగిన వ్యక్తులు లేదా సంస్థలు డిఫాల్టుగా మారిన 180 రోజుల లోపు కంపెనీ రుణ విమోచన స్పష్టత ప్రణాళిక ఒక కొలిక్కి తేవాలని సూచించింది. అలాకాని నేపథ్యంలో వాటిపై దివాలా దరఖాస్తును నమోదు చేయాలని సూచించింది. అయితే ఈ నోటిఫికేషన్‌పై అప్పట్లో తీవ్ర దుమారం రేగింది. ప్రభుత్వంలోని చాలా మంది పెద్దలతో సహా పారిశ్రామికవేత్తలు బ్యాంకులకు బకాయి పడ్డ బడాబాబులు దీనిని తీవ్రంగా ఆక్షేపించారు. దీనిపై వారు న్యాయ పోరాటనికి వెళ్లారు. ఒక డిఫాల్టు కేసుపై దివాలా చట్టాన్ని ప్రయోగించడం అనే విషయంలో రుణాలిచ్చిన బ్యాంకులకే అధికారాలు ఇవ్వాలని.. బ్యాంకుల నియంత్రణ సంస్థ ఆర్బీఐ ఇందులో జోక్యం చేసుకోవడం ఏమిటి? అని వారు ప్రశ్నిస్తూ న్యాయస్థానాల్ని ఆశ్రయించారు. ఇదే విషయమై ప్రభుత్వ నుంచి ఒత్తిడి రావడంతో అప్పటి ఆర్బీఐ గవర్నర్ తన పదవికి అకస్మికంగా రాజీనామా సమర్పించిన విషయం కూడా తెలిసిందే. ఈ విషయం ఇటు ప్రభుత్వ పెద్దలతో పాటు.. బడా కార్పొరేట్ సమస్యలకు కూడా చికాకు తెప్పించింది. అయితే ఇప్పటికి ఈ అంశం సుప్రీం కోర్టుకు కూడా చేరింది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు బ్యాంకు లకు సంబంధించిన ఐబీసీకి ఉన్న రాజ్యాంగ అధికారాలను ఎంటనే విషయాన్ని ప్రశ్నించింది. దీనికి తోడు ఫిబ్రవరి 12 నోటిఫికేషన్‌కు సంబంధించి వివిధ కోర్టుల్లో ఉన్న కేసులన్నింటినీ ఒకే కేసు కిందకు మార్చుతూ తన నిర్ణయాన్ని వెల్లడించింది.

విమర్శలకు నోళ్లు మూయించేలా..

వివాదాస్పదంగా మారిన ఆర్బీఐ నోటిఫికేషన్‌పై సుప్రీం కోర్టు ఎలాంటి నిర్ణయాన్ని వెల్లడించనుందోనని ఇటు కార్పొరేట్‌లు, ఆటు బ్యాంకులు ఎదురు చూస్తున్న వేళ పెద్ద బ్యాంక్ కోర్టుకు తన వైఖరి సరైందేనని నిరూపించుకొనేలా బ్రహ్మాస్త్రాన్ని రూపొందించుకుంటున్నట్టుగా సమాచారం. కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేసినప్పటి నుంచి బ్యాంకులకు కార్పొరేట్లు, బడాబాబులు జంకుతో రుణాలను చెల్లించేందుకు ముందుకు వచ్చారని.. తద్వారా బ్యాంకుల బకాయిల మొత్తం తగ్గుతూ వస్తోందంటూ వెల్లడించేలా ఆర్బీఐ ఒక మెమోను రూపొందిస్తున్నట్టుగా సమాచారం. ఇందులో వాస్తవాలను బేరీజు వేస్తూ పరిస్థితిలో మార్పును పెద్ద కోర్టుకు వెల్లడించేలా ఆర్బీఐ వ్యూహాన్ని తయారు చేసింది. దీంతో కోర్టులో సర్కారు చర్య సరైనదేనని నిరూపించేలా పత్రాలను రూపొందిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇందుకు గాను భారత అతిపెద్ద రేటింగ్ సంస్థ క్రిసిల్ నివేదికను సాక్ష్యంగా చూపనున్నట్టుగా సమాచారం. దీంతో ఎన్‌పీఏపై ఆర్బీఐ చర్యలను తప్పుబడుతున్న కార్పొరేట్‌లతో, పారిశ్రామిక వర్గాలు, సర్కారులోని కార్పొరేట్‌ల నోరు మూయించాలన్నది ఆర్బీఐ ఎత్తుగడగా కనిపిస్తోంది.

బ్యాంక్‌ల బాస్‌లతో శక్తికాంత భేటీ



భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల బాస్‌లతో భేటీ అయ్యారు. ఫిబ్రవరి 7వ తేదీన ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ ఆరో పరపతి విధాన సమీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థ పనితీరును సమీక్షించేందుకు గాను ఆయన బ్యాంకుల అధినేతలతో సమావేశం అయినట్టుగా సమాచారం. ఈ సమావేశంలో బ్యాంకుల నుంచి ప్రభుత్వం ఎలాంటి సహకారాన్ని ఆశిస్తోందో అనే విషయాన్ని ప్రధానంగా చర్చించినట్టుగా సమాచారం. "బ్యాంకింగ్ రంగం నుంచి ఆర్‌బీఐ ఏమి ఆశిస్తోందో వారికి తెలియజెప్పడం కోసం మేము భేటీ అయ్యాము. దీంతోపాటు ప్రస్తుత, భవిష్యత్తు అంశాలపై చర్చించాము" అని శక్తికాంత దాస్ సమావేశం అనంతరం వెల్లడించారు. దీంతో పాటు ప్రస్తుత, భవిష్యత్తు అంశాలపై చర్చించామని సమావేశం అనంతరం శక్తికాంత్ దాస్ వెల్లడించారు. ఫిబ్రవరి 7న జరగనున్న ఆర్బీఐ పరపతి విధాన సమీక్షా సమావేశం ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంత ఆధ్వర్యంలో జరగనున్న మొదటి పరపతి విధాన సమీక్ష. ఈ నేపథ్యంలో ఆయన బ్యాంక్‌ల అధినేతలతో సమావేశమై కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. మరోవైపు ఈ పరపతి సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించనుందని విశ్లేషకులు భావిస్తున్నందును ఈ సమావేశం అటు మార్కెట్ వర్గాల దృష్టిని ఆకర్షించింది. ఆర్థికం ఎదుర్కొంటున్న సవాళ్లు, ఐసీఐసీఐ -వీడియోకాన్ కుంభకోణంలో బ్యాంకు మాజీ సీఈవో చందాకొచ్చర్‌పై కేసు నమోదు, దాదాపు సగానికిపైగా బ్యాంకులు ఆర్‌బీఐ సత్వర దిద్దుబాటు చర్యలు (పీసీఏ) తదితర ఆంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్టుగా తెలుస్తోంది.

దేశీయ మార్కెట్లలో దిద్దుబాటు!



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు కొత్త ట్రేడింగ్ వారం తొలిరోజైన సోమవారం తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ఉన్నప్పటికీ దేశీయంగా అమ్మకాల ఒత్తిడినెదురొన్నాయి. మిడ్ సెషన్‌నుంచి ఊపందుకున్న అమ్మకాలు చివరి వరకూ కొనసాగాయి. ఐసీఐసీఐ బ్యాంక్ విచారణకు సంబంధించిన సమాచారాన్ని లీక్ చేస్తున్నారన్న అభియోగంపై ఆ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారి ఒకరిని సీబీఐ బదిలీ చేయడం, ఎఫ్ఐఐలు రికార్డు స్థాయిలో స్టాక్స్ విక్రయాలకు దిగడం, ఎన్నికల నేపథ్యంలో ప్రజాకర్షక పథకాల గురించి ప్రభుత్వం అధిక మొత్తంలో ఖర్చు చేయనుందన్న వార్తలకు తోడు మారుతీ సుజుకీతో సహా పలు పెద్ద సంస్థలు పేలవమైన ప్రదర్శనను కనబరిచాయన్న వార్తల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రతికూలతల నేపథ్యంలో మార్కెట్లపై చివరి వరకు అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. దీంతో సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 368 పాయింట్లు నష్టపోయి 35,656 పాయింట్ల వద్ద, నిఫ్టీ 119 పాయింట్లు నష్టపోయి 10,661 పాయింట్ల వద్ద ముగిశాయి. ముఖ్యంగా అదానీ గ్రూపు షేర్లు 10శాతం కుప్ప కూలాయి. ఇంకా మిడ్ క్యాప్ ఇండెక్స్ (2.10శాతం), నిఫ్టీ బ్యాంకు (1.7శాతం) హెల్త్‌కేర్ ఇండెక్స్ (శాతం) నష్టాలు మార్కెట్లను ప్రభావితం చేశాయి. ఫార్మా, మెటల్, ఆటో, ఎనర్జీ, పవర్ అండ్ గ్యాస్ సెక్టార్లలో భారీగా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మీడియా విభాగం మాత్రం స్వల్పంగా లాభపడింది. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఫైనాన్స్‌లు నష్టపోయాయి. టీసీఎస్, ఎల్‌అండ్‌టీ, కోల్ ఇండియాలు లాభపడ్డాయి. ముఖ్యంగా ఐసీఐసీఐ బ్యాంక్ వరుసగా ఎనిమిదో ట్రేడింగ్ సెషన్‌లో కూడా నష్టాలను మూటగట్టుకుంది. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఈ షేరు 5శాతం నష్టంతో భారీగా చేతులు మారింది. చివరికి 4శాతం నష్టంతో 343.45 వద్ద ట్రేడింగ్ ముగిసింది. మరోపక్క జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు 17శాతం లాభంతో ముగిసింది. భారత మార్కెట్లలో నుంచి ఎఫ్ఐఐలు అమ్మకాలను కొనసాగిస్తున్నారు. జనవరి నెలలో ఇప్పటి వరకు నికరంగా రూ.5,000 కోట్ల పెట్టుబడులను వాపస్ తీసుకొన్నారు. ఈ ట్రెండ్ మార్కెట్లలో కొనసాగవచ్చని నిపుణులు చెబుతున్నారు. గత నెలలో రూ.5,900 కోట్ల పెట్టుబడులు పెట్టగా.. రూ.3,143 కోట్ల మేరకు పెట్టుబడులను వెనక్కి తీసుకొన్నారన్న వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

సుజుకీ నుంచి 7.5 లక్షల కొత్త బైక్



న్యూఢిల్లీ: సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా కొత్త భారత్‌లోని యువత కోసం మరో ప్రీమియం మోటార్ బైక్‌ను మార్కెట్లోకి ఆవిష్కరించింది. అడ్వెంచర్ టూరర్ బైక్ వి-స్ట్రామ్ 650ఎక్స్‌టీ ఏబీఎస్(2019) ను సోమవారం మార్కెట్లోకి విడుదల చేసింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ బైక్ ధరను కంపెనీ రూ.7.46 లక్షలుగా (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. కొత్త గ్రాఫిక్స్, అదనపు ఫీచర్లతో వి-స్ట్రామ్ కొత్త వెర్షన్ భారతీయ వినియోగదారులకు అద్భుతమైన అడ్వెంచర్ అనుభూతిని అందిస్తుందని సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా ఎండీ సతోషి ఉచిడా వెల్లడించారు. గత ఏడాది లాంచ్ చేసిన ఈ వి- స్ట్రామ్ మోటార్ సైకిల్‌కు మంచి ఆదరణ లభించిందనీ, ఇపుడు కూడా అదే స్పందన లభిస్తుందని తాము ఆశిస్తున్నామన్నారు. లైట్ వెయిట్ యాంటీ లాక్ బ్రేక్ సిస్టమ్.. రహదారిపై పట్టును కోల్పోకుండా చేస్తుందని పేర్కొన్నారు.

రంగనాయకమ్మ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిజామాబాద్ జిల్లాకు చెందిన సీపీఎం(ఎం) సీనియర్ నేత ప్రకాశ్‌రావు జీవిత భాగస్వామి రంగనాయకమ్మ గత సోమవారం కన్నుమూశారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని అరుణ్ అపార్ట్‌మెంటు వద్ద ఆమె సంస్మరణ సభ జరిగింది. సభకు వారి కుమారుడు అమర్‌నాథ్ అధ్యక్షత వహించారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి కె రమేష్, ఉపాధ్యాయ, ఉద్యమ సీనియర్ నాయకులు ఎం నరహరి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు దుర్గాభవాణి తదితరులు నివాళులర్పించారు. ఆమె ప్రత్యక్షంగా ప్రజాఉద్యమంలో భాగస్వామి కాకపోయినప్పటికీ ఉద్యమాల్లో పాల్గొనే నాయకులు, కార్యకర్తలకు తోడ్పాటునందిస్తూ వారిని ప్రోత్సహిస్తూ పార్టీకి సేవలందించారని వారు కొనియాడారు.

అవినీతి కేసులో ఎస్ఎస్‌సీ అదనపు జాయింట్ సెక్రెటరికి జైలు శిక్ష

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

ఆదాయానికి మించి ఆస్తులు గడించిన కేసులో రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డు అదనపు జాయింట్ సెక్రెటరి అట్లూరి ధనకోటేశ్వరరావుకు ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు జైలు శిక్షను విధించింది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ జె.పూర్ణచంద్రరావు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. కోటేశ్వరరావుపై ఆదాయానికి మించి ఆస్తులను గడించారని వచ్చిన ఆరోపణలు వచ్చాయి. దీనిపై రాష్ట్ర ఏసీబీ దర్యాప్తు జరిపి 2007లో ఆయన ఆస్తులపై ఆకస్మిక దాడులను నిర్వహించింది. ఈ దాడుల్లో 34 లక్షల 18 వేల రూపాయల మేరకు ఆదాయానికి మించి ఆస్తులను కోటేశ్వరరావు కలిగి ఉన్నట్టు ఏసీబీ దర్యాప్తులో తేల్చింది. ఈ మేరకు దర్యాప్తును పూర్తి చేసి 2010లో కోటేశ్వరరావుపై కోర్టులో ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. దాదాపు ఎనిమిదేండ్ల పాటు ఈ కేసుపై కోర్టులో విచారణ సాగింది. చివరికి కోటేశ్వరరావును దోషిగా తేల్చిన ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు జడ్జి శైలజ.. ఆయనకు రెండేండ్ల జైలు శిక్షతో పాటు 10వేల రూపాయల జరిమానాను విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల పాటు జైలు శిక్షను అనుభవించాలని ఆదేశించారు.

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి : రావుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పలు జిల్లాలో పంటలను నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు అమ్మకానికి తెచ్చిన ధాన్యం, కంది, మిర్చి రాసులు తడిసిముద్దయ్యాయని, పంటలను తడవకుండా కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అధికారులు వర్ష ప్రభావిత గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, కాలయాపన చేయకుండా రైతులకు పరిహారం అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

ఈసారైనా విద్యకు ప్రగతి వచ్చేనా?

ఏటా తగ్గుతున్న నిధుల కేటాయింపు

- జీతాలు, పథకాల అమలుకూ సరిపోని వైనం
- వచ్చే బడ్జెట్‌పైనే ఆశలన్నీ

బలహీనమవుతున్న సర్కారు విద్యాసంస్థలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగున్నరేండ్లలో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలొచ్చాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగానికి ఇచ్చిన ప్రాధాన్యత కూడా టీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదన్న విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ నాలుగున్నరేండ్లలో సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకే ప్రాధాన్యత దక్కింది. టీఆర్ఎస్ రెండో సారి అధికారంలోకి వచ్చింది. ఈసారైనా విద్యారంగానికి ప్రాధాన్యత దక్కుతుందా?, విద్యారంగం ప్రగతికి నోచుకుంటుందా?అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఈ హయాంలో విద్యావైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత దక్కుతుందని అధికారులు, విద్యావేత్తలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2019-20 బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపులు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. దీంతో వచ్చే బడ్జెట్‌పై ఆశలు పెరిగాయి. విద్యారంగానికి నిధుల కొరత ఉండబోదన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలుస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని తెలంగాణ ఉద్యమ సమయంలో నాయకులంతా విమర్శించారు. కానీ తెలంగాణ వచ్చినా విద్యారంగానికి సరైన ప్రాధాన్యత దక్కలేదన్న ఆరోపణ వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలోనే టీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని బడ్జెట్ కేటాయింపుల్లోనే అది చూపాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. అందుకే వచ్చే బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత ఉంటుందని అందరూ ఆశిస్తున్నారు.

నిధులుంటేనే విద్యారంగం అభివృద్ధి

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగానికి కేటాయించే నిధులు ఏటా తగ్గుతూనే ఉన్నాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులు ఉపాధ్యాయుల జీతాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకూ సరిపోవడం లేదని అధికారులే పెదవి విరుస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులు ఏటా తగ్గడమే ఇందుకు నిదర్శనం. 2014-15 ఆర్థిక సంవత్సరంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో విద్యారంగానికి మొత్తం రూ.1,00,637 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.10,956 (10.88 శాతం) కోట్లు కేటాయించింది. ఇక 2015-16లో రూ.1,15,689 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.11,216 (9.69 శాతం) కోట్లను కేటాయించింది. అంటే 1.19 శాతం నిధులు తగ్గాయి. ఆ తర్వాత 2016-17లో మొత్తం రూ.1,30,415 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.10,738 (8.23 శాతం) కోట్లు ప్రతిపాదించింది. అప్పుడూ 1.46 శాతం నిధులు తగ్గించింది. ఇక 2017-18లో మొత్తం రూ.1,49,646 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.12,705 (8.49 శాతం) నిధులు కేటాయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 0.26 శాతం నిధులను పెంచడం గమనార్హం. ఇక 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన మొత్తం రూ.1,74,453 కోట్లలో విద్యకు రూ.13,278 (7.61 శాతం) నిధులను కేటాయించింది. గత బడ్జెట్‌లో కన్నా ఎక్కువ నిధులు కేటాయించినట్టుగానే కనిపిస్తున్నది. అంటే అంకెల్లో నిధులు పెరిగాయి. కానీ వాస్తవంగా గణాంకాలను పరిశీలిస్తే నిధులు తగ్గడం గమనార్హం. 2017-18లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కన్నా 2018-19లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 0.88 శాతం నిధులు తగ్గాయి. బోధన, బోధనేతర సిబ్బంది జీతాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకే ఈ నిధులు సరిపోవడం లేదని అధికారులే చెప్తున్నారు. దీంతో 2019-20 బడ్జెట్‌లోనైనా విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తుందని అధికారులు భావిస్తున్నారు. సరిపోయినన్ని నిధులుంటేనే విద్యారంగం అభివృద్ధి చెందుతుందని విద్యావేత్తలు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిధులు తగ్గిస్తుండడంతో ప్రభుత్వ విద్యారంగం బలహీనమవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకోవైపు ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్ల జీతాలకే నిధులు కేటాయించడంతో కొత్త ఉపాధ్యాయులకు నిధులు కేటాయించనందున నియామకాల ప్రక్రియ ఆలస్యమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాఠశాల విద్యకు రూ.13 వేల కోట్లు అవసరం

రాష్ట్ర ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ ప్రతిపాదనలపై కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఆర్థిక శాఖ బడ్జెట్ ప్రతిపాదనలు పంపాలని వివిధ శాఖలను నిర్దేశించింది. దీంతో పాఠశాల విద్యారంగానికి వచ్చే బడ్జెట్‌లో రూ.13 వేల కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇందులో ఉపాధ్యాయుల జీతాలకు రూ.10 వేల కోట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు రూ.3 వేల కోట్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పాఠశాల విద్యారంగానికి రూ.10,321 కోట్లు అవసరం. కానీ ప్రభుత్వం రూ.9,482 కోట్లు ప్రతిపాదించడం గమనార్హం. అంటే అవసరమున్నప్పటికీ రూ.839 కోట్లు తక్కువగా కేటాయించింది. వచ్చే బడ్జెట్‌లో పాఠశాల విద్యారంగానికి అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అటవీ చట్టాలకు మరింత పదును

సాయుధ సిబ్బందితో 54 చెక్‌పోస్టులు


- వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌కే జోషి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అటవీ నేరస్తులు ఇకపై అడవుల్లోకి అడుగు పెట్టాలంటేనే భయపడేలా అటవీ, పోలీసు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్.కే. జోషి ఆదేశించారు. అడవుల రక్షణ, సంబంధిత నేరాల అదుపుపై కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్, అటవీశాఖ అధికారులు, సిబ్బందితో చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. హరితహారంతో అడవుల బయట, కఠిన చర్యలతో అడవి లోపల పచ్చదనాన్ని రక్షించుకోవాలన్నారు. అటవీ ప్రభావిత జిల్లాల్లో వెంటనే సాయుధ బలగాలతో 54 చెక్ పోస్టుల ఏర్పాటుకు ఆదేశించారు. అటవీ నేరాల నియంత్రణకు త్వరలో కఠిన చట్టం తెస్తామన్నారు. ఫిబ్రవరి ఆరుకల్లా ప్రతీ జిల్లాలోనూ అటవీ రక్షణ కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలీస్ ఇంటెలిజెన్స్ వ్యవస్థను కూడా ఉపయోగిస్తామని, ఇన్‌ఫార్మర్ల వ్యవస్థను పటిష్ఠం చేస్తామని అన్నారు. డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓలు కలిసి ఒక టీమ్ గా అటవీ నేరాలను అరికట్టేందుకు పనిచేయాలన్నారు. అడవులపై నిరంతరం నిఘా కోసం సాయుధ పోలీసుల పహారా ఉంటుందన్నారు.

తరచుగా అటవీ నేరాలకు పాల్పడే నేరస్తులను జియో ట్యాగింగ్ చేస్తామన్నారు. కలప కోత మిల్లులపై నిఘాపెడతామన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మంచి అడవిని కాపాడటం ఒక ఎత్తు అయితే, క్షీణించిన అడవులను పునరుద్ధరించుకోవటం మరో ఎత్తు అన్నారు. అటవీ శాఖ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. అదిలాబాద్ జిల్లాలో ముల్తానీలను కలప స్మగ్లింగ్ నుంచి దూరం చేసేందుకు పునరావాస ప్యాకేజీని వెంటనే ఆమోదిస్తామన్నారు. అధికారుల స్థాయిలో అటవీ రక్షణ కమిటీలు, గ్రామ స్థాయిలో హరిత రక్షక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. పీసీసీఎఫ్ పీ.కె.ఝా మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసుల సహకారంతో అటవీ ఆక్రమణలు జరగకుండా చూస్తామని, వన్యప్రాణుల వేటపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, అడిషనల్ డీజీ జితేందర్, ఐజీ లు నాగిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, పీసీసీఎఫ్ విజిలెన్స్ రఘువీర్, అదనపు పీసీసీఎఫ్‌లు మునీంద్ర, లోకేష్ జైస్వాల్, డోబ్రియల్, తిరుపతయ్య, స్వర్గం శ్రీనివాస్, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు.



పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం

స్తంభం నీడ శివలింగంపై..

జనవరి 5, 6 తేదీలలో రాజమండ్రి శ్రీ వీరేశలింగం థీస్టిక్ కాలేజిలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు జరిగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా చరిత్ర కాంగ్రెస్ మాత్రం ఉమ్మడి సంస్థగానే కొనసాగుతున్నది. రెండు ప్రాంతాల చరిత్రకారులు, పరిశోధకులు ఎప్పటిలాగే ఈ చరిత్ర సదస్సుకి హాజరై తెలుగువారి చరిత్ర, సంస్కృతులపై తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ వ్యాస రచయిత కూడా 'నవతెలంగాణ' తరఫున ఈ సమావేశాల్లో పాల్గొని 'సమ్మక్క జాతర'పై పరిశోధనా వ్యాసం సమర్పించాడు. తెలుగువారి చరిత్ర, సంస్కృతులపై చరిత్రకారులు చెప్పిన విలువైన విషయాలే కాకుండా, భారత దేశం గర్వించదగిన గొప్ప సంఘసంస్కర్త వీరేశలింగం పంతులు జీవితంతో ప్రత్యక్షంగా ముడివడి ఉన్న ప్రదేశాలను చూసిన ఆనందం కలిపితే ఈ వ్యాసం అయింది.

చరిత్ర, సంస్కృతులు ఉమ్మడి ఆస్తులు



కొవ్వూర్... కొవ్వూర్ అంటూ బస్ కండక్టర్ పెద్దగా అరవడంతో ఒక్కసారిగా మెలకువ వచ్చింది. కండ్లు తెరచి చూసేటప్పటికి మసక మసక చీకటిని చీల్చుకుంటూ సూర్యుడు పైకిలేస్తున్నాడు. కొవ్వూరులో ఒకరిద్దరు ప్రయాణీకులు దిగిన తర్వాత బస్ మళ్లీ బయలుదేరింది. గోదావరి అవతల రాజమండ్రి, ఇవతల కొవ్వూరు. బస్ గోదావరిపై కట్టిన పొడవైన వంతెనపైగుండా రాజమండ్రివైపుకు పరుగులు తీస్తున్నది. రాజమండ్రిపై ఉదయిస్తున్న సూర్యుని ఎర్రని కాంతి గోదావరిపై పరచుకుంటూ కనిపించింది. పలుచటి పొగమంచుతెరల మాటున గోదావరిపై అప్పటికే చేపలవేట సాగిస్తున్న మత్స్యకారుల చిన్న పడవలు అక్కడక్కడా స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎంత అద్భుతదృశ్యం! బ్యాగ్ నుండి వెంటనే కెమెరా తీసి ఆ దృశ్యాన్ని సొంతం చేసుకోవడం అసంకల్పితంగానే జరిగిపోయింది. బస్ ఉరుకుతుంటే కండ్లముందు దృశ్యాలు మారిపోతున్నాయి. రాజమండ్రి బస్‌స్టాండ్‌లో ఆగింది బస్. బస్‌నుండి కిందికి దిగుతుంటే తెలియని అనుభూతి! ఎందుకు? అనేక చారిత్రక ఘట్టాలకు ప్రత్యక్షసాక్షి అయిన ఓ పురానగరంలో అడుగు పెడుతున్నందుకా? ఓ యుగపురుషుడు నడయాడిన ప్రదేశాలను చూడబోతున్నందుకా? రెండూనూ...

బస్టాండ్ నుండి కందుకూరి వీరేశలింగం స్థాపించిన ఎస్‌కెవిటి (శ్రీకందుకూరి వీరేశలింగం థీస్టిక్ కాలేజ్)కాలేజికి చేరుకునేటప్పటికి చరిత్రకారులు, విద్యార్థులు, పరిశోధకులు అక్కడికి మెల్ల మెల్లగా చేరుకోవడం కనిపించింది. కాలేజీలోకి ప్రవేశించిన వెంటనే హితకారిణి సమాజం అనే చిన్న బోర్డు కనిపించింది. కందుకూరి స్థాపించిన ఆ సమాజం చేసిన సేవను గుర్తుకు తెచ్చుకుంటూ, చరిత్రకాంగ్రెస్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన బసకు చేరుకొని కాస్త సేదదీరి సమావేశ మందిరానికి చేరుకునే లోపు ఎందరో పాత మిత్రులు, యూనివర్సిటీ సహాధ్యాయులు, గురువులు కనిపించారు. అక్కడ చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన మాటలు తప్ప వేరే సంభాషణలు అంతగా వినిపించడంలేదు. ఉత్సాహవంతమైన వాతావరణంలో సదస్సు ప్రారంభమయింది.

43 ఏండ్ల క్రితం ప్రారంభమైన మొదటి ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌లో పాల్గొన్న ముగ్గురు ఫౌండర్ సభ్యులు ప్రొ.వకుళాభరణం రామకృష్ణ, కాళిదాసు పురుషోత్తం, డా.జి.వెంకటేశ్వరరావు అక్కడి వాతావరణాన్ని స్ఫూర్తివంతం చేశారు. ఇన్ని రోజులు ఒక రాష్ట్ర హిస్టరీ కాంగ్రెస్ నిరాటంకంగా జరగటం చాలా అరుదైన విషయం. సదస్సులో జరిగిన చర్చోపచర్చల గురించి ముచ్చటించుకోబోయే ముందు ఈ హిస్టరీ కాంగ్రెస్ తెలుగు జాతికి చేసిన సేవలను కొద్దిగానైనా పాఠకులు తెలుసుకోవాలి. నలభై మూడేండ్ల నుంచి ఇప్పటివరకు క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఈ సంస్థ సదస్సులు నిర్వహించి ప్రొసీడింగ్స్‌ని ముద్రిస్తూనే ఉంది. ఎందరో సాధారణ విద్యార్థులను చరిత్ర పరిశోధకులుగా తీర్చిదిద్దింది. అన్నింటికన్నా గొప్పగా చెప్పుకోవలసిన విషయం 'ఆంధ్రప్రదేశ్ కాంప్రహెన్సివ్ హిస్టరీ' సిరీస్‌లో భాగంగా 9 సంపుటాలు ముద్రించడం. ఈ సంపుటాలు తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల చరిత్రపై సమగ్ర సమాచారాన్ని అందించాయి. ప్రాచీన శిలాయుగాల నుండి క్రీస్తుశకం 2000 వరకు ఉన్న తెలుగు ప్రాంతాల చరిత్రను ఎంతో శ్రమకు ఓర్చి తెలుగు ప్రజలకు అందించిన ఈ సంస్థను తెలుగువారు ఎప్పుడూ మరువరాదు. ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ జనరల్ ఎడిటర్‌గా వెలువడిన సంపుటాలకు ఎందరో చరిత్రకారులు, పరిశోధకులు రచనాసహకారం అందించారు. వారందరూ తెలుగువారికి ఎనలేని సేవచేసినవారుగా గుర్తుండిపోతారు.

ఇక సదస్సు విశేషాలకు వస్తే... ప్రాచీనయుగం, మధ్యయుగం, ఆధునికయుగం, స్థానిక చరిత్రల విభాగాలే కాకుండా హిస్టరియోగ్రఫీ (చరిత్రరచనా శాస్త్రం) అనే విభాగంతో కలిపి మొత్తం ఐదు విభాగాలుగా ఈ చరిత్ర సదస్సు విభజితమై సాగింది. ఆధునిక, మధ్య యుగ చరిత్ర విభాగాల్లో ఎక్కువ మంది పరిశోధకులు పాల్గొన్నా మిగిలిన విభాగాల్లోనూ చర్చలు ప్రయోజనాత్మకంగా జరిగాయి.

మతోన్మాదం ఆధునిక కాలపు కుక్కమూతి పిందె

చరిత్ర సదస్సుకు ముఖ్య అతిథిగా, హిస్టరియోగ్రఫీ సెషన్‌కి అధ్యక్షులుగా ప్రొఫెసర్ సలీల్ మిశ్రా మతోన్మాదుల కండ్లు తెరిపించే ఉపన్యాసం ఇచ్చారు. మతసామరస్యం గొప్పదనాన్ని, చరిత్ర రచనలో మతోన్మాదం (కమ్యునలిజం) ఎట్లా ఉన్నదన్న విషయాలను ఈయన ఉదాహరణ సహితంగా వివరించారు. ఢిల్లీలోని అంబేద్కర్ యూనివర్సిటీకి ప్రొ వైస్‌ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న ఈ చరిత్ర ఆచార్యుడు కమ్యునలిజంపై విస్తృతమైన పరిశోధనచేశారు. ప్రముఖ చరిత్రకారుడు బిపన్ చంద్ర శిష్యుడైన ఈయన తన గురువు చెప్పిన సంగతులను గుర్తు చేసుకుంటూ ప్రస్తుత సమాజంలో కనిపిస్తున్న మతోన్మాదం మధ్యయుగ కాలం నుండి భారతీయ సమాజానికి వారసత్వంగా సంక్రమించినది కాదని అన్నారు. భారతదేశం వంటి అనేక మతాలు, సంస్కృతులు ఉన్నదేశంలో మతపరమైన గొడవలు జరిగి అశాంతి రేగడం సహజమే అన్నమాటా సరికాదన్నారు. మతపరమైన విభేదాలు ఉన్నా అవి మతోన్మాదానికి దారితీస్తాయన్న మాట అవాస్తవం అన్నారు. మతోన్మాదం కేవలం ఆధునిక కాలపు పరిణామం మాత్రమే. ఈ పరిణామానికి ఆధునిక కాలపు సామాజిక, రాజకీయ అంశాలే కారణాలు అని ఆయన నిర్ద్వంద్వంగా పేర్కొన్నారు. ఈ ఆధునిక రాజకీయ, సామాజిక శక్తులు, అంశాలు దోహదం చేయకపోతే ఇప్పుడు మనం చూస్తున్న మతోన్మాదం తలెత్తేదే కాదని ఆయన అన్నారు. మతోన్మాద మూలాలు మరీ అంత ప్రాచీనం కాదు కాబట్టి, దానికి భారతీయ చరిత్ర, సంస్కృతులకు అవినాభావ సంబంధం లేదు కాబట్టి దానిపై యుద్ధం చేసి మన సమాజం నుంచి తరిమివేయవచ్చని ప్రొఫెసర్ సలీల్ మిశ్రా గట్టిగా చెప్పుకొచ్చారు.




సలీల్ మిశ్రా

మునిగిపోతున్న వారసత్వ సంపదను...

కాలంతో పాటు విలువలూ, ప్రాధమ్యాలు కూడా మారిపోతుంటాయి. చరిత్ర, సంస్కృతులకు ఇచ్చే గౌరవ మర్యాదలు, వాటిని రక్షించుకునేటందుకు పడే తపన కూడా మార్పులకు లోనవుతున్నది. భూమి పుట్టినప్పటి నుండి ఇప్పటివరకు ఉన్న అన్ని పరిణామ దశలకు భారతదేశం ప్రత్యక్ష సాక్షి. ముఖ్యంగా మానవ పరిణామానికి సంబంధించిన అన్ని యుగాలకు, దశలకు సంబంధించిన భౌతిక ఆధారాలు మనదేశంలో ఉన్నాయి. మన తెలుగు రాష్ట్రాలను ఆదిమానవుని నుంచి నేటి మానవుని వరకు మానవుని కార్యకలాపాలను రికార్డు చేసిన రిజిస్టర్లు మాదిరిగా చెప్పుకోవచ్చు. ఆదిమానవుని పనిముట్లున్న ప్రాంతాలు, సమాధులు, తొలిచారిత్రక యుగపు బౌద్ధ స్థూపాలు, జైన బసదులు, ఆలయాలు; మధ్యయుగపు దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు ఇట్లా ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలు త్వర త్వరగా నాశనమైపోతున్నాయి. జనాభా పెరుగుదల, అభివృద్ధికార్యకలాపాలు ఊపందుకోవడం వంటి కారణాల వల్ల ఈ చారిత్రక సంపద నాశనమైపోతున్నది. మానవ ఆవాసాలు, వ్యవసాయం కోసం కొత్త కొత్త ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతున్నది. ముఖ్యంగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం వల్ల వందల మైళ్ల విస్తీర్ణంలో ఉన్న భూ భాగాలు నీటి రిజర్వాయర్లలో మునిగి పోతున్నాయి. ఈ భూభాగాల్లో పైన చెప్పుకున్న అనేక చారిత్రక కట్టడాలు, ప్రదేశాలు ఉంటాయి. అందులో ఇప్పటికే మనకి తెలిసినవి కొన్ని ఉండవచ్చు. తెల్వనివీ ఉండవచ్చు. ఇవన్నీ శాశ్వతంగా జలసమాధి కాకముందే వాటి చరిత్రను రికార్డుచేయవలసి ఉంటుంది. ప్రాచీన స్థలాల్లో దొరికిన మానవుని పనిముట్లను సేకరించాలి. రాక్షసగుళ్లు అని పిలిచే ఇనుపయుగపు సమాధులను తవ్వి నాటి ప్రజల జీవన విధానాన్ని పునర్నిర్మించాల్సి ఉంటుంది. అట్లాగే గుడులు, గోపురాలు ఉంటే వాటిని అధ్యయనం చేయాలి. అవి మరీ విలువైనవి అనుకుంటే ఆ గుడులను ఏ రాయికి ఆ రాయిగా విప్పి అక్కడికి దూరంగా వేరే ప్రాంతానికి తరలించి మళ్లీ ఇదివరకు ఎట్లాగున్నవో అట్లాగే నిర్మించాలి. ఈ కార్యకలాపాలన్నీ సాల్వేజ్ ఆర్కియాలజీలో భాగం. ప్రపంచంలో పెద్ద ఎత్తున మొదటి సారిగా సాల్వేజ్ ఆర్కియాలజీ కార్యకలాపాలు ఈజిప్టులోని ఆశ్వాన్ డామ్ నిర్మాణ సమయంలో జరిగాయి. ఆ తర్వాత మన నాగార్జునసాగర్‌లోనే ఆ స్థాయిలో ఈ కార్యకలాపాలు నిర్వహించారు. నాగార్జున సాగర్‌లో ఇప్పుడు కనిపిస్తున్న బౌద్ధ స్థూపాలు, ఇతర కట్టడాలు ముంపుకు గురయ్యే ప్రాంతాల నుంచి తరలించి పునర్నిర్మించినవే. ఇందుకు ఎంతో సమయం, శ్రమ, టెక్నాలజీ అవసరం. దేశం మొత్తం మీద ఈ ప్రక్రియలో మన తెలుగు రాష్ట్రాలకు ఉన్న ప్రావీణ్యం మరెవరికీ లేదు. శ్రీశైలం, జూరాల, సోయమశిల, పోలవరం వంటి ప్రాజెక్టుల నిర్మాణంలోనూ ప్రాచీన కట్టడాలను, నిర్మాణాలను, వస్తువులను అన్వేషించి, తవ్వి వేరే ప్రాంతాలకు తరలించారు. ఇటువంటి ఎన్నో సాల్వేజ్ ఆర్కియాలజీ కార్యకలాపాల్లో పాల్గొన్న కె.ఎస్.బి.కేశవ ప్రాచీన చరిత్ర విభాగానికి అధ్యక్షులుగా ఈ సదస్సులో పాల్గొన్నారు. ఆయన అధ్యక్ష ఉపన్యాసంలో తన అనుభవాలను చెప్తూ సాల్వేజ్ ఆర్కియాలజీ ఆవశ్యకతను వివరించారు.

ఇది ఉమ్మడి ఆస్తి



ఇది తెలుగువారు అందరూ అభివృద్ధి చేసుకున్న సంస్థ. తెలుగు నేల పాలనా సౌలభ్యం కోసం ప్రాంతాలుగా విడిపోయింది. కాని తెలుగు ప్రజల చరిత్ర, సంస్కృతి ఉమ్మడి ఆస్తులుగానే ఉండిపోతాయి. వీరి మూలాలు ఒక్కటే. వీటిని ఎవరూ విభజించలేరు. అందుకే ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలవారి ఉమ్మడి సంస్థగానే కొనసాగుతున్నది. రెండు ప్రాంతాల చరిత్రకారులు, పరిశోధకులు ఎప్పటిలాగే ఈ సంస్థ సదస్సులను జయప్రదం చేస్తున్నారు. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్‌ను ఆ ప్రాంతవాసులు ఏర్పాటుచేసుకున్నారు. అదికూడా ఏపి హిస్టరీ కాంగ్రెస్‌లాగే అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాం. ఆ ప్రాంత చరిత్రసంస్కృతులపై మరింత కృషిజరిగితే అది మొత్తం తెలుగు జాతికి జరిగే మేలులో భాగమే అవుతుంది కదా!

- ప్రొ.వకుళాభరణం రామకృష్ణ,
విశ్రాంత ఆచార్యులు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదు

తెలంగాణ నుంచి..



వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్సు, లెక్చరర్స్, పరిశోధక విద్యార్థులు.. ఎవరైతేనేం... మొత్తానికి ఒక 30మంది ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌లో పాల్గొన్నారు. అట్లాగే హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనిర్సిటీ వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల నుంచి, ఖమ్మం, కొత్తగూడెం, కరీంనగర్ వంటి చోట్ల ఉన్న డిగ్రీకాలేజీల నుంచి కూడా చాలామంది వచ్చారు. నాకు తెలిసినంతవరకు యాభై నుండి అరవైమంది వరకు ఈ సదస్సులో తెలంగాణ నుంచి వచ్చినవారు పాల్గొన్నారు. మొత్తం మీద సుమారు 180 దాకా పేపర్లు ప్రెజెంట్ చేసినవారుంటే అందులో తెలంగాణవారు అరవైమంది వరకు ఉన్నారంటే... పాలనా పరంగా రెండు ప్రాంతాలుగా తెలుగు నేల విడిపోయినా చరిత్రకారులు మాత్రం కలిసే ఉన్నారని అర్థమవుతున్నది. ఆంధ్ర ప్రాంతంవారు తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్‌లో పాల్గొనవచ్చు, తెలంగాణవారు ఏపి హిస్టరీకాంగ్రెస్‌లో పాల్గొనవచ్చు. అందరమూ తెలుగువారి చరిత్రను బయటకు తీయడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం.

- ప్రొ.అయూబ్ అలీ; తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు



వస్తు సంస్కృతులు, స్థానిక చరిత్రలు

మధ్యయుగ చరిత్రవిభాగానికి అధ్యక్షులుగా వ్యవహరించిన ప్రొ.కె.కనకరత్నం తన ఉపన్యాసంలో మధ్యయుగంలో తెలుగు నేలపై విలసిల్లిన కులవృత్తులవారి వస్తు సంస్కృతులను ఆవిష్కరించారు. కమ్మరి, వడ్డెర, కాశె, కుమ్మరి, చాకలి, మంగలి, మాదిగ, యాదవ, విప్రవినోదులు, వీరముష్టి, పిచ్చికుంట్ల, గౌడ వంటి కులాలు ఉపయోగించిన పనిముట్లు, వాటి ఉపయోగితా విలువలను వివిధ సాహిత్య, శాసనాధారాల ఆధారం చేసుకొని వివరించారు.

అట్లాగే ఆధునిక చరిత్ర విభాగానికి అధ్యక్షత వహించిన మహమ్మద్ సిలాల్ నిజాం కాలంలో ప్రజలు తిరుగుబాటు చేసి స్థాపించుకున్న పరిటాల, గానుగపాడు స్వతంత్ర రిపబ్లిక్‌ల గురించి తన అధ్యక్ష ఉపన్యాసంలో విశ్లేషించారు. కమ్యూనిస్టుల మార్గదర్శకత్వంలో ప్రజలు ఏ విధంగా పోరుబాట పట్టారు, ఏ విధంగా దాదాపు ఒక ఏడాదిపాటు స్వయంపాలన సాగించుకున్నారనే విషయాలను కూలంకుషంగా చర్చించారు. ఇట్లాంటి స్థానికంగా జరిగిన తిరుగుబాట్లన్నింటినీ విడివిడిగా అధ్యయనం చేస్తేనే తెలంగాణ సాయుధపోరాటం బృహత్తర స్వరూపం ఆవిష్కృతం అవుతుందని ఆయనన్నారు.

చరిత్ర కాంగ్రెస్‌కి ఆతిథ్యం వహించిన ఎస్‌కెవిటి కాలేజి ప్రిన్సిపల్ డా.పి.ఎబెల్ రాజబాబు స్థానిక చరిత్ర విభాగానికి అధ్యక్షత వహించారు. ఆయన గోదావరి జిల్లాల చరిత్రపై ఉపన్యసించారు. ప్రాచీన కాలం నుంచి 1925వ సంవత్సరం వరకు ఆ జిల్లాల భూభాగంలో జరిగిన పరిణామాలను విశ్లేషించారు. ముఖ్యంగా గ్రామదేవతలపై ఆయన పేర్కొన్న సంగతులు ఆసక్తికరంగా ఉన్నాయి.

టెక్నాలజీ పాత్ర మరువరానిది

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంత్రొపోలజీ (మానవ అధ్యయన శాస్త్రం) విశ్రాంత ఆచార్యులు కె.తిమ్మారెడ్డి ఏపి హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్‌గా అద్భుతంగా ఉపన్యసించారు. తెలుగువారి చరిత్రలోని చాలా ఘట్టాలను పునర్నిర్మించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. చరిత్రకారుల దృష్టి అంతగా పడని ఎన్నో రాజవంశాలను, వారి కాలపు ప్రజల బతుకుల గురించి మళ్లీ అధ్యయనం చేయాలని ఆయన అన్నారు. ముఖ్యంగా ఆర్కియాలజీ (పురావస్తు శాస్త్రం) వంటి వాటికి ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యం ఇవ్వక పోగా ఉన్న ప్రాధాన్యాన్ని తగ్గించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. తరువాతి తరాలవారికి మన చరిత్ర సంస్కృతులను అందించడానికి పురావస్తు శాస్త్రం, చరిత్ర వంటి సబ్జెక్టుల అవసరం ఎంతైనా ఉందన్నారు. పురావస్తు శాఖ కుడా కొత్తతరానికి అన్వేషణ, తవ్వకాలు, శాసన విభాగం నాణేల అధ్యయనం వంటి వాటిలో శిక్షణ ఇవ్వాలన్నారు.

ముఖ్యంగా మన ప్రాచీన, మధ్య యుగాల నాటి టెక్నాలజీపై తగిన శ్రద్ధ చూపడంలో చరిత్రకారులు విఫలమయ్యారని ప్రొ.తిమ్మారెడ్డి అన్నారు. పెద్ద పెద్ద, గుడులు, గోపురాలు నిర్మించడానికి ఎటువంటి టెక్నాలజీ వాడారో కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. నల్లగొండజిల్లా పానగల్‌లో ఉన్న ఛాయా సోమేశ్వరాలయాన్ని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ ఆలయంలోని స్తంభాల నీడ (ఛాయ) రోజులో ఏ సమయంలోనైనా గర్భగుడిలోని శివలింగంపై పడుతుంది. ఇది సాధ్యమవ్వడానికి నాటి నిర్మాణకారులు వాడిన టెక్నాలజీ ఏమిటో తెలుసుకోవాలన్నారు. ఇక్కడే కాదు అరసవెల్లిలోని సూర్యదేవాలయం, శ్రీశైలంలోని భ్రమరాంబిక ఆలయం, నెల్లూరులోని ఉదయకాలేశ్వర దేవాలయం వంటి దేవాలయాలు ఇటువంటి అద్భుత విజ్ఞానంతో కట్టినవేనని, ఈ విజ్ఞాన రహస్యాలను వెలికితీయవలసిన అవసరం ఉందని చెప్పారు.

బోగస్ పురాణాలు, ఉపనిషత్తులు...

మధ్యయుగ చరిత్రపై ఓ స్కాలర్ ప్రవేశపెట్టిన ప్రరిశోధనా పత్రంపై చర్చలో పాల్గొంటూ చెన్నైనుంచి వచ్చిన కె.వి.రామకృష్ణారావు మాట్లాడుతూ లిఖితాధారాలు అన్నీ నమ్మదగినవి కావని, వాటిలో కొన్ని బోగస్ రాతలు ఉంటాయని అటువంటివాటిని గుర్తించి చరిత్ర రచన చేయాలని హెచ్చరించారు. ఏవో ప్రయోజనాలను ఆశించి కొందరు వాస్తవవిరుద్ధమైన రాతలు రాశారని, కాలక్రమంలో అవే చరిత్రకారులు చారిత్రక ఆధారాలుగా భావించి చరిత్రనిర్మాణానికి సాక్ష్యాలుగా తీసుకుంటున్నారని ఇది సరికాదని అన్నారు. అక్బర్ కాలంలో హిందు పండితులు రాసినట్లు చెబుతున్న అల్లా ఉపనిషత్, బ్రిటీషర్స్ కాలంలో తమిళనాడులో సృష్టించబడిన అగ్ని పురాణం, ఇలంధై పురాణం, వలంధై పురాణం వంటివాటిని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. బ్రిటిష్ కాలంలో సాధ్యమైనన్ని ఎక్కువ కులాలను సృష్టించి భారతీయ సమాజాన్ని మరింత సంక్లిష్టంచేయాలని బ్రిటీష్‌వాళ్లు భావించారని, ఎన్ని పాయలుగా చీలిపోతే తమ అధికారం నిలవడం అంత సులువవుతుందని వారు భావించారని, ఆయనన్నారు. బ్రిటీష్‌వారి ఆజ్ఞమేరకు తాము కొత్త పురాణాలు రాస్తున్నట్లు ఆ పురాణ రచయితలే స్వయంగా ముందుమాటలో చెప్పిన విషయాన్ని రామకృష్ణారావు గుర్తు చేశారు. ఈ పురాణాలన్నీ 18, 19 శతాబ్దాల్లో సృష్టించబడినవేనని ఆయన పేర్కొన్నారు.



మ్యూజియంలో మొదటి వితంతు వివాహం దృశ్యం

సందర్భం వచ్చింది కాబట్టి అల్లా ఉపనిషత్ గురించి కూడా రెండుమాటలు చెప్పుకోవాలి. ఈ ఉపనిషత్‌నే అల్లోపనిషత్ అని కూడా అంటారు. మొగలాయి చక్రవర్తి (16వ వతాబ్దం) పరిపాలనా కాలంలో సృష్టించిన ఉపనిషత్‌గా దీన్ని చరిత్రకారులు భావిస్తున్నారు. స్వామి దయానంద సరస్వతి విరచిత 'సత్యార్థప్రకాశిక' అల్లోపనిషత్ ఉపనిషత్తులలో భాగం కాదని, అథర్వవేదంలోకూడా ఎక్కడా దాని ఊసు లేదని అంటున్నది. రాముడు హనుమంతునికి సాధికారికమైన ఉపనిషత్తులు అని చెబుతూ ఇచ్చినట్లు ప్రచారంలో ఉన్న 108 ఉపనిషత్‌ల జాబితా (ముక్తికా)లోను ఈ ఉపనిషత్ కనిపించదు. అల్లోపనిషత్ అక్బర్‌ని దేవదూతగా పేర్కొంటున్నది. అనంతకృష్ణ శాస్త్రి ముస్లిం పాలకుల బారి నుండి తప్పించుకోవడానికి కొందరు ఆర్య పండితులు ఈ ఉపనిషత్‌ని సృష్టించి ఉంటారని అభిప్రాయపడ్డారు. చార్లెస్ ఇలియట్ 'దీన్ ఇ ఇలాహి' స్థాపించిన కాలంలో అక్బర్‌ని ఉన్నతీకరిస్తూ రాసిన గ్రంథం కావచ్చని అభిప్రాయం వ్యక్తంచేశాడు. స్వామి వివేకానంద ఇది అక్బర్ కాలంలో హిందు, ముస్లింలను ఒకతాటి పైకి తీసుకువచ్చే క్రమంలో రాసినదిగా పేర్కొన్నాడు.



వీరేశలింగం నివసించిన ఇల్లు

కాబట్టి ఏవో కొన్ని ప్రయోజనాలను ఆశించి ఇటీవలి శతాబ్దాల్లో సృష్టించిన పురాణాలను, ఉపనిషత్తులను ప్రాచీన కాలపువాటిగా భావించి ఆ కాలపు సమాజ చరిత్ర, సంస్కృతులను నిర్మించే ప్రయత్నం చేయకూడదని, ఈ విషయంలో పరిశోధకులు జాగరూకులై మెలగాలని రామకృష్ణారావు అన్నారు.

అవీ ఇవీ..

హిస్టరీ కాంగ్రెస్ మొదటి రోజునాడు గత ఏడాది హిస్టరీ కాంగ్రెస్‌లో సమర్పితమైన పరిశోధనా వ్యాసాల (ప్రొసీడింగ్స్)ను ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదికాక మరో ఐదు వివిధ రచయితలు రాసిన గ్రంథాలను కూడా ఆవిష్కరించి పరిశోధకులను ప్రోత్సహించారు. ఇట్లా ప్రతిఏడాది జరుగుతుండటం ముదావహం. చివరి రోజు ముగింపు సమావేశాల్లో మన తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలు పాటలతో ఎస్‌కెవిటి కాలేజి విద్యార్థులు అలరించారు. అట్లాగే ప్రిన్సిపల్ రాజబాబు వీరేశలింగం పాత్ర ధరించిన వీరేశలింగం జీవిత చరిత్ర డాక్యుమెంటరీని కూడా ప్రదర్శించారు. కాలేజీ విద్యార్థులు సిబ్బంది మిగతా పాత్రల్లో జీవించిన ఈ డాక్యుమెంటరీ అప్పట్లో వీరేశలింగం ఎదుర్కొన్న కష్టాలను, చేసిన సేవను కండ్లముందుంచింది.

చివరి రోజు వీరేశలింగం నివసించిన గృహానికి వెళితే అది ప్రభుత్వ మ్యూజియంగా దర్శనమిచ్చింది. ఆయన జన్మించిన గది, పత్రికలు ప్రింట్ చేసిన గది, వితంతువులకు ఆశ్రయం ఇచ్చిన గది, తన భార్య రాజ్యలక్ష్మి పేర కట్టిన గృహం... ఇట్లా ఆ గృహసముదాయంలో తిరుగుతూ ఆ మహానుభావుడు వాడిన వస్తువులు, స్వదస్తూరితో రాసిన లేఖలు, అందుకున్న లేఖలు, ఇతర సమాచారాన్ని తెలిపే ప్రతులు చూసి మేమందరం ఎంతో ఆనందించాం. ఆయన తన ప్రచురణల కోసం వాడిన ప్రింటింగ్ మిషన్ ఇప్పటికీ ఉన్నది. అట్లాగే వీరేశలింగంగారు స్థాపించిన ఇతర విద్యాసంస్థలను కూడా దర్శించాం. చివరగా వీరేశలింగం దంపతుల సమాధులున్న మందిరాన్ని చూసి గుండెనిండా ఆయన స్ఫూర్తినింపుకొని హైదరాబాదు బస్ ఎక్కాం.

- జి.శివరామకృష్ణయ్య
7702508259



సాల్వేజ్ ఆర్కియాలజీలో భాగంగా నాగార్జున సాగర్‌లో పునర్నిర్మించిన కట్టడాలు

కివీస్‌కు కోహ్లిసేన హ్యాట్రిక్ పంచ్. ఆతిథ్య న్యూజిలాండ్‌పై వరుసగా మూడు వన్డేల్లో గెలుపొందిన టీమ్ ఇండియా మరో రెండు మ్యాచుల ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకున్నది. బ్యాట్స్‌మెన్ రాణించటానికి తోడు బౌలర్లు సమష్టి ప్రదర్శనతో మెరవటంతో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ఎదురులేని భారత్

- 3-0తో వన్డే సిరీస్ కైవసం
- రాణించిన రోహిత్, కోహ్లి
- మెరిసిన షమి, భువి, చాహల్

సొంతగడ్డపై కివీస్ హ్యాట్రిక్ ఓటమి





మౌంట్ మాంగనుయ్

టీమ్ ఇండియా ఖాతాలో మరో సిరీస్ విజయం. ఇంకో రెండు మ్యాచులు ఉండగానే ఐదు వన్డేల సిరీస్ 3-0తో కోహ్లిసేన వశమైంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత్ హ్యాట్రిక్ విజయంతో ఆతిథ్య న్యూజిలాండ్ ఆశలు ఆవిరి చేసింది. ఓపెనర్ రోహిత్ శర్మ (62, 77 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ విరాట కోహ్లి (60, 74 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. అంబటి రాయుడు (40 నాటౌట్), దినేశ్ కార్తీక్ (38 నాటౌట్) నాల్గో వికెట్‌కు అజేయ భాగస్వామ్యంతో మెరువగా మూడో వన్డేలో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ రాస్ టేలర్ (93, 106 బంతుల్లో 9 ఫోర్లు), టామ్ లాథమ్ (51, 64 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించగా 243 పరుగులు చేసింది. భారత బౌలర్లు మహ్మద్ షమి (3/41), భువనేశ్వర్ (2/46), హార్దిక్ పాండ్య (2/45), చాహల్ (2/51) న్యూజిలాండ్‌ను మరోసారి స్వల్ప స్కోరుకే పరిమితం చేశారు. భారత సీమర్ మహ్మద్ షమి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. సిరీస్‌లో నాల్గో వన్డే గురువారం (జనవరి 31) హామిల్టన్‌లో జరుగనున్నది.

ఆడుతూ.. పాడుతూ : స్వల్ప ఛేదనను టీమ్ ఇండియా దూకుడుగా ఆరంభించింది. బ్రేస్‌వెల్ వేసిన రెండో ఓవర్లో హ్యాట్రిక్ బౌండరీలు బాదిన శిఖర్ ధావన్ (28) ధనాధన్ ఆరంభాన్ని అందించాడు. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ (62) నెమ్మదిగా ఆడుతుండగా ధావన్ ఆరు ఫోర్లతో హల్‌చల్ చేశాడు. అదే జోరులో బౌల్ట్‌పై షాట్‌కు ప్రయత్నించి తొలి స్లిప్స్‌లో టేలర్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ తొలి వికెట్ కోల్పోయాడు. కెప్టెన్ కోహ్లి (60)తో జట్టుకట్టిన రోహిత్ శర్మ శతక భాగస్వామ్యం నెలకొల్పాడు. కోహ్లి వచ్చీ రాగానే ఫెర్గుసన్ బంతిని పాయింట్ దిశగా బౌండరీ బాదగా, శాంట్నర్ ఓవర్లో స్ట్రయిట్ సిక్సర్‌తో రోహిత్ శర్మ ఊపందుకున్నాడు. రోహిత్ 63 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, ఫెర్గుసన్ బౌన్సర్‌ను కట్‌తో సిక్సర్‌గా మలిచిన కోహ్లి 59 బంతుల్లో కెరీర్ 49వ అర్ధ సెంచరీ సాధించాడు. అర్ధ సెంచరీల తర్వాత జోరు పెంచిన ఈ జోడీ, స్వల్ప విరామంలో వికెట్లు కోల్పోయారు. బౌల్ట్‌కు కోహ్లి, శాంట్నర్‌కు రోహిత్ చిక్కటంతో వెన్వెంటనే అర్ధ శతక హీరోలు పెవిలియన్‌కు చేరారు. ఈ దశలో భారత్‌పై ఒత్తిడి పెంచాలని భావించిన కివీస్‌కు అంబటి రాయుడు (40 నాటౌట్), దినేశ్ కార్తీక్ (38 నాటౌట్) నిరాశే మిగిల్చారు. సాధించాల్సిన రన్‌రేట్ తక్కువగానే ఉండటంతో ఈ జోడీ ఎటువంటి రిస్క్ తీసుకోలేదు. రాయుడు ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగగా, కార్తీక్ సైతం ఐదేసి ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిశాడు. వీరిద్దరి 77 పరుగుల అజేయ భాగస్వామ్యంతో 43 ఓవర్లలోనే భారత్ లాంఛనం ముగించింది.

టేలర్ మెరిసినా.. : టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్‌కు టాప్ ఆర్డర్ వైఫల్యం మళ్లీ నిరాశ పరిచింది. కొత్త బంతితో భువనేశ్వర్, మహ్మద్ షమిలు ఓపెనర్లను మరోసారి వెనక్కి పంపించారు. నాలుగు ఫోర్లతో జోరుమీదున్న కెప్టెన్ విలియమ్సన్ (28) మిడ్ వికెట్‌లో హార్దిక్ పాండ్య కండ్లుచెదిరే క్యాచ్‌తో పెవిలియన్‌కు చేరుకున్నాడు. 59/3తో న్యూజిలాండ్ పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ రాస్ టేలర్ (93), టామ్ లాథమ్ (51) నాల్గో వికెట్‌కు 119 పరుగుల సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. భారత బౌలర్లు నిప్పులు చెరుగుతున్న వేళ సావధానంగా బ్యాటింగ్ చేసిన టేలర్, లాథమ్ కివీస్ ఇన్నింగ్స్‌ను పునర్ నిర్మించారు. 71 బంతుల్లో టేలర్ అర్ధ సెంచరీ సాధించగా, లాథమ్ 71 బంతుల్లో ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. అర్ధ సెంచరీ తర్వాత టేలర్ వేగంగా ఆడినా, లాథమ్ చాహల్ వలలో పడి వికెట్ కోల్పోయాడు. ఆ తర్వాత మరో ఎండ్‌లో టేలర్‌కు సహకారమే దక్కలేదు. నికోల్స్ (6), శాంట్నర్ (3)లను హార్దిక్ పాండ్య అవుట్ చేయగా, బ్రేస్ వెల్ (15)ను కోహ్లి రనౌట్ చేశాడు. టెయిలెండర్లు సోధి (12), బౌల్ట్ (2)లను షమి, భువి పంచుకున్నారు. దీంతో న్యూజిలాండ్ 49 ఓవర్లలో 243 పరుగులకే కుప్పకూలింది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు వికెట్లేమీ దక్కలేదు.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : మార్టిన్ గప్టిల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 13, కొలిన్ మన్రో (సి) రోహిత్ (బి) షమి 7, కానె విలియమ్సన్ (సి) పాండ్య (బి) చాహల్ 28, రాస్ టేలర్ (సి) కార్తీక్ (బి) షమి 93, టామ్ లాథమ్ (సి) రాయుడు (బి) చాహల్ 51, హెన్రీ నికోల్స్ (సి) కార్తీక్ (బి) పాండ్య 6, మిచెల్ శాంట్నర్ (సి) కార్తీక్ (బి) పాండ్య 3, బ్రేస్‌వెల్ రనౌట్ (కోహ్లి) 15, సోధి (సి) కోహ్లి (బి) షమి 12, బౌల్ట్ (సి) షమి (బి) భువనేశ్వర్ 2, ఫెర్గుసన్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (49 ఓవర్లలో ఆలౌట్) 243.**

వికెట్ల పతనం : 1-10, 2-26, 3-59, 4-178, 5-191, 6-198, 7-222, 8-239, 9-239, 10-243.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 10-1-46-2, మహ్మద్ షమి 9-0-41-3, యుజ్వేంద్ర చాహల్ 9-0-51-2, హార్దిక్ పాండ్య 10-0-45-2, కుల్దీప్ యాదవ్ 8-0-39-0, కేదార్ జాదవ్ 3-0-17-0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (స్టంప్డ్) లాథమ్ (బి) శాంట్నర్ 62, శిఖర్ ధావన్ (సి) రాస్ టేలర్ (బి) బౌల్ట్ 28, విరాట్ కోహ్లి (సి) నికోల్స్ (బి) బౌల్ట్ 60, అంబటి రాయుడు నాటౌట్ 40, దినేశ్ కార్తీక్ నాటౌట్ 38, ఎక్స్‌ట్రాలు : 17, **మొత్తం : (43 ఓవర్లలో 3 వికెట్లకు) 245.**

వికెట్ల పతనం : 1-39, 2-152, 3-168.

బౌలింగ్ : ట్రెంట్ బౌల్ట్ 10-1-40-2, బ్రేస్‌వెల్ 6-0-49-0, ఫెర్గుసన్ 10-1-57-0, శాంట్నర్ 10-0-45-1, ఇశ్ సోధి 7-0-53-0.



సిరీస్‌పై కన్నేసి...

కివీస్‌తో మిథాలీసేన రెండో వన్డే నేడు

మౌంట్ మాంగనుయ్ : వివాదాలను మరిపించే విజయంతో న్యూజిలాండ్ పర్యటనను మొదలెట్టిన టీమ్ ఇండియా అమ్మాయిలు నేడు సిరీస్‌పై కన్నేసి రెండో వన్డేకు సిద్ధమవుతున్నారు. భారత స్పిన్ త్రయం ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్, దీప్తి శర్మల మాయతో తొలి వన్డేలో న్యూజిలాండ్ అమ్మాయిలు చిత్తుగా ఓడారు. స్టార్ ఓపెనర్ మంధాన శతక విన్యాసానికి తోడు యువ కెరటం జెమీమీ రొడ్రిగస్ కెరీర్ తొలి అర్ధ సెంచరీ భారత్‌కు 9 వికెట్ల విజయాన్ని అందించింది. ఐసీసీ వరల్డ్ చాంపియన్‌షిప్ జాబితాలో నాల్గో స్థానంలో నిలిచిన టీమ్ ఇండియా, కివీస్‌పై సిరీస్ విజయం ర్యాంక్‌ను మరింత మెరుగు పర్చుకునే పనిలో పడింది. అన్ని విభాగాల్లో మెరుగ్గా కనిపిస్తోన్న మిథాలీసేన మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ సొంతం చేసుకోవాలని భావిస్తోంది. మరోవైపు ఫేవరెట్‌గా సిరీస్‌ను ఆరంభించిన కివీస్ నేటి మ్యాచ్‌లో ఓడితే ఆశలు వదులుకోవాల్సిందే. సుజీ బేట్స్, ఆమీ, కాస్పరెక్‌లు న్యూజిలాండ్‌కు కీలకం. కానీ మంచి ఫామ్‌లో ఉన్న మిథాలీసేనను ఓడించాలంటే కివీస్ సమష్టి ప్రదర్శన చేయాల్సిందే. భారత్, న్యూజిలాండ్ రెండో వన్డే నేడు 6.30 గంటలకు స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం.

రంజీ ఫైనల్లో సౌరాష్ట్ర


- పుజారా అజేయ శతకం



బెంగళూర్ : ఐదో రోజు మరో 55 పరుగుల కోసం బరిలోకి దిగిన సౌరాష్ట్ర ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కర్ణాటక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న చతేశ్వర్ పుజారా (131 నాటౌట్), షెల్డన్ జాక్సన్ (100)లు 214 పరుగులు జోడించి సౌరాష్ట్రను రంజీ ట్రోఫీ ఫైనల్లోకి తీసుకెళ్లారు. చేతిలో మరో ఏడు వికెట్లున్నా, పుజారా ఎటువంటి రిస్క్ తీసుకోలేదు. సెంచరీ తర్వాత జాక్సన్ అవుటైనా..మన్కడ్ (7)తో కలిసి పుజారా లాంఛనం పూర్తి చేశాడు. కర్ణాటక వరుసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో 275, 239 పరుగులకు ఆలౌట్ కాగా, సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగులే చేసినా.. ఛేదనలో 282/5తో అదరగొట్టింది. ఫిబ్రవరి 3 నుంచి జైపూర్‌లో జరిగే రంజీ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ విదర్భతో సౌరాష్ట్ర తలపడనున్నది. రంజీ ఫైనల్స్‌కు చేరటం సౌరాష్ట్రకు ఇది మూడోసారి మాత్రమే.

మెరుగైన క్రికెటర్ కాగలడు!

- పాండ్యపై కెప్టెన్ కోహ్లి భరోసా



మౌంట్ మాంగనుయ్ : మరో రెండు మ్యాచులు ఉండగానే సిరీస్ విజయాన్ని అందించి, కెప్టెన్ కోహ్లి స్వదేశానికి పయనమయ్యాడు. సీనియర్ సెలక్షన్ కమిటీ ప్రపంచకప్‌కు ముందు కోహ్లికి విశ్రాంతినిచ్చిన సంగతి తెలిసిందే. మూడో వన్డే విజయానంతరం జట్టుకు వీడ్కోలు పలికిన కోహ్లి ఆసక్తికర విషయాలు మాట్లాడాడు. ' వివాదాలను ఎదుర్కొనేందుకు రెండు మార్గాలుంటాయి. పాండ్య ఈ వివాదంతో మెరుగైన క్రికెటర్‌గా ఎదుగుతాడని భావిస్తున్నాను. ఆ తప్పిదం నుంచి పాండ్య నేర్చుకుంటాడని నా విశ్వాసం. యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ ఆటను నెట్స్‌లో చూశాను. నేను గిల్ వయసులో ఉండగా అతడిలో పది శాతమైనా ఆడలేదు. ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. పృథ్వీ షా అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు, ఇప్పుడు గిల్ సైతం మెరుస్తాడు' అని కోహ్లి అభిప్రాయపడ్డాడు

మల్లన్నసాగర్ పనులు వేగవంతం చేయండి

నీటిపారుదల శాఖకు సీఎం ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కాళేశ్వరం ఎత్తిపోతల పతకంలో భాగంగా ప్రతిపాదించిన మల్లన్నసాగర్ జలాశయం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీఎం కేసీఆర్ నీటిపారుదల శాఖను ఆదేశించారు. ప్రభుత్వ యంత్రాంగంతో ఇటీవల రైతులు జరిపిన చర్చలు సఫలం కావటంతో భూసేకరణ ప్రక్రియకు అవాంతరాలు తొలగిపోయినట్టేనని సీఎం కార్యాలయం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన ప్యాకేజీలతో సమాంతరంగా మల్లన్నసాగర్ పనులు కూడా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురైన వివాదాల కారణంగా ఇప్పటి వరకూ ఈ రిజర్వాయర్ పనులు ప్రారంభం కాలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో అతి కీలకమైన మల్లన్నసాగర్ ఆది నుంచీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. 50 టీఎంసీల నీటిని నిల్వ చేసే ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నది. తమ భూములు ఇవ్వటానికి కొన్ని గ్రామాల రైతులు అంగీకరించక పోవటంతో రాష్ట్ర సర్కారుకు ఎదురుదెబ్బ తగిలింది. తొగుట మండలం వేములఘాట్ గ్రామ రైతులు ప్రభుత్వ ఒత్తిడులకు లొంగకుండా రెండు సంవత్సరాలకు పైగా పోరాటం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ గ్రామ రైతులపై ఒత్తిడి పెంచుతూనే మిగిలిన ఐదు గ్రామాల రైతుల వద్ద నుంచి రెవిన్యూ అధికారులు భూములను సేకరించారు. ఈ గ్రామాల రైతులకు ఎకరానికి సగటున రూ. 6 లక్షలు మాత్రమే చెల్లించగా చివరి వరకూ పోరాటం చేసిన వేములఘాట్ రైతులకు ఎకరానికి రూ. 11 లక్షల వరకూ ఇవ్వటానికి ప్రభుత్వం అంగీకరించింది. రిజర్వాయర్ కోసం 16,395.92 ఎకరాలు సేకరించాల్సి ఉండగా గత సంవత్సరం వరకూ ప్రభుత్వం 14,750 ఎకరాలు సేకరించింది. మరో 1,600 ఎకరాలు సేకరించాల్సి ఉండగా . దీనిలో 1,400 ఎకరాలు వేమలఘాట్ గ్రామానికి చెందిన రైతులవి కావటం విశేషం. ఈ గ్రామానికి చెందిన రైతులు హైకోర్టును ఆశ్రయించారు. రూ. 5,600 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం గత సంవత్సరమే టెండర్ల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. వలయాకారంలో 24 కిలోమీటర్లు నిర్మించే రిజర్వాయర్ పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించి కాంట్రాక్టర్లకు అప్పగించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జరుగుతున్న కొన్ని ప్యాకేజీల పనులు వేగవంతం కావటంతో ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు వచ్చే జూన్ నెలలో నీటిని తరలించి ఖరీఫ్‌కు సాగునీరందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. మిడ్‌మానేరు, కొండపోచమ్మ రిజర్వాయర్ల మధ్య ప్రతిపాదించిన మల్లన్నసాగర్ పనులు ప్రారంభం కాక పోవటంతో ఒక దశలో ప్రత్యామ్నాయ మార్గం ద్వారా కొండపోచమ్మ రిజర్వాయర్‌కు నీటిని తరలించటానికి నీటిపారుదల శాఖ నిర్ణయించింది. ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగంగా గతంలో తడ్కపల్లి వద్ద 1.5 టీఎంసీల సామర్థ్యంతో ఒక రిజర్వాయర్‌ను ప్రతిపాదించారు.



తడ్కపల్లి-కొండపోచమ్మ సాగర్ మధ్య తవ్విన కాల్వ ద్వారా నీటిని తరలించటానికి నిర్ణయించింది. దాదాపు రూ. 100 కోట్ల వ్యయంతో ఈ కాల్వ పనులు కొంత మేరకు జరిగినా మధ్యలోనే ఆగిపోయాయి. మల్లన్నసాగర్ కింద 1,65,000 ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని ప్రతిపాదించగా ఇదే రిజర్వాయర్ ద్వారా కొండపోచమ్మ, బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు తరలించే నీటితో మరో 3,80,000 ఎకరాలు సాగులోకి రానుంది. కొండపోచమ్మ , గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ల పనులను పూర్తి చేసి ప్రతిపాదిత ఆయకట్టుకు నీరందించటానికి ప్రభుత్వం పనులను వేగవంతం చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరి నదిపై నిర్మిస్తున్న మూడు బ్యారేజీల సామర్థ్యం కన్నా మల్లన్నసాగర్ సామర్థ్యం దాదాపు రెట్టింపు కావడం విశేషం. వీటిలో మేడిగడ్డ బ్యారేజీ 19.73 టీఎంసీలు, అన్నారం బ్యారేజీ 6.22 టీఎంసీలు, సుందిళ్ళ బ్యారేజీ 2.16 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టగా గతంలో నిర్మించిన ఎల్లంపల్లి బ్యారేజీ 20 టీఎంసీల సామర్థ్యం కలిగి ఉన్నది.

ఎస్సై పోస్టులకు తొలగిన అడ్డంకి

సింగిల్ జడ్జి ఆదేశాలపై డివిజన్ బెంచ్ స్టే

- ఆరు ప్రశ్నలు తొలగించడంలో జోక్యం చేసుకోలేమన్న న్యాయమూర్తులు



నవ తెలంగాణ-హైదరాబాద్

సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్సై) పోస్టుల భర్తీకి ఉన్న న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. గతంలో సింగిల్ జడ్జి ఆదేశాలపై ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన డివిజన్ బెంచ్ స్టే ఉత్తర్వులిచ్చింది. ఎస్సై పోస్టుల భర్తీ కోసం జరిగిన పరీక్షలో ఇచ్చిన ప్రశ్నల్లో ఆరింటిని తొలగించాలన్న ఉత్తర్వులను తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సవాల్ చేసింది. ఈ అప్పీల్ వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. ఎస్సై పోస్టులకు నిర్వహించిన రాతపరీక్షల పేపర్ బుక్‌లెట్ కోడ్ బీ లోని ఆరు ప్రశ్నలను తొలగించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. నియామక ప్రక్రియ 90 శాతం వరకూ జరిగినందున తాము జోక్యం చేసుకోబోమని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఒక ప్రశ్నకు రెండు రకాలైన జవాబులు ఉండవచ్చునని, ఏది రాసినా తప్పుకాదని తెలిపింది. అభ్యర్థులు తమ మార్కుల కోసం బోర్డుకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పింది.

పోలీస్, ఫైర్, జైళ్ల శాఖల్లో 1,217 ఎస్సై పోస్టుల భర్తీ కోసం బోర్డు 2018 మే 31న నోటిఫికేషన్ విడుదల చేసి అదే ఏడాది ఆగస్టు 26న రాతపరీక్ష నిర్వహించింది. బుక్‌లెట్ బి కోడ్‌లోని ఆరు ప్రశ్నలు, వాటి జవాబులు కూడా తప్పని పేర్కొంటూ నల్గొండ వాసి ఉపేందర్‌రెడ్డి సహా 15 మంది హైకోర్టును ఆశ్రయించారు. బుక్‌లెట్ బీ కోడ్‌లోని 117, 138, 172, 181, 185, 189 ప్రశ్నలను తొలగించిన తర్వాత అర్హుల జాబితాను వెల్లడించాలని సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అప్పటికే అర్హత సాధించిన వారిని మినహాయించాని ఆదేశాలిచ్చారు. దీనిపై బోర్డు సవాల్ చేసిన అప్పీల్ తరపున ప్రభుత్వ ప్రత్యేక లాయర్ శరత్ వాదిస్తూ.. ఆరు ప్రశ్నల్లో తప్పులు లేవన్నారు. సింగిల్ జడ్జి ఆదేశించినట్టుగా అభ్యర్థుల హాల్ టిక్కెట్లను, వారి మార్కుల్ని ప్రచురించడం కష్టమన్నారు. ఇప్పటికే అర్హత సాధించిన వారిని కొనసాగించవచ్చునని, ఆరు తప్పుడు ప్రశ్నలు తొలగించి మిగిలిన వారిలో అర్హుల్ని ప్రకటించాలని పిటిషనర్ లాయర్ వాదించారు.

వేములఘాట్ విజయం

ఎకరానికి రూ.11లక్షలు చెల్లించేందుకు ఒప్పుకున్న ప్రభుత్వం

- దీక్షలు విరమించిన నిర్వాసితులు
- వెంటనే సర్వే షురూ..!

నవతెలంగాణ-తొగుట

మల్లన్నసాగర్ ప్రాజెక్టులో ఇండ్లు, భూములు కోల్పోతున్న తమకు సరైన పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్ నిర్వాసితులు చేపట్టిన దీక్షలు ఫలించాయి. ఎట్టకేలకు ఎకరాకు రూ.11లక్షలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఒప్పుకోవడంతో 963రోజుల దీక్షలకు సోమవారం తెరపడింది. తమ పోరాటం విజయం సాధించినందుకు నిర్వాసితులు ఆనందం వ్యక్తం చేశారు. న్యాయం కోసం గ్రామంలో రైతులు ఒక కమిటీని రూపొందించుకున్నారు. పూర్తి స్థాయిలో రైతులకు రావల్సిన పరిహారం, ఇతర సౌకర్యాలు సాధించుకునేందుకు ఈ కమిటీ పనిచేస్తుందని గ్రామస్తులు చెప్పారు. ఎప్పటికప్పుడూ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు.. రైతులకు రావాల్సిన మౌలిక సౌకర్యాలపై ఈ కమిటీ పరిశీలిస్తుందన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు పూర్తయ్యే వరకు కమిటీ కొనసాగుతుందనీ, పరిహారంతో పాటు మిగతావన్నీ ఒప్పందం ప్రకారం అందకపోతే మళ్లీ కార్యాచరణ రూపొందిస్తామనీ కమిటీ సభ్యులు తెలిపారు.

వేములఘట్‌లో ప్రాజెక్టు పనులు ప్రారంభం..

రెండున్నరేండ్లకు పైగా దీక్షలు చేసిన వేములఘాట్ భూనిర్వాసితులు చివరకు ప్రాజెక్టు కోసం భూములివ్వక తప్పడం లేదు. సుమారు వెయ్యి ఎకరాలు ప్రాజెక్టుకు ఇక్కడి నుంచే ఇవ్వాల్సి ఉంది. మొదటినుంచి మల్లన్నసాగర్ నిర్మాణానికి వ్యతిరేకంగా, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని పోరాటం కొనసాగించారు. దీక్షలు ఏకంగా 963 రోజులు సాగాయి. లాఠీచార్జ్జీ, గాల్లో కాల్పులు, నిర్వాసితుల నిర్బంధం, పాలకుల ప్రలోభాలు లెక్కచేయకుండా సర్కార్‌తో పోరాడారు. చివరకు ప్రభుత్వం ఎకరానికి రూ.11లక్షల చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది. వెంటనే భూముల స్వాధీనానికి చర్యలు తీసుకుంది. గామస్తులతో చర్చలు నిర్వహించి భూ రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే కాలువ పనుల నిర్మాణానికి సర్వేలు చేపట్టింది. సోమవారం గ్రామంలో అధికారులు ఇండ్ల సర్వే పూర్తి చేస్తూ ఇంటింటికీ నెంబర్లు వేశారు. భూమి రిజిస్ట్రేషన్ చేసిన రైతులకు వెంటనే పరిహారం అందజేశారు. బోర్లు, బావులు, పైపులైన్లు తదితరాలకు మరింత సర్వే చేపట్టారు.



వేములఘాట్‌లో ఇంటికి నెంబర్ వేస్తున్న దృశ్యం

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.